

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 237

శనివారం 18-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏఐ దుర్వినియోగంతో సంక్షోభం

నేను పాట పాడినట్లు ఫేక్ వీడియో సృష్టించారు: ప్రధాని మోదీ - 6లో



ఏపీలో ఎలక్ట్రిక్ వాహన యూనిట్

ప్రపంచంలోనే అతి పెద్దది.. జర్మనీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రకటన - 12లో

శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. చిత్రంలో వంశీచంద్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, ఠాక్రే, రేవంత్‌రెడ్డి, సంపత్, మధుయాష్కీ గౌడ్, వి. హనుమంతరావు తదితరులు



ధరణి బదులు భూమాత

అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్

6 గ్యారంటీలు, 5 డిక్లరేషన్లకు అదనంగా కీలక ప్రకటనలు

- ఉద్యమ అమరుల కుటుంబాలకు రూ. 25 వేల పింఛన్, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- ఆడపిల్లల వివాహం కోసం రూ.లక్ష ఆర్థిక సాయం, తులం బంగారం
- రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఆర్థిక సాయం. కౌలు రైతులకూ ఈ పథకం వర్తింపు రైతు కూలీలకూ ఏటా రూ.12 వేలు ఆర్థిక సాయం
- ఉద్యోగుల సీపీఎస్ రద్దు.. వెంటనే పీఆర్సీ, డీఏ బకాయిలు
- 200 యూనిట్లలోపు వాడే వారికి కరెంటు ఫ్రీ
- ప్రభుత్వ పథకాల అమలు కోసం గ్రామ వలంటీర్ల వ్యవస్థ
- బీసీలకూ సబ్‌ప్లాన్.. క్రీమీలేయర్ ఎత్తివేతపై కేంద్రానికి సిఫార్సు
- అనుబంధ మేనిఫెస్టోలో జాబ్ కేలండర్.. కేడర్ల వారీగా పోస్టుల భర్తీకి తేదీల ప్రకటన
- బీఆర్ఎస్ పాలనలో అవినీతి ఆరోపణలు, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలు

2లో

వారి అవినీతి సంపదను ప్రజలకు పంచుతాం

నర్సంపేట, వరంగల్, పినపాక రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో రాహుల్ - వివరాలు 16లో

కేసీఆర్ వెళ్లడానికి రెడీ.. ప్రజలు పంపడానికి రెడీ

కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే - 2లో

కాంగ్రెస్‌లోకి విజయశాంతి

- మాజీ ఎంపీ మందా జగన్నాథం కూడా.. ఖర్గే సమక్షంలో చేరిక - 2లో

నేడు బీజేపీ మేనిఫెస్టో విడుదల

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా షెడ్యూల్‌లో మార్పులు
- మధ్యాహ్నం గద్వాల, నల్లగొండ, వరంగల్ సభలకు హాజరు - 3లో

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి!

- 4% ముస్లిం రిజర్వేషన్ ఎత్తివేత
- అక్రమ వలసదారుల బహిష్కరణ
- మహిళలకు 10 లక్షల ఉద్యోగాలు వృద్ధులకు ఉచితంగా కాశీ, అయోధ్య ప్రయాణాలు.. బీజేపీ మేనిఫెస్టోలో హామీల దశదిశ.. - 3లో

దర్జాగా బతుకుతున్నం.. మళ్లీ దగా పడదమా?

పరకాల, కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్



జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- 58 ఏళ్ల తెలంగాణ గోసకు కాంగ్రెస్ పార్టీయే కారణం
- కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నం.. ఒక్కటొక్కటిగా సర్దుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నం
- తలసరి ఆదాయంలో నేడు దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం
- తప్పుడు నిర్ణయం తీసుకుంటే ఆగమైతం
- పాలిచ్చే బర్రెను అమ్మి దున్నపోతును తెచ్చుకుంటే మెడకు తుంట కట్టుకున్నట్టు అవుతుంది
- కాంగ్రెస్ దోఖేబాజ్ పార్టీ.. బీజేపీది మతపిచ్చి అన్న ముఖ్యమంత్రి
- ఆ రెండు పార్టీలను నమ్మొద్దని, బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని విజ్ఞప్తి

5లో



మధ్యప్రదేశ్‌లో 76%, ఛత్తీస్‌గఢ్‌లో 70.59%

- రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్
- పోలింగ్ శాతం పెరిగే అవకాశం
- పలు చోట్ల చెదురుమదురు ఘటనలు, ఘర్షణలు
- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ బాంబు పేలి ఐటీబీపీ జవాను మృతి

- వివరాలు 8లో

నాలుగేళ్ల కుమార్తెకు ఉరివేసి...

దంపతుల ఆత్మహత్య

- ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలో విషాదం..
- బిర్లా సైన్స్ సెంటర్‌లోని టికెట్ కౌంటర్‌లో పని చేస్తున్న యువతి
- అర్ధంతరంగా ఉద్యోగం తొలగించడంతో వేదన
- అక్కడ పని చేస్తున్న నలుగురే కక్ష గట్టి తొలగించారని ఆక్రందన
- వారిని విడిచిపెట్టవద్దంటూ సూసైడ్‌నోట్
- ముందుగా బిడ్డకు ఉరేసి.. ఆ తర్వాత భర్తతో కలిసి ఉరివేసుకుని బలవన్మరణం

- వివరాలు 16లో

క్లుప్తంగా...

ఆన్‌లైన్ నామినేషన్ లోపాలు సవరించండి

రాష్ట్రపతికి ఎన్‌ఆర్‌ఐ సుధీర్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఆన్‌లైన్ నామినేషన్ విధానంలో లోపాలను సవరించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు విజ్ఞప్తి చేస్తూ జలగం సుధీర్ అనే ఎన్‌ఆర్‌ఐ లేఖ రాశారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు నవంబర్ 3న ఆన్‌లైన్ విధానంలో తాను వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం అంగీకరించలేదని ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ విధానం ఉన్నపుడు ప్రత్యక్షంగా రిటర్నింగ్ అధికారి ముందు హాజరుకావటం, ప్రపోజర్ల కోసం డిజిటల్ సిగ్నేచర్ లేకపోవటం, నోటరీ విదేశాల్లోని ఇండియా కాన్సులేట్ సర్వీస్ వాడుకోలేకపోవటం, ఆన్‌లైన్‌లో అడిగిన వివరణలకు ఎన్నికల సంఘం స్పందించకపోవడాన్ని లేఖలో ప్రస్తావించారు. ఆన్‌లైన్ నామినేషన్ విధానం లోపాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై పూర్తి విచారణ చేసి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు న్యాయం చేయాలని రాష్ట్రపతిని కోరారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సంక్షేమం

బొంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రాల్లో రేవంత్ కార్నర్‌షో

బొంరాస్‌పేట(వికారాబాద్ జిల్లా): ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని, రాష్ట్రంలో మళ్లీ మార్పు రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రాల్లో శుక్రవారం ఆయన కార్నర్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి కృష్ణాజలాలు తీసుకువస్తామని మోసం చేశారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ వెయ్యెకరాల భూమి, కేటీఆర్‌కు వంద ఎకరాల ఫామ్‌హౌస్ ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. పంజగుట్టలో కోట్ల ఇల్లు కట్టుకున్నారు కానీ, ప్రజలకు మాత్రం డబుల్ బెడ్‌రూమ్ కట్టివ్వలేదని విమర్శించారు. ఓటుకు రూ.10 వేలు ఇచ్చి బీఆర్‌ఎస్ గెలవాలనుకుంటోందని ఆరోపించారు. మనీ, మద్యంతోనే ఎన్నికల్లో గెలవాలనుకుంటోందని విమర్శించారు. కేసీఆర్‌ను బొందపెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు ఒకటో తారీఖున మహాలక్ష్మి పథకం కింద రూ.2,500నగదు జమచేస్తామన్నారు. రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ తోపాటు ఆరు గ్యారంటీ కార్డులు అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో బీసీల సమస్యలు

జస్టిస్ ఈశ్వరయ్య



పంజగుట్ట (హైదరాబాద్): బీసీల డిమాండ్లన్నింటినీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరచారని, కాంగ్రెస్ పార్టీకి బీసీలందరూ మద్దతు తెలపాలని అఖిల భారతీయ వెనకబడిన తరగతుల సమాఖ్య చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, అధికారం అన్నింటిలో అందరికీ సమాన వాటా వస్తుందని పోరాడి తెచ్చుకున్న తెలంగాణ.. అర శాతం లేని వెలమల కబంధ హస్తాల్లోకి వెళ్లిందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఎన్నికలు 2023– సామాజిక న్యాయం–బీసీ భాగస్వామ్యం అనే అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో నక్సల్స్ తరిమికొడితే పారిపోయిన దొరలకు దరణీ తీసుకొచ్చి లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. కాళేశ్వరం ఎంతపెద్ద స్కామో, ధరణి కూడా అంతేపెద్ద స్కామ్ అన్నారు. బీసీని సీఎం చేస్తానని ప్రకటించిన బీజేపీ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అప్పనంగా తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో సీఎం పోటీలో ఉన్న రెడ్డి, వెలమ సామాజికవర్గం అభ్యర్థులను ఓడించాలని, ఆ స్థానా ల్లో బీసీ ఎవరుంటే వారిని గెలిపించాలని సూచించారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తే తీసుకోవాలి కానీ, ఓటు మాత్రం బీసీకే వేయాలన్నారు. ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ తెలంగాణను ఒక జాగీర్దారీ వ్యవస్థగా చేశారని ఆరోపించారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు విజ య్ భాస్కర్, ప్రొఫెసర్ సుదర్శన్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



ధరణి బదులు భూమాత

అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్

42 పేజీల్లో 37 విభాగాలుగా పెద్ద ఎత్తున హామీలు

సాక్షి, హైదరాబాద్:

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని వర్గాలను ఆకట్టుకునేలా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ డిక్లరేషన్లతోపాటు పలు కీలక హామీలతో 'అభయ హస్తం' పేరిట ప్రణాళికను ప్రజల ముందు పెట్టింది. సుపరిపాలన అందిస్తామంటూ ప్రారంభమైన ఈ 42 పేజీల మేనిఫెస్టోలో మొత్తం 37 విభాగాల్లో పెద్ద ఎత్తున హామీలను గుప్పించింది. తమకు అధికారమిస్తే ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తిస్థాయి ప్రజాస్వామిక పాలన తెస్తామని, ప్రతిరోజూ సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామని పేర్కొంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తారని తెలిపింది. బీఆర్‌ఎస్ పాలనలోని అవినీతి, కుంభకోణాల ఆరోపణలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపిస్తామని.. కాళేశ్వరం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించింది.

గ్రామ వలంటీర్ల వ్యవస్థ తెస్తాం..

ప్రజా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. ప్రభుత్వ పథకాల అమలు కోసం గ్రామీణ వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపింది. కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. 2030 నాటికి తెలంగాణను 500 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, ఇండస్ట్రియల్ కారిడార్లు, ఫుడ్ ప్రాసెసింగ్ కారిడార్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఉపాధి హామీ పనిదినాలను, వేతనాలను పెంచుతామని తెలిపింది.

ఉచితంగా కరెంటు..

200 యూనిట్లలోపు వాడే వినియోగదారులందరికీ ఉచిత కరెంటు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా సాధిస్తామని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామని తెలిపింది. చెరువుల మరమ్మతు, నిర్వహణ బాధ్యతలను నీటి సంఘాలకు అప్పగిస్తామని వెల్లడించింది. ఆదర్శ రైతు విధానాన్ని పునరుద్ధరిస్తామని.. ధాన్యం కొనుగోళ్లలో తేమశాతం పేరిట తరుగు తీసే విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించింది. పాల ఉత్పత్తిదారులకు లీటర్‌కు రూ.5 ప్రోత్సాహకం ఇస్తామని వివరించింది. నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను వంద రోజుల్లో తొలగిస్తామని హామీ ఇచ్చింది.

సంక్షేమం కోసం మరెన్నో..

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెంచుతామని.. పీఈటీ పోస్టులు భర్తీ చేసి ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పేర్కొంది. అన్ని జిల్లా కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, నియోజకవర్గంలో 100 పడకల సూపర్ స్పెషాలిటీ, మున్సిపాలిటీల్లో 100 పడకల ఆస్పత్రులను నిర్మిస్తామని తెలిపింది.

రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని, రేషన్‌షాపులను మినీ సూపర్‌మార్కెట్లుగా మార్చుతామని ప్రకటించింది. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని, సమ్మక్క జాతరను జాతీయ పండుగగా గుర్తిస్తామని హామీ ఇచ్చింది. బీసీలకు క్రిమీలేయర్ విధానాన్ని తొలగించాలని కేంద్రానికి సిఫార్సు చేస్తామని తెలిపింది. చేనేత ఉత్పత్తులను ఈ–కామర్స్‌తో అనుసంధానం చేస్తామని, రిటైరైన జర్నలిస్టులకు పింఛన్ సదుపాయం కల్పిస్తామని పేర్కొంది. హైదరాబాద్ నగరాన్ని ముంపు రహిత నగరంగా తీర్చిదిద్దుతామని.. అన్ని నగరాలు, మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికి 25 వేల లీటర్ల మంచి నీటిని ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటించింది. ఎల్బీనగర్–బీహెచ్‌ఈఎల్ రూట్లలో కొత్త మెట్రో లైన్లను నిర్మిస్తామని తెలిపింది.

కాంగ్రెస్ మేనిఫెస్టోలోని కీలక అంశాలివీ..

- తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తి స్థాయి ప్రజాస్వామిక పరిపాలన
- ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజూ 'ప్రజాదర్బార్' నిర్వహణ
- కాళేశ్వరం అవినీతిపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ
- ఫార్మాసిటీలు రద్దు.. మద్యం బెల్టుషాపుల రద్దు
- తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ అమరవీరుల కుటుంబంలో ఒకరికి రూ.25 వేల నెలవారీ గౌరవ పింఛన్, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- తెలంగాణ ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత. 250 గజాల ఇళ్ల స్థలాల పంపిణీ
- సింగరేణి ప్రైవేటీకరణకు నో.. కారుణ్య నియామకాల ప్రక్రియ పునఃపరిశీలన
- హైదరాబాద్‌లో కొత్త మెట్రోరైల్ మార్గాల నిర్మాణం.. ఆస్తిపన్ను, ఇంటి పన్ను బకాయిలపై ఉన్న పెనాల్టీ రద్దు.

రైతులు - భూములు



- రైతులకు రూ.2 లక్షల పంటరుణాల మాఫీ.. రూ.3 లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు
- వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు.. అన్ని ప్రధాన పంటలకు సమగ్ర బీమా
- ధరణి స్థానంలో భూమాత పోర్టల్.. ల్యాండ్ కమిషన్ ఏర్పాటు
- పేదలకు పంపిణీ చేసిన 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై వారికి పూర్తి హక్కుల కల్పన
- రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఆర్థిక సాయం. కౌలు రైతులకూ ఈ పథకం వర్తింపు. రైతు కూలీలకూ ఏటా రూ. 12 వేలు ఆర్థిక సాయం.

గౌరవ వేతనాలు పెంపు

- మధ్యాహ్న భోజన కార్మికుల నెలవారీ వేతనం రూ.10వేలకు పెంపు
- గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల గౌరవ వేతనం నెలకు రూ.1,500 పెంపు
- మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లకు గౌరవ పింఛన్
- అంగన్‌వాడీల వేతనం రూ.18 వేలకు పెంపు, వారిని ఈపీఎఫ్ పరిధిలోకి చేర్పు
- రేషన్ డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనం

యువత - నిరుద్యోగులకు..

- వార్షిక జాబ్ కేలండర్.. నిర్ణీత కాలంలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- మెగా డీఎస్సీతో ఆరు నెలల్లోనే ఖాళీ టీచర్ పోస్టులన్నీ భర్తీ

విద్యార్థులకు..

- విద్యార్థులకు ఉచితంగా వైఫై ఇంటర్నెట్.. విద్యా రంగానికి బడ్జెట్ 15శాతానికి పెంపు
- బాసర ట్రిపుల్‌ఐటీ తరహాలో రాష్ట్రంలో మరో 4 ట్రిపుల్‌ఐటీల ఏర్పాటు
- మూతపడిన 6వేల పాఠశాలల పునరుద్ధరణ
- ప్రతి జిల్లాలో రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్
- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అన్ని ఆధునిక సౌకర్యాలతో బస్తీ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు

ప్రభుత్వ ఉద్యోగులకు..

- ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ
- పీఆర్సీ ప్రకటించి ఆరు నెలల్లోపు సిఫారసుల అమలు.. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల తక్షణ విడుదల
- ఆర్టీసీ సిబ్బందికి రెండు పీఆర్సీ బకాయిల చెల్లింపు
- హోంగార్డులకు వేతన సవరణ అమలు

మహిళలకు..

- ఆడపిల్లలకు వివాహ సమయంలో రూ.లక్ష ఆర్థికసాయంతోపాటు ఇందిరమ్మ కానుకగా తులం (10 గ్రాముల) బంగారం
- స్వయం సహాయక బృందాలకు రూ.10 లక్షల వరకు పావలా వడ్డీ రుణాలు.. బంగారు తల్లి పథకం పునరుద్ధరణ

ఆరోగ్యం

- ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.10 లక్షలకు పెంపు.. మోకాలు సర్జరీ కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి..
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకాలు
- ఉస్మానియా ఆస్పత్రి ఆధునీకరణ

సంక్షేమ రంగం

- ప్రతి ఆటోడ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సాయం.. పెండింగ్‌లో ఉన్న చలానాలు 50% రాయితీతో సెటిల్‌మెంట్
- బీడీ కార్మికులకు జీవిత బీమా, ఈఎస్‌ఐ పరిధిలోకి చేర్పు.. ప్రమాదంలో చనిపోయే గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు
- గొర్రెల పంపిణీ కోసం నగదు బదిలీ ద్వారా రూ.2 లక్షలు
- గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు
- పేదలకు తెల్ల రేషన్‌కార్డులపై సన్నబియ్యం..
- హైదరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం.. మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.5 లక్షల నగదు
- 50 ఏళ్ల దాటిన జానపద కళాకారులకు నెలకు రూ. 3 వేల పింఛన్..
- దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంపు
- అన్ని జిల్లా కేంద్రాల్లో అనాథ వృద్ధుల కోసం ఓల్డేజ్ హోమ్స్..

ఉద్యోగాల భర్తీకి జాబ్ కేలండర్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్పెషల్ డిపార్ట్‌మెంట్ నియామకాల మిషన్ ద్వారా చేపడతామని అనుబంధ మేనిఫెస్టోలో పేర్కొంది. దరఖాస్తుదారులెవరూ ఒక్క రూపాయి ఫీజు కట్టనవసరం లేదని తెలిపింది. ఏయే కేడర్ ఉద్యోగాల భర్తీ కోసం ఏ తేదీన నోటిఫికేషన్లు ఇస్తామనే వివరాలనూ పేర్కొంది. కొన్ని ఉద్యోగాలను ఒకే దశలో, మరికొన్ని ఉద్యోగాలను రెండు దశల్లో భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. మేనిఫెస్టోలో ప్రకటించిన నోటిఫికేషన్ తేదీలివీ..

- గ్రూప్–1 – 2024, ఫిబ్రవరి 1
- గ్రూప్–2 – మొదటి దశలో 2024, ఏప్రిల్ 1, రెండో దశ డిసెంబర్ 15
- గ్రూప్–3 – 2024 జూన్ 1, డిసెంబర్ 1
- గ్రూప్–4 – 2024 జూన్ 1, డిసెంబర్ 1
- రోడ్లు–భవనాలు, పంచాయతీరాజ్, నీటి పారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రజారోగ్య శాఖ, మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్ శాఖల్లో ఏఈ పోస్టులు–2024 మే 1
- అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ అధికారుల పోస్టులు – 2024 మే1
- ఏఎంవీఐ, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితర పోస్టులు – 2024 జూన్ 1, డిసెంబర్ 1
- పోలీస్ కానిస్టేబుల్, ఇతర యూనిఫాం సిబ్బంది ఉద్యోగాలు – 2024 మార్చి 1, డిసెంబర్ 1
- కాలేజీ లెక్చరర్లు, విశ్వవిద్యాలయాల ఫ్యాకల్టీ ఉద్యోగాలు – 2024 ఏప్రిల్ 1, డిసెంబర్ 15
- టీచర్ పోస్టులు – మొదటి దశలో 2024 ఏప్రిల్ 1, రెండోదశలో 2024 డిసెంబర్ 15
- నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది నియామకాలు – 2024 మే 1, డిసెంబర్ 15
- డాక్టర్ పోస్టులు – 2024 ఆగస్టు 1
- వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సాంకేతిక సిబ్బంది నియామకాలు – 2024 జూన్ 1


కులాలు–రిజర్వేషన్లు

- ఎస్సీల వర్గీకరణ అనంతరం మాదిగ, మాల, ఇతర ఉపకులాలకు కొత్తగా 3 కార్పొరేషన్లు
- బీసీల కులగణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు. సంచార జాతులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 5 శాతం రిజర్వేషన్లు
- ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవన్.. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరిట నామకరణం
- అన్ని బీసీ వర్గాలకు కార్పొరేషన్ల ఏర్పాటు.. బీసీలకూ సబ్‌ప్లాన్.. ఈబీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు
- మైనార్టీ సబ్‌ప్లాన్ అమలు..

ఆయన వెళ్లడానికి రెడీ.. ప్రజలు పంపడానికి రెడీ

కేసీఆర్‌కు బైబై.. టాటా.. చెప్పి సాగనంపాల్సిందే..

- కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటానని కేసీఆరే అంటున్నారు
- మోదీ, కేసీఆర్ కలసి ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం
- మా మేనిఫెస్టో భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటిది
- ఆరు గ్యారంటీలపై తొలి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- తెలంగాణలో కాంగ్రెస్ తుఫాను రాబోతోంది: రేవంత్‌రెడ్డి



కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఖర్గే

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని ఎలాగైనా అధికారంలోకి తీసుకురావాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. తాము ఓట్లు అడగడానికి ప్రజల వద్దకు వెళితే.. ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వారు ముందే చెప్తున్నారని అన్నారు. కేసీఆర్ వెళ్లిపోవడానికి రెడీగా ఉన్నారని, ఆయనను సాగనంపడానికి ప్రజలు కూడా రెడీగా ఉన్నారని పేర్కొన్నారు. ఎలాగూ సీఎం కేసీఆర్ కూడా రిటైర్‌మెంట్ రోజులొచ్చాయని, ప్రజలు ఓడిస్తే ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటానని అంటున్నారని చెప్పారు. కేసీఆర్‌కు బై బై, టాటా చెప్పి సాగనంపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ త్యాగం చేసి తెలంగాణ ఇస్తే కేసీఆర్ సీఎం కుర్చీలో కూర్చుని, రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను టీపీసీసీ నేతలతో కలసి ఖర్గే ఆవిష్కరించారు. తర్వాత జరిగిన సభలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించాం. ఈ మేనిఫెస్టో మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటిది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుంది. మా పార్టీ నేతలంతా ఐక్యంగా ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోను అమలు చేస్తారు. ఎలాంటి సందేహం అవసరం లేదు.

దమ్ముంటే ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ తేవాలి

ప్రధాని మోదీ చెప్పినవేవీ అమలు కావు. ఎస్సీ వర్గీకరణ విషయంలోనూ అంతే. ఎస్సీల్లోని మాదిగ, మాల ఉపకులాలకు ఏమేం కావాలో అన్నీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. దేశంలో ఎవరికి ఏం కావాలో అన్నీ చేసేది కాంగ్రెస్ పార్టీనే. మా పార్టీ అమలు చేసే సమయంలో మోదీ పుట్టి కూడా ఉండరు. కానీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చి పదేళ్లయింది. ఎస్సీ వర్గీకరణ చేస్తానంటే ఇన్ని రోజులు ఆయనను ఆపిందెవరు? మోదీ ప్రతి వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని, 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి చేయలేదు. ఇప్పుడు వర్గీకరణ విషయంలోనూ మోదీ చెప్పేది చేయరు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది, పూర్తి మెజార్టీ కూడా ఉంది. దమ్ముంటే ఎస్సీ వర్గీకరణపై రేపే ఆర్డినెన్స్ తెచ్చి అమలు చేయాలి..''అని ఖర్గే సవాల్ చేశారు.

అధికారం కాంగ్రెస్‌కే..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. అనేక తప్పులు చేసింది. కొంతకాలం కిందటి వరకు కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రధాని మోదీ.. ఎన్నికల సమయంలో స్వరం తగ్గించారు. బీఆర్‌ఎస్‌ను దేశమంతటా విస్తరిస్తానని చెప్పిన కేసీఆర్.. మహారాష్ట్ర వరకు వెళ్లారు. మోదీ వద్దనడంతో ఆగిపోయారు. మోదీ, కేసీఆర్ కలసి ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం.

కర్ణాటకకు వచ్చి చూడండి

కాంగ్రెస్ కర్ణాటకలో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడం లేదంటూ కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. మేమిచ్చిన గ్యారంటీలన్నీ అమలవుతున్నాయి. కావాలంటే వచ్చి చూసుకోండి. దేవుడి పేరు మీద ఓట్లడిగే పార్టీ మహిళలకు ఏమీ చేయలేకపోయింది. అదే కాంగ్రెస్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడంతో.. చాలా మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించి దేవాలయాలు దర్శించుకుంటున్నారు.

అమలు చేయకుంటే.. కేబినెట్‌లో మార్పు!

ఇప్పటికే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన ఖర్గే.. ఈ సమయంలో కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి కేబినెట్ సమావేశంలోనే మనం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై నిర్ణయం తీసుకోవాలి. అలా తీసుకోకపోతే మీ వల్ల కావడం లేదని, కేబినెట్‌లో వేరే వాళ్లని తీసుకోవాలని నేను చెప్పాల్సి వస్తుంది''అని పేర్కొన్నారు.

పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టయింది: రేవంత్

ఎన్నికల మేనిఫెస్టో రూపంలో తాము తెలంగాణ ప్రజలకు హామీ పత్రం ఇస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని దివాలా తీయించి, నమ్ముకున్న వారికి ద్రోహం చేస్తూ పరిపాలించడంతో.. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టు అయిందని వ్యాఖ్యానించారు. ప్రజల జీవితాల్లో మార్పు రాకపోగా మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పదేళ్ల కేసీఆర్‌కు అవకాశమిచ్చారని, ఈసారి కాంగ్రెస్‌కు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ తుపాను రాబోతోందని, సునామీ సృష్టించబోతోందని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం వస్తుంది: భట్టి

తెలంగాణ సంపదను ప్రజలకు పంచిపెట్టాలనే ఆలోచనతోనే ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. ఇది తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని తీసుకురావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీల హయాంలో దగాపడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా మేనిఫెస్టో తయారు చేశామని, తెలంగాణ ప్రజల బంగారు భవిష్యత్తుకు ఇది బాట వేస్తుందని టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో.. సీనియర్ నేతలు వీహెచ్, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, జెట్టి కుసుమకుమార్ తదతరులు పాల్గొన్నారు.

తెలంగాణలో మార్పు తెస్తాం

- కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీఆర్‌ఎస్, బీజేపీల కుట్ర: మల్లికార్జున ఖర్గే
- కేసీఆర్ చదువుకున్న బడి కాంగ్రెస్ కట్టించినదే: రేవంత్
- బాచుపల్లి బహిరంగ సభలో ప్రసంగం



సభలో అభివాదం చేస్తున్న ఖర్గే, రేవంత్, ఠాక్రే తదితరులు

నిజాంపేట్ (హైదరాబాద్): తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిందని, రాజ్యాంగాన్ని రూపొందించి బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిందని ఖర్గే చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ఓటేస్తే గులాంగిరి చేయాల్సి వస్తుందని.. అదే కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజల జీవితాలు మారుతాయని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ శివార్లలోని బాచుపల్లిలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఖర్గే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు ప్రసంగించారు.

కాంగ్రెస్‌ను ఎవరూ అడ్డుకోలేరు

బీఆర్‌ఎస్ సర్కార్‌కు బీజేపీ మద్దతు తెలుపుతోందని, ఇరు పార్టీలు కలసి కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఖర్గే ఆరోపించారు. ఇలాంటి వాటికి కాంగ్రెస్ భయపడేదేలేదని, ఏ శక్తీ తమను అడ్డుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారాన్ని అనుభవిస్తున్న వారు తామే రాష్ట్రాన్ని సాధించామని చెప్పుకొంటున్నారని, ఏ ఒక్క కుటుంబంతో రాష్ట్ర సాధన సాధ్యపడలేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ కాంగ్రెస్ నాయకుల ను బెదిరించేందుకు ఈడీ, ఐటీ దాడులను చేయిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతి మోదీ కి కనిపించదని, కాంగ్రెస్ నేతలే కనిపిస్తారని విమర్శించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో వెలుగులు: రేవంత్

రాష్ట్రానికి కాంగ్రెస్ ఏం చేసిందని కొందరు సన్నాసులు ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్ చేసినవన్నీ కళ్లముందే ఉన్నాయని టీపీసీసీ చీఫ్ రేవంత్ పేర్కొన్నారు. ''రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ డ్యామ్‌లు, దేవాదుల పథకాన్ని కాంగ్రెస్ పార్టీయే కట్టింది. 75 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చింది. హెచ్‌ఎంటీ, ఐడీఎల్, బీడీఎల్ వంటి ఫ్యాక్టరీలు, జీడిమెట్ల పారిశ్రామికవాడ వంటివి స్థాపించింది. రాష్ట్రంలో వెలుగులు జిలుగులు ఉన్నాయంటే కాంగ్రెస్ చేసిన పనులే కారణం. సీఎం కేసీఆర్ చింతమడకలో చదువుకున్న బడిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిందే..''అని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనపై పెద్ద కుట్ర చేసి కొడంగల్‌లో ఓడించారని, కానీ కొన్ని రోజుల్లోనే దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్‌గిరిలో ప్రజలు తనను గెలిపించారని రేవంత్ చెప్పారు. కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డిని గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి విజయశాంతి

- మల్లికార్జున ఖర్గే సమక్షంలో చేరిక...
- మాజీ ఎంపీ మందా జగన్నాథం కూడా



విజయశాంతికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఖర్గే

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సినీనటి, మాజీ ఎంపీ విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవలే బీజేపీకి రాజీనామా చేసిన ఆమె శుక్రవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క, కర్ణాటక రాష్ట్ర మంత్రి బోసురాజు, ఏఐసీసీ నేత కొప్పుల రాజు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జెట్టి కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ మళ్లీ కాంగ్రెస్‌లోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్టు సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ మందా జగన్నాథం కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో జరిగిన మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

ఖర్గేతో పటేల్ భేటీ: సూర్యాపేట అసెంబ్లీ టికెట్ ఆశించిన పటేల్ రమేశ్‌రెడ్డి శుక్రవారం తాజ్‌కృష్ణ హోటల్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి తదితరులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నామినేషన్‌ను ఉపసంహరించుకున్నందుకు రమేశ్‌రెడ్డిని ఖర్గే అభినందించారు.

నేడు పార్టీలోకి డాక్టర్ వినయ్: కుత్బుల్లాపూర్ బహిరంగసభ అనంతరం శుక్రవారం రాత్రి ఖర్గే తాజ్‌కృష్ణ హోటల్‌లో బస చేశారు. శనివారం ఉదయం కేంద్ర మాజీ మంత్రి దివంగత పి.శివశంకర్ కుమారుడు డాక్టర్ వినయ్‌కుమార్ ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

క్లుప్తంగా...

‘కుప్ప’కూలిన అన్నదాత

వడ్ల కుప్ప వద్దే ఆగిన గుండె..

జగిత్యాల జిల్లా వేములకుర్తిలో ఘటన



రాజారాం (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే క్రమంలో ఓ రైతు వడ్లకుప్ప వద్దే గుండెపోటుకు గురై కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తికి చెందిన ఆకుల రాజారాం(57) తాను పండించిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మూడు, నాలుగు రోజుల క్రితం యామాపూర్‌–వేములకుర్తి శివారులోని వంతెన వద్ద కుప్పపోశాడు. అనంతరం ధాన్యం విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో సాయంత్రం వడ్లను సంచుల్లో నింపుతుండగా రాజారాం గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దోపిడీ పాలకవర్గాలకు ఓటుతో గుణపాఠం చెప్పండి

జాగో తెలంగాణ వేదిక కన్వీనర్‌ ఆకునూరి మురళి

దేవరుప్పుల: కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాల అవినీతి, దోపిడీకి ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని జాగో తెలంగాణ వేదిక కన్వీనర్, మాజీ ఐఏఎస్‌ ఆఫీసర్‌ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. తెలంగాణ జాగో ఓటరు చైతన్య బస్సుయాత్ర శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రం జనగామ–సూర్యాపేట రహదారిలోని చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వనరులను ప్రజల అభివృద్ధికి వినియోగించుకోవడంలో విఫలమైన సీఎం కేసీఆర్‌.. తన కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. పదేళ్లుగా వేల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌ తీసుకుంటున్న 40 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ముసలి వాళ్లు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులుండగా వారికి రైతుబంధు ఇవ్వని ఈ ప్రభుత్వం విదేశాల్లో స్థిరపడిన వ్యాపారస్తులకు, సినిమా హీరో హీరోయిన్లకు రూ.18 వేల కోట్లు రైతుబంధు రూపంలో ఇవ్వడమేంటని మురళి ప్రశ్నించారు. కార్యక్రమంలో యాత్ర సమన్వయకర్త నైనాల గోవర్ధన్‌ పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, కొత్తపల్లి రవి, మాజీ ప్రొఫెసర్లు వినాయకరెడ్డి, పద్మజా, దళిత శక్తి రాష్ట్ర కన్వీనర్‌ శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

దొరల గడీలు కూలుస్తాం

నాగర్‌కర్నూల్, బడంగ్‌పేట సభల్లో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌

సాక్షి, నాగర్‌కర్నూల్‌/ అలంపూర్‌: రాష్ట్రంలో దొరల గడీలను కూల్చి బహుజన రాజ్యాన్ని స్థాపిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌ కుమార్‌ ధీమా వ్యక్తం చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్‌ జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో, హైదరాబాద్‌ శివారు బడంగ్‌పేట సిరిపురం యాదయ్య స్మారక మైదానంలో శుక్రవారం జరిగిన బహిరంగసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ...అన్ని వర్గాల ప్రజలు ఓట్లేస్తే సీట్లు మాత్రం కొందరికే దక్కుతున్నాయని చెప్పారు. తాను హెలికాప్టర్‌లో వస్తే కాంట్రాక్టు సంస్థలు, కేటీఆర్‌ లాంటి వాళ్లు ఫండింగ్‌ ఇచ్చారని అంటున్నారని, కానీ తాను మాత్రం వారి బెండు తీసేందుకే వచ్చానని తెలిపారు. రోడ్లు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులు, కోయ, గోండు, లంబాడీ, వాల్మీకి బిడ్డలు పోగుచేసి ఇచ్చిన విరాళాలతో హెలికాప్టర్‌లో వచ్చానని చెప్పారు. అచ్చంపేట, సిర్పూర్‌ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, కోనేరు కోనప్ప రోడ్డెక్కితే ప్రజలు రాళ్లతో కొడుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌ నుంచి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బరిలో ఉంటే కాంగ్రెస్, బీజేపీ తమ అభ్యర్థులను పోటీ పెట్టలేదని, నాగం జనార్దన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అందరూ ఒక్కటేనన్నారు. 70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఎస్సీల భూములను గూండాలతో మంత్రి సబితమ్మ కబ్జా చేయించారని ఆరోపించారు..

‘కారు’ పంక్చరైంది..

- ఇనుప సామాను కింద కూడా కొనే పరిస్థితి లేదు.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే మధ్యంతరమే
- కేసీఆర్‌కు అధికారమిస్తే మళ్లీ అప్పులే చేస్తారు... మహబూబ్‌నగర్‌లో ఎంపీ బండి సంజయ్‌



మహబూబ్‌నగర్‌లోని క్లాక్‌టవర్‌ వద్ద నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లలో మాట్లాడుతున్న బండి సంజయ్‌

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌/కరీంనగర్‌టౌన్‌: ‘కారులోని నాలుగు టైర్లు పంక్చరైనయ్‌.. ఆ కారును ఇనుప సామాను కింద కూడా కొనే పరిస్థితి లేదు. కారును తీసుకుపోయి సచివాలయం గుమ్మటాలకు వేలాడదీయడం తథ్యం. డిసెంబర్‌ 3న కేసీఆర్‌ మాజీ సీఎం కావడం ఖాయం’అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ జోస్యం చెప్పారు. మహబూబ్‌నగర్‌లో బొక్కలోనిపల్లి, క్లాక్‌టవర్‌ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర మంత్రి భగవంత్‌ కుబా, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కేటీఆర్, కవిత, హరీశ్, సంతోష్‌ మధ్య సీఎం సీటు లొల్లి మొదలైందన్నారు. ఇక కాంగ్రెస్‌లో అందరూ సీఎంలేనని, బీఆర్‌ఎస్, లేదా కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే సర్కార్‌ కుప్పకూలిపోవడం ఖాయమని, మధ్యంతర ఎన్నికలు తథ్యమని అన్నారు. ‘పాలమూరు సహా తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్రమే నిధులిస్తోంది. మరి కేసీఆర్‌ చేసిందేమిటి? ఊరూరా బెల్టుషాపులు పెట్టి మందు తాగించడం, ఒక్కో తలపై రూ.1.27 లక్షల అప్పు చేయడం తప్ప. బీజేపీ అధికారంలోకి వస్తేనే అప్పులన్నీ తీరి, మీకు న్యాయం జరుగుతుంది. నెత్తిమీద అప్పులున్నోడికి అధికారం ఇస్తే మళ్లీ అప్పులే చేస్తడు. కేసీఆర్‌ కూడా అట్లనే..’ అని సంజయ్‌ విమర్శలు గుప్పించారు.

తప్పులన్నీ కేసీఆర్‌ చేసి..

‘కేసీఆర్‌ ఒక్క ప్రాజెక్టు తీసుకురాలే. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును కమీషన్లకు వాడుకున్నడు. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కృష్ణా నీళ్లు తీసుకుంటామని సంతకం పెట్టింది కేసీఆర్‌ కాదా? కేంద్రం ట్రిబ్యునల్‌ వేస్తామని చెప్పిన తర్వాత కూడా ఏడాది వరకు సుప్రీంకోర్టులో కేసు వాపస్‌ తీసుకోనిది కేసీఆర్‌ కాదా..? తప్పులన్నీ కేసీఆర్‌ చేసి.. మోదీ ప్రభుత్వం అన్యాయం చేసిందని అంటున్నడు’అని బండి ధ్వజమెత్తారు. ‘ఒకప్పుడు కేసీఆర్‌కు సొంత ఇల్లు లేదు. అప్పు చేస్తే ఫైనాన్సోళ్లు కారు గుంజుకుపోయిండ్రు. దొంగ పాస్‌పోర్టుతో యువకులను మోసం చేసిండు. అట్లాంటి కేసీఆర్‌ రూ.లక్ష కోట్లు ఎట్లా సంపాదించిండు.. ఇవన్నీ ప్రశ్నిస్తుంటే నాపై కేసులు పెట్టి జైలుకు పంపిండు. ఇయాళ నన్ను తిట్టడానికి కేసీఆర్‌ కరీంనగర్‌ పోయిండు’అని మండిపడ్డారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలి..

మీకోసం ఎన్నడైనా రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌రెడ్డి కొట్లాడి జైలుకు పోయారా? మీ పక్షాన నిలిచిందెవరో.. మిమ్మల్ని మోసం చేసిందెవరో.. ఒక్కసారి ఆలోచించండి. అసలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ పార్టీలకు ఎందుకు ఓటెయ్యాలి అని బండి సంజయ్‌ ప్రశ్నించారు. పువ్వు గుర్తు ప్రభుత్వం వస్తేనే పేదల బతుకులు బాగుపడతాయని, పొరపాటున కులాల పేరుతో మోసపోయి ఓట్లు వేస్తే అటు ఇటు కాకుండా ఆగమైపోతారని అన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ ముస్లిం ఓట్లకోసం ప్రలోభపెట్టడం తప్ప వాళ్లకు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెసోళ్లు ముస్లిం మతపెద్దలను నమ్ముకుంటే.. కేసీఆర్‌ ఒవైసీని నమ్ముకున్నారని విమర్శించారు.

రాజకీయాలకన్నా హిందూ ధర్మమే ముఖ్యం

‘నాకు రాజకీయాలకన్నా ధర్మమే ముఖ్యం. హిందూ ధర్మం కోసం అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకునేందుకు కూడా వెనకాడను. ఇప్పుడున్న పరిస్థితుల్లో నాలాంటోడు, రాజాసింగ్‌ లాంటివాళ్లను గెలిపించకపోతే ఇకపై ఎవరూ హిందూ ధర్మం గురించి మట్లాడేవారుండరు. నాకు మత పిచ్చి అయితే.. కేసీఆర్‌కు మందుపిచ్చి’ అని బండి అన్నారు. శుక్రవారం రాత్రి కరీంనగర్‌లోని వివిధ డివిజన్లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ మాట్లాడుతూ.. ‘కరీంనగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్‌ సభలో సీఎం కేసీఆర్‌ నాకు మత పిచ్చి ఉందన్నాడు. మరి నీకేం పిచ్చి? మందు పిచ్చి. బరాబర్‌ హిందూ ధర్మం గురించి మాట్లాడుతూనే ఉంటా. భయంకరమైన హిందువు అని చెప్పుకున్న కేసీఆర్‌ హైదరాబాద్‌ పాతబస్తీకి పోవాలంటే ఒవైసీ పర్మిషన్‌ కావాలట. కేసీఆర్‌ అధికారంలోకి రాకపోతే నమాజ్‌ చేసే అవకాశం ఉండదని చెబుతున్న కేటీఆర్‌ గుడి గురించి ఎందుకు మాట్లాడడు. నాపై 74 కేసులు పెట్టారు. నేనేమైనా గంగుల కమలాకర్, పురమళ్ల శ్రీనివాస్‌ లెక్క భూకబ్జాలు చేశానా? ఉద్యోగుల పక్షాన కొట్లాడితే నా ఆఫీస్‌ ధ్వంసం చేసి నన్ను జైలుకు పంపారు. 30వ తేదీన పువ్వుగుర్తుపై ఓటేసి గెలిపించండి’అని ఓటర్లను అభ్యర్థించారు.

తెలంగాణలో దూసుకెళ్తున్నాం..

- దివాళీ మిలన్‌ సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ
- బండి సంజయ్‌ను తప్పించాక పార్టీకి బ్రేకులు పడ్డమాట వాస్తవమేనన్న అనురాగ్‌ ఠాగూర్‌



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దూసుకెళ్తోందని, బీజేపీ సర్కారు ఏర్పాటు దిశగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం బీజేపీ జాతీయ కార్యాలయంలో జరిగిన దివాళీ మిలన్‌ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. తెలంగాణ ఎన్నికలపై స్పందిస్తూ అక్కడ తమకు అనువైన వాతావరణం ఉందని అన్నారు. ఇదే కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం కనిపిస్తోందని అన్నారు. గతంలో దూకుడు మీదున్న బండి సంజయ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాక బ్రేకులు పడ్డ మాట వాస్తవమేనని కేంద్ర క్రీడా, సమాచార శాఖల మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ అన్నారు. కొన్ని నిర్ణయాలను పార్టీకే వదిలేయాలని అధ్యక్ష పదవి మార్పును ఉద్దేశించి అన్నారు. ఈ అంశంపై మరింతగా మాట్లాడేందుకు నిరాకరించారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే: అథవాలే



పంజగుట్ట(హైదరాబాద్‌): రాష్ట్రంలో ఈసారి బీజేపీ ప్రభుత్వమే వస్తుందని రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా(ఆర్పీఐ) అధ్యక్షుడు, కేంద్రమంత్రి రాందాస్‌ అథవాలే అన్నారు. శుక్రవారం ఇక్కడి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 12 చోట్ల తమ పార్టీ పోటీ చేస్తోందని తెలిపారు. మరో మూడు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు, మిగిలిన అన్ని స్థానాల్లో బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ ఎన్నికల్లో తాము ఒక్క స్థానంలో కూడా పోటీలో లేమని, బీజేపీకే సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ఈ 10 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, సీఎం కేసీఆర్‌ కేవలం హామీలే ఇస్తున్నారు కానీ అమలు చేయడంలేదని ధ్వజమెత్తారు. తమ పార్టీ కనీసం మూడు స్థానాల్లో అయినా గెలుస్తుందని, గెలిచిన తర్వాత బీజేపీకే మద్దతు తెలుపుతామన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేస్తోందని, హిందూ, ముస్లిం, క్రిస్టియన్‌ అనే తేడా లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జాతీయ సెక్రటరీ పి.శివనాగేశ్వర్‌ రావు, రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, నాయకులు కె.ప్రభుదాస్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల ఉచ్చులో పడొద్దు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ ఛుగ్‌



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య రహస్య పొత్తు ఉందని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌ ఛుగ్‌ ఆరోపించారు. ఈ మూడు పార్టీల ఉచ్చులో పడకుండా తెలంగాణ ఓటర్లు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం తరుణ్‌ ఛుగ్‌ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూడు పార్టీలు బీజేపీని ఎదుర్కోవడానికి ఉమ్మడిగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ రెండు స్థానాల్లో పోటీ చేస్తుండగా, వాటిల్లో ఒక స్థానం నుంచే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేయడం బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ పార్టీల మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు.

నేడు బీజేపీ మేనిఫెస్టో

- విడుదల చేయనున్న అమిత్‌ షా
- కేంద్ర హోంమంత్రి షెడ్యూల్‌లో మార్పులు... మధ్యాహ్నం గద్వాల, నల్లగొండ, వరంగల్‌ సభలకు హాజరు



సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను శనివారం సాయంత్రం బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా విడుదల చేయనున్నారు. శుక్రవారంరాత్రికే ఆయన నగరానికి చేరుకోవాల్సి ఉండగా మారిన షెడ్యూల్‌ ప్రకారం శనివారం మధ్యాహ్నం రానున్నారు. 12 గంటలకు ప్రత్యేక విమా నంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో దిగుతారు. మధ్యా హ్నం 12.50 గంటలకు గద్వాల చేరుకుని అక్కడ బీజేపీ ఎన్నికల బహిరంగసభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు గద్వాల నుంచి నల్లగొండకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 3.35 గంటలకు నల్లగొండ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు వరంగల్‌ చేరుకుని అక్కడి బహిరంగసభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు బేగంపేటకు చేరుకుంటారు. సాయంత్రం 6.10 గంటలకు హోటల్‌ కత్రియలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను అమిత్‌ షా విడుదల చేస్తారు. సాయంత్రం 6.45 నుంచి 7.45 గంటల వరకు క్లాసిక్‌ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్‌ ముఖ్యనేతల సమావేశంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌ నుంచి అహ్మదాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

ఇంటింటికీ మేనిఫెస్టో: బీజేపీ ఎన్నికల ప్రణాళిక (మేనిఫెస్టో) ఇంటింటికీ చేరేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నట్టు కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. వచ్చే వారంపాటు ఎన్నికల ప్రచారసభలను పెద్ద ఎత్తున చేపడతామన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్‌ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్‌ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు యోగి ఆదిత్యనాథ్, హేమంత బిశ్వశర్మ, ప్రమోద్‌ సావంత్‌ ఈ సభల్లో పాల్గొంటారని చెప్పారు. సభలు నిర్వహిస్తున్నా ఇంటింటి ప్రచారాన్ని ఆపొద్దని పార్టీ మండల, గ్రామశాఖలను ఆదేశించినట్టు తెలిపారు. కేసీఆర్‌ పాలనావైఫల్యాలు, కాంగ్రెస్‌ మోసపూరిత హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు: ఈటల



కొల్గూర్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్‌

గజ్వేల్‌: బీఆర్‌ఎస్‌ అసంబద్ధ విధానాలతో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని బీజేపీ గజ్వేల్‌ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ ఆరోపించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ మండలం కొల్గూర్‌లో బీఆర్‌ఎస్‌ సర్పంచ్‌ మల్లం రాజు బీజేపీలో చేరారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన రోడ్‌ షోలో ఈటల మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ప్రస్తుతం రూ.5.5 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఒక్కో తలపై రూ.1.25 లక్షల అప్పు ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. పదేళ్లలో ప్రజలకు కన్నీరు మిగిలితే.. కేసీఆర్‌కు, వారి కుటుంబీకులకు ఫామ్‌హౌస్‌లు, లెక్కలేనన్నీ ఆస్తులు వచ్చాయని తెలిపారు. బీఆర్‌ఎస్‌ అవినీతి విధానాలకు చరమగీతం పాడాల్సిన అవసరముందని ఈటల పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే వృద్ధులందరికీ పింఛన్లు, డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లు ఇవ్వడమేకాకుండా నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి!

- 4 శాతం ముస్లిం రిజర్వేషన్‌ ఎత్తివేత
- ఐదేళ్లలో మహిళలకి 10 లక్షల ఉద్యోగాల కల్పన
- వృద్ధులకు కాశీ, అయోధ్యలకు ఉచిత ప్రయాణం
- బీజేపీ మేనిఫెస్టోలో హామీల దశదిశ



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫామ్‌ సివిల్‌ కోడ్‌) అమలు చేస్తామనే హామీని ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరచనున్నట్టు పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం. రోహింగ్యాలు, అక్రమ వలస దారులను వెనక్కి పంపడం, అన్ని పంటలకూ బీమా, ప్రీమియం సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేత, ఐదేళ్లలో మహిళలకు ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగాల్లో 10 లక్షల ఉద్యోగాల కల్పన, వృద్ధులకు కాశీ, అయోధ్యలకు ఉచిత ప్రయాణం వంటి అంశాలను ఇందులో ప్రస్తావించనున్నట్టు తెలిసింది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఇలా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా మేనిఫెస్టోను రూపొందించినట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దీనిని విడుదల చేయనున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై విచారణకు కమిషన్‌ ఏర్పాటు, తెలంగాణలో 4 శాతం ముస్లిం రిజర్వేషన్‌ ఎత్తివేత, 5 ఏళ్లకు రూ.లక్ష కోట్లతో బీసీ అభివృద్ధి నిధి ఏర్పాటు, ఆడబిడ్డ భరోసా పథకం కింద 21 ఏళ్లు వచ్చే సరికి రూ.2 లక్షలు ఇచ్చే ఏర్పాటు, మహిళా రైతు కార్పొరేషన్‌ ఏర్పాటు, ఫీజుల నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ వంటి అంశాలను దశ(పది) దిశ పేరుతో రూపొందించిన మేనిఫెస్టోలో పొందుపరిచినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఇందులో మరికొన్ని ఇలా...

- ధరణి స్థానం లో మీ భూమి యాప్, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ, గల్ఫ్‌ బాధితుల కోసం నోడల్‌ ఏజెన్సీ,
- సబ్సిడీ పై విత్తనాలు, వరి పై బోనస్, ఆడబిడ్డ భరోసా పథకం కింద 21 యేళ్లు వచ్చే సరికి రూ.2 లక్షల ఇచ్చే ఏర్పాటు, ఉజ్వల గ్యాస్‌ లబ్ధిదారులకు ఉచితంగా నాలుగు సిలిండర్‌ లు అందజేత, బడ్జెట్‌ స్కూల్స్‌ కు పన్ను మినహాయింపులు, ప్రతి జిల్లా కేంద్రంలో మల్టీ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రులు, నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, ఇండస్ట్రియల్‌ కారిడార్‌ల ఏర్పాటు, పీఆర్‌సీపై సమీక్ష, అయిదేళ్లకోసారి పీఆర్‌సీ ఏర్పాటు, జీఓ 317 పై పునః సమీక్ష, గల్ఫ్‌ దేశాల్లో తెలంగాణ భవన్‌ల ఏర్పాటు,
- అన్ని పంటలకు బీమా.



కాళేశ్వరం కంటే ధరణి పెద్ద కుంభకోణం

- బీఆర్‌ఎస్‌ సర్కార్‌ అతిపెద్ద మోసం
- బీజేపీ అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తాం
- ధరణి బాధితులకు న్యాయం చేస్తాం
- వీఆర్వోలను తప్పించి భూ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్‌ జవదేకర్‌



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో ధరణి పోర్టల్‌ పేరుతో భారీ భూకుంభకోణ జరిగిందని, ఇది కాళేశ్వరం కుంభకోణం కంటే పెద్దదని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్‌ జవదేకర్‌ ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేసిన అతిపెద్ద మోసం ఇదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి రాగానే ధరణి కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి భూ యజమానులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ‘దొంగ ప్రభుత్వమిది.. ప్రజలను మోసం చేసినందుకు శిక్ష అనుభవించాల్సిందే’అని అన్నారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ ఓడిపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ధరణి కారణంగా లక్షలమంది రైతులు తమ విలువైన భూమిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌ సర్కార్‌ ధరణిని సర్వరోగ నివారిణి అని గొప్పగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. గ్రామాల్లో రెవెన్యూ రికార్డులను నిర్వహించాల్సిన వీఆర్వోల వ్యవస్థను లేకుండా చేసి, ఆ భూ రికార్డులను ప్రభుత్వం తీసేసుకుని వాటిని ఎవరికీ అందకుండా చేశారని ఆరోపించారు. ధరణిలో రెవెన్యూ రికార్డులను మార్చేసి.. పట్టేదార్, పొసెషన్‌ (అనుభవదారు)ల స్థానంలో బినామీ, అక్రమ చొరబాటుదారు అని పేర్లు చేర్చారన్నారు. భూ రికార్డులను పూర్తిగా గందరగోళం చేశాక కేంద్రం ఇచ్చిన నిబంధనలను బేఖాతరు చేస్తూ కొత్త రూల్స్‌ తీసుకొచ్చారని ఆరోపించారు. దీంతో భారీమొత్తంలో భూ రికార్డులు తారుమారయ్యాయని ఆరోపణలు వచ్చాయన్నారు. వ్యవసాయ, ప్రైవేటు, ప్రభుత్వ భూములు, ఈడీ సీజ్‌ చేసిన భూములు, దేవాలయ భూములు, చెరువులు, కాందిశీకుల భూమి, పరిశ్రమల భూములు, భూదాన్‌ భూములు, ఎక్స్‌–సర్వీస్‌మెన్‌ భూములు, స్వాతంత్య్ర సమరయోధుల భూములు, పైగా ల్యాండ్స్, బ్లూబుక్‌ ల్యాండ్స్‌ల విషయంలో పెద్దమొత్తంలో అవకతవకలు జరిగాయని జవదేకర్‌ ఆరోపించారు.

విదేశీ కంపెనీ చేతిలోకి ధరణి వివరాలు

విశ్వసనీయ వర్గాలు, నిపుణులు చెబుతున్నదాని ప్రకారం.. ఓ విదేశీ కంపెనీ రూపొందించిన యాప్‌ (మొబైల్‌ అప్లికేషన్‌) ధరణిలోని డిజిటల్‌ డాక్యుమెంట్స్‌ను యాక్సెస్‌ చేసినట్లు తెలుస్తోందని జవదేకర్‌ అన్నారు. ప్రభుత్వ డేటాను ఓ ప్రైవేటు కంపెనీ పరిశీలించడం సాధ్యం కాదనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అయితే తెలంగాణలో మాత్రం దీనికి విరుద్ధంగా ప్రభుత్వ కీలక డేటా ఓ ప్రైవేటు కంపెనీకి అందుబాటులో ఉందని ఆరోపించారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా, గ్రామసభలను నిర్వహించకుండా భూ రికార్డుల వ్యవస్థను తారుమారు చేశారని ధ్వజమెత్తారు. దీంతో భూములకు సంబంధించిన చాలా సర్వే నంబర్లు గల్లంతయ్యాయని చెప్పారు. ఈ సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

శోకింపతగని వాటిని గూర్చి నీవు శోకించుచున్నావు.
గతులు కల్గిన మరియు గతులు లేని వాటిని గూర్చి పండితులు బాధపడరు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 18 నవంబర్ 2023

పనికొచ్చే చర్చలేనా?!

ఎటుచూసినా ఘర్షణలు, బెదిరింపులే రివాజుగా మారిన ప్రపంచంలో... ఏడాదిగా మాటా మంతీ లేని రెండు పెద్ద దేశాలు ఒకచోట కూర్చుని చర్చించుకున్నాయంటే కాస్త వింతగానే అనిపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల మధ్య బుధవారం కాలిఫోర్నియాలో ద్వైపాక్షిక చర్చలు జరగటం, అందులో పురోగతి సాధించామని ఇద్దరూ చెప్పటం ఉపశమనం కలిగించే పరిణామమే. ఉపశమనం మాట అటుంచి ఇద్దరూ కలవటమే ఇప్పుడు పెద్ద వార్త. అంతకు మించి ఎవరూ పెద్దగా ఆశించలేదు. ఇరు దేశాల విభేదాలతో పోలిస్తే సాధించింది అతి స్వల్పం. వర్తమాన ఉద్రిక్త పరిస్థితుల్లో ఎంతోకొంత సాధించామని చెప్పుకోవటం బైడెన్, జిన్‌పింగ్‌లిద్దరికీ అవసరం. రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య దాదాపు రెండేళ్ల నుంచి యుద్ధం సాగుతోంది. కనుచూపు మేరలో అది చల్లారేలా లేదు. ఈలోగా గత నెలలో హమాస్ సాగించిన నరమేధంతో గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఇప్పటికి దాదాపు 12,000 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఏకపక్ష దాడులకు స్వస్తి చెప్పాలన్న వినతులను ఇజ్రాయెల్ బేఖాతరు చేస్తోంది. పర్యవసానంగా పశ్చిమాసియా ఉద్రిక్తంగా మారింది. ఈ రెండుచోట్లా కీలకపాత్ర పోషిస్తున్న రష్యా, ఇరాన్‌లను ఎలా ఎదుర్కొనాలో తెలియని అయోమయంలో అమెరికా వుంది. జో బైడెన్‌కు వచ్చే ఏడాది దేశాధ్యక్ష ఎన్నికలు రాబోతున్నాయి. ఆయన మరోసారి అదృష్టం పరీక్షించుకోవాలన్న ఆరాటంలో వున్నారు. అటు జిన్‌పింగ్‌కు సమస్యలు తక్కువేం లేవు. అమెరికాతో ఉద్రిక్తతలు పెరిగాక విదేశీ పెట్టుబడులు తరిగిపోయాయి. దశాబ్దాలపాటు ఎడతెగకుండా సాగిన ఆర్థిక పురోగతి మందగించింది. మితిమీరిన రుణభారంతో, రియలెస్టేట్ కుప్పకూలడంతో, ఎగుమతులు దిగజారటంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నేలచూపులు చూస్తోంది. ఇప్పటికే అమెరికా విధించిన ఆంక్షలు మరింత పెరగకుండా చూడటం, సాంకేతికత విక్రయంపై ఆ దేశం మరిన్ని ఆంక్షలు పెట్టకుండా చూసు కోవటం చైనాకు తక్షణావసరం. వివాదాలకు ఎక్కడో ఒకచోట ముగింపు లేకపోతే చైనా మరింత గడ్డుస్థితిలో పడుతుంది. నిజానికి దాన్ని దృష్టిలో వుంచుకునే 'దుందుడుకు దౌత్యం'లో సిద్ధహస్తులైన చైనా విదేశాంగమంత్రి కిన్ గాంగ్, రక్షణమంత్రి జనరల్ లీ షాంగ్‌ఫూలను హఠాత్తుగా తప్పించింది. వారిద్దరి ఆచూకీ ఇప్పటికైతే తెలియదు.

ఆ దేశాల అంతర్గత సమస్యలు, ఆ రెండింటిమధ్యా వున్న వివాదాల మాటెలావున్నా ఇప్పుడున్న అనిశ్చితిలో అమెరికా, చైనా రెండూ ముఖాముఖీ చర్చించుకోవటం ప్రపంచానికి చాలా అవసరం. ఎందుకంటే ఆ రెండింటి మధ్యా తలెత్తే యుద్ధం అన్ని దేశాలకూ పెనుముప్పుగా పరిణమిస్తుంది. ఆర్థిక వ్యవస్థలన్నీ తలకిందులవుతాయి. నాలుగు గంటలపాటు జరిగిన చర్చల అనంతరం బైడెన్, జిన్‌పింగ్‌లిద్దరూ సైనిక ఉద్రిక్తతలు తలెత్తిన పక్షంలో నేరుగా సంభాషించుకునే సదుపాయాన్ని పునరుద్ధరించుకోవటానికి అంగీకరించినట్టు ప్రకటించారు. అప్పటి ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ నిరుడు తైవాన్ పర్యటించటాన్ని ఖండిస్తూ చైనా దీనికి స్వస్తిపలికింది. ఇది చెప్పుకోదగ్గ పురోగతే. అలాగే పర్యావరణ పరిరక్షణకు కలిసి పనిచేయాలనుకోవటం, పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో సమష్టిగా కృషి చేయాలనుకోవటం కూడా మంచిదే. అమెరికా, చైనా రెండూ ప్రపంచాన్ని కాలుష్యం బారిన పడేస్తున్న దేశాల జాబితాలో ఒకటి, రెండు స్థానాల్లో వున్నాయి. కాలుష్యంలో ఇద్దరి వాటా 38 శాతంగా వుంది. పారిశ్రామికీకరణకు ముందున్న ఉష్ణోగ్రతలకన్నా 1.5 డిగ్రీల సెల్సియస్ మించకుండా చూడాలన్నది పారిస్ ఒప్పందం సారాంశం. ముప్పు ముంచుకొస్తున్నా రెండు దేశాలూ అవతలి పక్షం అమలు చేశాకే ముందుకు కదులుతామని మొండికేయటంతో ఎలాంటి పురోగతీ లేకుండా పోయింది. ఇప్పటికే ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.2 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి. భూగోళం నలుమూలలా కార్చిచ్చులు, కరువులు, వరదలు వంటి వైపరీత్యాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి సారిస్తామనటం మంచిదే. అయితే కొత్తగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు స్థాపించి మరో 366 గిగావాట్ల విద్యుదుత్పాదనకు చైనా వేసుకున్న ప్రణాళికల మాటేమిటి? దాన్ని రద్దు చేయటానికి ఆ దేశం అంగీకరించిందా? ఆ ఊసే లేనప్పుడు ఇలాంటి కంటితుడుపు ప్రకటనలవల్ల ఒరిగేదేమిటి? కృత్రిమ మేధకు సంబంధించిన సాంకేతికతల విషయంలో పారదర్శకంగా వుండాలని, పరస్పరం సహకరించుకోవాలని ఇరు దేశాల అధినేతలూ నిర్ణయించారు. కృత్రిమ మేధను సైనిక ప్రయోజనాల కోసం వినియోగించటం మొదలుపెడితే దాని పర్యవసానాలు తీవ్రంగా వుంటాయి. దేశాలమధ్య తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడే ప్రమాదం వుంటుంది.

అయితే ఈ అంశాలన్నిటిపైనా ఒప్పందాలేమీ లేవు. కేవలం నోటి మాటలే. వాటికి మున్ముందు రెండు దేశాలూ ఏపాటి విలువిస్తాయో తెలియదు. సమావేశానంతరం విడివిడి ప్రకటనలతో సరిపెట్టుకోవటం, కొన్ని గంటలు గడిచాక జిన్‌పింగ్‌ను ఉద్దేశించి 'ఆయనొక నియంత' అంటూ బైడెన్ వ్యాఖ్యానించటం, దానికి చైనా విదేశాంగ ప్రతినిధి అభ్యంతరం తెలపటం వాస్తవస్థితికి అద్దం పడుతోంది. తైవాన్, ఫిలిప్పీన్స్‌లతో చైనా లడాయి సరేసరి. తైవాన్‌కు 10,600 కోట్ల డాలర్ల సైనిక సాయం అందించటానికి సంబంధించిన తీర్మానం అమెరికన్ కాంగ్రెస్‌లో పెండింగ్‌లో వుంది. అది సాకారమైతే చైనాతో సంబంధాలు మొదటికొస్తాయి. ఇన్ని అవాంతరాలున్నా అధినేతలిద్దరూ ముఖాముఖీ మాట్లాడుకోవటం మంచిదే. ఇది ఉద్రిక్తతల ఉపశమనానికి తోడ్పడాలని ఆశించాలి.

ప్రశ్నకు బలాన్నిచ్చే కుల గణన

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

కులాల వారీగా జనాభా విస్తృత కూర్పును బిహార్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ గణన మొదటిసారిగా కులాల వారీగా పేదరికాన్ని స్పష్టంగా చూపిస్తోంది. కుల గణన అఖిల భారత స్థాయిలో జరిగిన తర్వాత మొత్తం రాజకీయ నిర్మాణం సమూల మార్పునకు లోనవుతుంది. సుప్రీంకోర్టు అన్ని రిజర్వేషన్లకు 50 శాతం పరిమితిని నైతిక ప్రాతిపదికన విధించింది. ఇటువంటి ప్రామాణికమైన గణాంకాలను కోర్టు ముందు ఉంచిన తర్వాత దానిని అనుసరించి వెళ్లాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే కులాల వారీగా లెక్కల సేకరణ మొదలు పెట్టింది. ఇప్పుడు బీజేపీ కూడా కుల గణన గురించి ఒక వైఖరిని తీసుకోవలసి వస్తుంది. కుల గణన అనే ప్రశ్నను ఇప్పుడు ఏ పార్టీ కూడా తప్పించుకోలేదు.

బిహార్ ప్రభుత్వం మొదటి దశలో కులాల వారీగా ఆ రాష్ట్రంలోని జనాభా విస్తృత కూర్పును విడుదల చేసింది. రాష్ట్రంలో ఓబీసీలు 63.13 శాతం ఉండగా, ముస్లిమేతర అగ్రవర్ణాల వారు 10 శాతం మాత్రమే ఉన్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. వెనుకబడినవారు (27.13 శాతం), అత్యంత వెనుకబడినవారు (36 శాతం) కలిసి 63.13 శాతం ఉన్నారు. బ్రాహ్మణులు, భూమిహార్లు, కాయస్థులు, రాజపుత్రులు (క్షత్రియులు) ఉన్న జనరల్ విభాగంలోని జనాభా 15.52 శాతం మాత్రమే. కులాల వారీగా చూస్తే యాదవులు 14.27 శాతంతో అతిపెద్ద జనాభాగా ఉన్నారు. ఈ ఒక్క కులం ఆ రాష్ట్రంలో జనరల్ కేటగిరీ అంత పెద్దది. ముస్లిం జనాభాను వేరుచేస్తే, హిందూ ఓబీసీలు 50 శాతం ఉన్నారు.

కుల గణన ప్రభావం ఎలా ఉంటుంది?

సుప్రీంకోర్టు స్థాయిలో న్యాయపరమైన నిర్ణయాలలో ఈ కుల గణన ఎలా ఉంటుంది? సుప్రీంకోర్టు అన్ని రిజర్వేషన్లకు 50 శాతం పరిమితిని నైతిక ప్రాతిపదికన విధించింది. ఇటువంటి ప్రామాణికమైన గణాంకాలను కోర్టు ముందు ఉంచిన తర్వాత దానిని అనుసరించి వెళ్లాల్సి ఉంటుంది. కుల గణన అఖిల భారత స్థాయిలో జరిగిన తర్వాత మొత్తం రాజకీయ నిర్మాణం సమూల మార్పునకు లోనవుతుంది. కులాల వారీగా జనాభా లెక్కల సేకరణపై అన్ని పార్టీల్లోని ద్విజ కులాల నేతలు భయపడటానికి ఇదే కారణం.

కుల సామాజిక–ఆర్థిక, విద్యాపరమైన డేటా సిద్ధమైన తర్వాత ఓబీసీ రిజర్వేషన్లను 65 శాతానికి పెంచాలని బిహార్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా వెనుకబడిన వర్గాల) రిజర్వేషన్‌తో కలిపి ఇది 75 శాతానికి చేరుకుంటుంది. నితీశ్ కుమార్, తేజస్వి యాదవ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీజేపీ భావజాలంలో సంక్షోభాన్ని సృష్టిస్తుంది. అంతేకాకుండా, కనీసం ఒక రాష్ట్రం నుండి అయినా, తాను గతంలో పేర్కొన్న 50 శాతం పరిమితి వైపు తిరిగి చూసుకునేలా భారత న్యాయవ్యవస్థను ఇది ఒత్తిడికి గురిచేస్తుంది.

పేదరికం సూచికలు

బిహార్‌లో కులాల వారీగా పేదరికం స్థాయులను చూడండి: నెలకు 6,000 రూపాయల కంటే తక్కువ ఆదాయం సంపాదించేవారు ఏ రాష్ట్రంలోనైనా పేదవారిలో అత్యంత పేదలుగా లెక్కలోకి వస్తారు. అంటే, ఈ కుటుంబాలు సంవత్సరానికి రూ.72,000ల కంటే తక్కువ సంపాదిస్తున్నాయి. 21వ శతాబ్దపు ప్రపంచీకరణ ప్రపంచంలో, ఈ ఆదాయం ఇద్దరు పిల్లలతో కూడిన దంపతులను పోషించడం కష్టం. సాధారణంగా నాటి ప్రణాళికా సంఘం ఆర్థిక సర్వేలు, నేటి నీతి ఆయోగ్ సర్వేల ద్వారా తెలిసే దారిద్ర్య రేఖ ప్రకారం, బిహార్ అత్యంత పేదరికం ఉన్న రాష్ట్రంగా అందరికీ తెలుసు. దీని తర్వాత ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వస్తాయి. వీటిని 'బిమారు' రాష్ట్రాలు అని



కూడా అంటారు.

బిహార్ కుల జనాభా గణన మొదటిసారిగా కులాల వారీగా పేదరికాన్ని స్పష్టంగా చూపిస్తోంది. దీని ప్రకారం ఎస్సీలు (42.93 శాతం) సంపూర్ణ పేదరికంలో ఉన్నారు. 42.7 శాతంతో ఎస్టీలు పేదరికంలో ఎస్సీలను అనుసరిస్తున్నారు. అత్యంత వెనుకబడిన తరగతులు(ఎంబీసీ) జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్నారు. పేదరికం పరంగా వారు 33.58 శాతం మంది ఓబీసీ వర్గాలకన్నా అధ్వాన్నంగా ఉన్నారు. అత్యంత పేదరికంలో 33.16 శాతం ఓబీసీలు ఉన్నారు. ఒక కులంగా అత్యధికంగా ఉన్న యాదవుల్లో 35.87 శాతం మంది పేదరికంలో ఉన్నారు.

బిహార్‌లో బ్రాహ్మణులు (25.32 శాతం), భూమిహార్లు (27.58 శాతం), రాజపుత్రులు (24.89 శాతం) కూడా పేదరికంతో ఎలా బాధపడుతున్నారో గణాంకాలు చూపుతున్నాయి. అతి తక్కువ పేదరికం ఉన్న కులం కాయస్థ. ఇందులో 13.38 శాతం మంది పేదరికంతో ఉన్నారు. ఏమైనప్పటికీ, చారిత్రకంగా అణచివేయబడిన కులాలు విద్య, కుల మూలధనం లేకుండా బాధపడుతున్నాయని మనం అర్థం చేసుకోవాలి. కులాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని మనం పరిశీలిస్తే, బిహార్‌లోని ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు కేవలం రిజర్వేషన్లు కాకుండా చాలా సంక్షేమ చర్యలు అవసరం అని బోధపడుతుంది.

బిహార్‌లో వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో పారిశ్రామిక రాజధాని అనేది లేదు. రాష్ట్ర రాజధాని పట్నా(ప్రాచీన పాటలీపుత్ర)తో సహా దాని పట్టణ ప్రాంతాల్లోని ఆర్థిక చైతన్యం దక్షిణ భారత దేశంలోని ఒక జిల్లా ప్రధాన కార్యాలయ స్థాయికి కూడా సమీపంలో ఉండదు. రాష్ట్ర ఉత్పాదకతను పెంపొందించకపోతే, ఇంత విస్తారమైన పేద జనాభాను దారిద్ర్య రేఖ నుంచి బయటకు తేవడం అసాధ్యం.

జాతీయ పర్యవసానాలు

అనేక రాష్ట్రాలు ఇప్పుడు కులాల వారీగా గణాంకాలను సేకరించవలసి వస్తుంది. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇప్పటికే కులాల వారీగా లెక్కలు సేకరించడం ప్రారంభించాయి. బిహార్ కుల గణన సమాచారం విడుదలైన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సమావేశంలో, తాము అధికారంలో ఉన్న చోట కులాల వివరాలను సేకరిస్తామని నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దశాబ్దానికి ఒకసారి సాధారణ జనాభా గణనలో కుల గణనను భాగం చేస్తామని పేర్కొంది.

ఈ కొత్త పరిణామం తన మానస పుత్రిక అయిన బీజేపీ ద్వారా దేశాన్ని పాలిస్తున్న ఆర్ఎస్ఎస్‌కు షాక్ కలిగించింది. కారణం సులభం. రిజర్వేషన్ వ్యవస్థను తొలగించడం, కుల గుర్తింపు గురించి ఎటువంటి చర్చనైనా నిషేధించడం దాని లక్ష్యం. సామాజిక ఇంజనీరింగ్ గురించి వారి ఆలోచన ఏమిటంటే– ముస్లింలతో, క్రైస్తవులతో పోరాడటానికి హిందువులు ఐక్యం కావాలి. కుల గుర్తింపులను విస్తరించ కూడదనీ, ద్విజ నియంత్రణలో ఉన్న సనాతన ధర్మంలో సంక్షోభాన్ని సృష్టించకూడదనీ దళిత, శూద్ర ప్రజానీకాన్ని ఒప్పించడమే వారి విధానం.

2014 ఎన్నికలలో ఓటు ప్రయోజనాల కోసం నరేంద్ర మోదీ తన ఓబీసీ గుర్తింపును ఉపయోగించుకోవడానికి ఆర్ఎస్ఎస్ చాలా అయిష్టతతో అనుమతించింది. రాజకీయ చర్చలో కుల ప్రశ్నలకు తావులేకుండా, నిరంతరం ముస్లిం బుజ్జగింపులు, ముస్లిం శత్రుత్వం, పాకిస్తాన్ మొదలైనవాటిని ఉపయోగించి గుజరాత్‌ను నిర్వహించినట్లు మోదీ దేశాన్ని నిర్వహిస్తారని వారు భావించారు.

కానీ భారతదేశం గుజరాత్ కాదు. మోదీ కుల గుర్తింపు, కుల గుర్తింపులపై ఆధారపడిన ఆయన ఓట్ల సమీకరణ అనేవి... ఉత్తర భారతదేశంలో, ప్రత్యేకించి ఉత్తర ప్రదేశ్‌లో కుల గుర్తింపు సమస్యను తార్కిక ముగింపు వైపునకు నెట్టడానికి మండల్ అనుకూల వాదులకు చోదక శక్తిగా ఉంటున్నాయి.

ఇప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ కుల గణన గురించి ఒక వైఖరిని తీసుకోవలసి వస్తుంది. అలా తీసుకోలేదంటే, మొత్తం శూద్ర, ఓబీసీ ప్రజానీకం ఇంతకాలం తమ ఓటు శక్తిని ద్విజ శక్తిని సుస్థిరం చేయడానికి మాత్రమే వారు ఉపయోగించుకున్నారని గ్రహిస్తారు. తమ ప్రభుత్వం 27 మంది ఓబీసీలను మంత్రులుగా చేసిందని 2023 రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మోదీ పదే పదే చెబుతున్నారు. కుల గణన హిందూ సమాజాన్ని విడదీస్తుందని కూడా ఆయన చెబుతున్నారు. చారిత్రకంగా అణచివేయబడిన ఓబీసీలను క్షేత్రస్థాయిలో ఉద్ధరించ కూడదని మాత్రమే ఇలాంటి వాదనలు తెలియజేస్తాయి. కుల గణన అంటే, ప్రతి సామాజిక బృందం వాస్తవ స్థితి ప్రాతిపదికన వనరుల కేటాయింపు, సంక్షేమ ప్రణాళికల ప్రశ్న. ఇప్పుడు కుల గణన అనే ప్రశ్నను ఏ పార్టీ కూడా తప్పించుకోలేదు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉపయోగం తెలియదా?



ఒక బెంగళూరు రెస్టారెంట్లో పెనం మీద చీపురు వాడారని ఒక ఉత్తరాది టీవీ గోల! అరే, అది 'కొబ్బరి చీపురు'. దాన్ని పెనం మీద వాడటానికే ఉపయోగిస్తారు, మరిదేనికీ వాడరు. దక్షిణ భారతదేశంలో అది సాధారణమే. ఇలాంటివి తెలుసుకొని ప్రచారం చేస్తే మంచిది.

– అద్వైత్, క్రానికలర్

వాస్తవం వేరే!



ఇజ్రాయెల్ అంతం కావాలని భావించే పాలస్తీనియన్లు ఉన్నారు; పాలస్తీనియన్ల నరమేధం కొనసాగాలని కోరుకునే ఇజ్రాయెలీలు ఉన్నారు. గత నెల రోజులుగా ఇలాంటి గొంతుకలు సామాజిక మాధ్యమాల్లో పదునెక్కాయి. కానీ వీళ్లు ఇరుపక్షాల జనపు కాంక్షలను కూడా ప్రతిబింబించరు. ఇలాంటి వాళ్లను నిరోధించాలి.

– ఇయాన్ బ్రెమ్మర్, పొలిటికల్ సైంటిస్ట్

గ్రేట్ రోహిత్



సంకల్పం, నిస్వార్థం అనేవి పరామితులు అయితే, ప్రపంచ కప్‌లో ఉత్తమ బ్యాటర్ రోహిత్ శర్మ. గొప్ప కెరియర్‌లో ఉండగా, ఇంత ఆలస్యంగా తమ సంకల్పాన్నీ, ఆడే తీరునూ కొద్దిమంది టాప్ క్రీడాకారులు మాత్రమే మార్చుకోగలరు. 2022 టీ–20 సెమీ ఫైనల్ తర్వాత రోహిత్ తనను మార్చుకోగలిగారు.

– జాయ్ భట్టాచార్య, క్విజ్ నిర్వాహకుడు

ప్రాణాంతక సమస్య



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన తేవడం కోసం పంజాబ్ వ్యాప్తంగా నడవాలని నేను ఆలోచన చేస్తున్నాను. యవకులు ప్రాణాలు కోల్పోతుంటే, దీన్ని ప్రభుత్వాలకు వదిలేసి ఊరికే చూస్తూ కూర్చోలేము.

– ఖుశ్వంత్ సింగ్, రచయిత

మనం నయమే!



అన్ని అంశాలనూ పరిగణన లోకి తీసుకుంటే, మన కాలపు అత్యంత వినాశక ప్రపంచ సంక్షోభం అయిన ఉక్రెయిన్ యుద్ధంపై మిగిలిన దేశాలతో పోల్చితే ఇండియా చక్కగా వ్యవహరించింది.

– స్టాన్లీ జానీ, కాలమిస్ట్

నిరుద్యోగిత తెలిసేలా...

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల్లో ఒక నిరుద్యోగ యువతి కూడా పోటీకి దిగింది. ఆమె ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతి. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు తగినన్ని విడుదల చేయకపోవడం, కొన్ని నోటిఫికేషన్లు రద్దు కావడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు లోనవుతోందని ఆమె అంటోంది. వారి బాధలు ప్రపంచానికి తెలియచేయడం కోసం తాను ఎన్నికల బరిలో దిగానని నాగర్ కర్నూలు జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం మర్రికల్ గ్రామానికి చెందిన కర్నె శిరీష (బర్రెలక్క) ప్రకటించింది. ఆమె కొల్లాపూర్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది.



కర్నె శిరీష (బర్రెలక్క)

కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క రెండేళ్ల కింద సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్ట్ చేసింది. అందులో తాను నిరుద్యోగిననీ, ఉద్యోగం రాక పోవడంతో తల్లి సాయంతో నాలుగు బర్రెలను కొనుక్కొని మేపుతున్నాననీ, రోజుకు మూడు వందలు డబ్బులు వస్తాయనీ ముచ్చటించింది. ఈ వీడియో వైరల్ అయ్యింది. అప్పటి నుంచీ ఆమె సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయ్యింది.

శిరీష హైదరాబాద్‌లో ఉంటూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతోంది. ప్రతి ఏడాదీ ఉద్యోగాలు ఇవ్వాలి అని సోషల్ మీడియాలో ఉద్యమిస్తోంది. నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆమెకి మద్దతు తెలుపుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ ఎస్ నుండి బీరం హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరఫురఫున జూపల్లి కృష్ణారావు, బీజేపీ నుండి ఎల్లేని సుధాకర్ రావులు పోటీలో ఉన్నారు. వాళ్లంతా అధికారం, పలుకుబడి ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన నాయకులనీ, వాళ్ళని ఢీకొంటున్న తనకు అందరూ వెన్నుదన్నుగా నిలవాలనీ శిరీష కోరుతోంది.

ఇలాంటి చదువుకున్న యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలి. ఎంతసేపటికీ ఉద్యోగాలూ, సంపాదనా, స్వప్రయోజనాలతో కూడిన కెరీర్ నిర్మాణంపైనే యువత దృష్టి పెడితే ఇక కొత్త నీరు రాజకీయాల్లోకి ఎలా వస్తుంది? చదువుకున్న యువత రాజకీయాలను పట్టించుకోకపోవడం వల్లనే సమర్థవంతులైన వారు అధికార పదవుల్లోకి రావడంలేదు. ఫలితంగా పాలన నాసిరకంగా తయారయ్యింది. కడు పేదరికంలో ఉన్న ఓ నిరుద్యోగ యువతి అయిన శిరీష రంగంలోకి దిగడం ఇప్పుడు ఎందరో యువతీ యువకులకు రాజకీయాల్లో ప్రవేశించడానికి స్ఫూర్తిని ఇస్తోంది.

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్‌లో రాజకీయపార్టీల గెలుపోటములపై శిరీష తన ప్రభావం తప్పకుండా చూపుతుందని కొందరు వ్యాఖ్యానించడం గమనార్హం. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని శిరీష తనదైన శైలిలో ఇప్పటికే ప్రభావవంతంగా ప్రచారం చేయడం ప్రారంభించింది. నిరుద్యోగులందరూ ఆమె తరఫున తమ పరిధిలో ప్రచారంలో పాల్గొంటున్నారు. మొత్తంమీద బర్రెలక్క వార్తల్లో వ్యక్తి అయ్యిందని చెప్పవచ్చు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఇలాంటి యువత ఎన్నికల్లో పోటీ చేయడమే దానికదే ఒక పొలిటికల్ స్టేట్‌మెంట్ అనొచ్చేమో!

– కిరణ్ ఫిషర్, అడ్వకేట్

మన కాలపు వజ్రాయుధుడు

సందర్భం



పెనుగొండ లక్ష్మీ నారాయణ

'జన్మనెత్తిన మానవునకు/ జీవితమే పరమ ధనం/ అయితే అది ఒక మారే అతనికొసగబడిన వరం' అన్న జీవిత సత్యం తెలిపిన భౌతికవాది ఆవంత్స సోమసుందర్. తన 92 సంవత్సరాల జీవిత కాలంలో ఏడున్నర దశాబ్దాలు జాతిహితం కోసం ఉద్యమ స్థాయిలో రచనా వ్యాసంగం కొనసాగించిన అభ్యుదయ సాహితీవేత్త.

సోమసుందర్ 1949 విరోధినామ సంవత్సర ఉగాదినాడు 'వజ్రాయుధం' ప్రతిని అందుకొని మే 8న ఆవిష్కరణ గావించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తరఫున కళాకేళి ప్రచురణగా అందించారు. 1950 ఫిబ్రవరి 26న ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం కమ్యూనిస్టు సాహిత్యం అన్న కారణంతో వజ్రా యుధాన్ని నిషేధించింది. 1956లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.



ఆవంత్స సోమసుందర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజాపక్షం వహించి సోమసుందర్ రాసిన వజ్రాయుధ కవిత్వం తెలుగునాట దశదిశలా మార్మోగింది. 'ఒక వీరుడు మరణిస్తే/ వేల కొలది ప్రభవింతురు/ ఒక నెత్తుటి బొట్టు తోనె/ ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు!' కవితా చరణాలు గోడమీద నినాదాలైనాయి. ప్రజల నోట ప్రతిధ్వనించాయి. పోరాట స్ఫూర్తిని రగిలించాయి. నిజాం నవాబును తీవ్రంగా హెచ్చరించిన కవితా సంపుటి వజ్రాయుధం. ఆ కాలంలో సోమసుందర్ పేరును ఎందరో వామపక్షాభిమానులు తమ బిడ్డలకు పెట్టు కు న్నారు. అది ఆయన తన జీవిత కాలంలోనే అందుకున్న మహోన్నత గౌరవం.

తన చరిత్ర తనే పఠించి ఫక్కున నవ్వింది ధరణి / తన గాథను తనే స్మరించి భోరున ఏడ్చింది ధరణి' ఇలా గతితార్కిక భౌతికవాద దృక్పథంతో వలస కాలం నుండి ప్రపంచీకరణ దాకా వచ్చిన పరిణామాలన్నింటినీ ప్రగతిశీల దృష్టితో నమోదు చేసిన రచయిత సోమసుందర్. కమ్యూనిస్టు కార్యకర్తగా జైలుశిక్షను అనుభవిస్తున్న కాలంలో క్రిస్టోఫర్ కాడ్వెల్ రచన 'ఇల్యూజన్ అండ్ రియాలిటీ'ని పదేపదే అధ్యయనం చేసి 'భ్రాంతి–వాస్తవికత' తదనంతర కాలంలో అందించారు. ప్రముఖ మార్క్సిస్ట్ విమర్శకులు జార్జి థాంప్సన్ రచనను 'మార్క్సిజం–కవిత్వం'గా అందించిన మార్క్సిస్టు విమర్శకుడు సోమసుందర్.

తన గురుదేవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి కవితా దీపాల వెలుగులను లోకంలో ప్రకాశింపజేశారు. 'గురజాడ గురుత్వాకర్షణ శక్తి'ని కీర్తిస్తూ అక్షరార్చన చేశారు. సోమ దీర్ఘ కవిత 'మేఘరంజని' (1958) తెలుగులో తొలి ప్రేమకావ్యంగా పరిశోధకుల గుర్తింపు పొందింది. 'కలలు – కన్నీళ్లు' శీర్షికన తన ఆత్మకథను ఒక సాహిత్య చారిత్రక గ్రంథంగా వెలువరించారు. పీఠికాపురవాసి అయిన సోమసుందర్ ఎందరి పుస్తకాలకో విలువైన పీఠికలను సమకూర్చటం ఒక చరిత్ర.

సంగీత స్రష్టలను కళాత్మకంగా 'హంస ధ్వని' ద్వారా పరిచయం చేశారు. 'కెరటాలు–కిరణాలు' శీర్షికన దేశవిదేశాల సాహితీవేత్తలనూ మన ముందుంచారు. 'సాహిత్యంలో సంశయ కల్లోలాలు' ద్వారా యువ సాహితీ వేత్తల సంశయాలను తొలగించారు. 'చరమ దశాబ్దిలో కవితా రసాబ్ధి' ద్వారా యువ సాహితీ వేత్తల భుజాలు తట్టారు. చివరి దశలో వారు పునర్ముద్రించిన 'శరచ్చంద్రిక' కాంతులు ప్రసరిస్తూనే ఉన్నాయి.

ఆచార్య రాచపాళెం అన్నట్లు సోమసుందర్ తెలుగు సాహిత్యానికి సాహిత్య రచన, సాహిత్య ప్రచురణ, సాహిత్య ప్రచారం, సాహిత్య ప్రోత్సాహం రూపంలో సేవలు అందించారు. 'కళాకేళి' పత్రిక ద్వారా ప్రజా సాహిత్యాన్ని ప్రోత్సహించారు. సోమసుందర్ తన సాహిత్య కృషికి గుర్తింపుగా తెలుగు విశ్వవిద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. ఎన్నో పురస్కారాలు పొందారు. తన జన్మదినం నాడు సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ పక్షాన తనకు నచ్చిన, తాను మెచ్చిన సాహితీవేత్తలకు సత్కరించారు.


అభ్యుదయ సాహిత్యోద్యోమ ప్రచారంలో తెలుగు నేలంతటా, దేశమంతటా, విదేశాలలోనూ పర్యటించిన సోమసుందర్ 'అరసం' అధ్యక్షవర్గ సభ్యునిగా, గౌరవాధ్యక్షునిగా దశాబ్దాలపాటు విలువైన సేవ లందించారు. సాహిత్యం కోసం తన సమస్తాన్నీ ధారపోసిన సోమసుందర్ నేత్రాలనూ, భౌతిక కాయాన్ని సమాజానికే సమర్పించి, మన తరానికి మార్గదర్శి అయినారు.

వ్యాసకర్త అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు

(రేపటి నుంచి పిఠాపురంలో సోమసుందర్ శతజయంతి ఉత్సవాలు ప్రారంభం)

మరణానికి ముందు...

ఖట్వాంగుడు అనే రాజు సప్త ద్వీపాలను పరిపాలిస్తూ ఉండేవాడు. ఒకసారి ఇంద్రాది దేవతలు యుద్ధంలో రాక్షసుల చేతిలో ఓడిపోయారు. ఖట్వాంగుని దగ్గరకు వచ్చి తమకు సాయపడమని ప్రార్థించారు. ఖట్వాంగుడు భూలోకం నుంచి స్వర్గ లోకానికి వెళ్లి రాక్షసుల నందరినీ సంహరించాడు. దేవతలు సంతోషించి వరం కోరుకొమ్మన్నారు. ఖట్వాంగుడు తానెంత కాలం ఇంకా జీవించి ఉంటాడో చెప్పమన్నాడు. ఇదే తాను కోరే వరం అన్నాడు. దేవతలు ఇంకా నీకు ఆయువు ఒక ముహూర్త కాలమే ఉందన్నారు.



జ్యోతిర్మయం

ఒక ముహూర్తం అంటే రెండు గడియల కాలం. అంటే నలభై ఎనిమిది నిముషాలను ముహూర్త కాలం అంటారు.

ఖట్వాంగునికి మిగిలిన జీవితం నలభై ఎనిమిది నిముషాలే. అతడు రాజ్యాన్ని, సంపదను, ప్రియమైన సుందరీ మణులను అందరినీ వైరాగ్యంతో పరిత్యజించాడు. గోవిందనామ సంకీర్తనంతో రెండు గడియల్లోనే మోక్షం పొందాడు.

పరీక్షిన్మహారాజుకు ముని కుమారుని శాపం వల్ల ఏడు రోజుల్లో మరణం రానున్నదని తెలుస్తుంది. ఆ సమయంలో శుక మహర్షి అక్కడకు వస్తాడు. పరీక్షిత్తు శుకుని ఏడు రోజుల్లో మోక్షం పొందే మార్గం తెలుపమని ప్రార్థిస్తాడు. అపుడు ఏడు రోజుల తర్వాత కదా మరణం! పరమ శుభాన్ని ఆర్జించటానికి చాలా సమయం ఉంది, అని రెండు గడియల్లో ముక్తి పొందిన ఖట్వాంగుని కథ చెప్పాడు. అవసాన కాలం సమీపించగానే దేహధారులు శరీరం, భార్య, పుత్రులు అనే బంధాలపై మోహాన్ని నిష్కామమనే ఖడ్గంతో నరకాలి. విష్ణు స్మరణతో వైరాగ్యం సిద్ధిస్తుంది. 'నీకు భాగవత తత్వాన్ని తెలియజేస్తాను. భాగవత శ్రవణం మోక్షదాయకం' అని ఏడురోజులలో పరీక్షిత్తుకు భాగవతాన్ని వినిపించాడు.

జీవితంలో ప్రతి క్షణం విలువైనదే. లౌకిక జీవితంలో కూడా మనుషులు అనారోగ్యాలతో శరీరం కృశించి పోతున్నప్పుడు, మరణం గురించి చింతించకుండా, మిగిలిన జీవితాన్ని ప్రతి క్షణం అర్థవంతంగా జీవించాలి. మంచి భావనలతో, మంచి పనులతో ఉన్న కొద్ది సమయాన్ని సద్వినియోగం చేయాలనే సందేశం ఈ కథలలో ఉంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.పంచమి ఉ.9.47 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.18 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.10.07 నుండి 11.36 వరకు, తదుపరి తె.5.03 నుండి 6.34 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.11 నుండి 7.39 వరకు, **అమృతఘడియలు:** రా.7.11 నుండి 8.44 వరకు, నాగపంచమి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

క్లుప్తంగా...

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు: కవిత



నందిపేట్(ఆర్మూర్): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లా నందిపేటలో శుక్రవారం జరిగిన మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తేలు వంటిందని మండిపడ్డారు. చెప్పినవి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని నమ్ముదామా, కొత్త కథలు చెప్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మి మోసపోదామా అనేది ఆలోచించాలని ప్రజలను కోరారు. పదిసార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయని కాంగ్రెస్ పార్టీ ఒక్క అవకాశం ఇవ్వాలని అడగడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే పెన్షన్ రూ.3 వేలు, ఐదేళ్లలో దానిని రూ.5 వేలకు పెంచుకుంటూ వెళ్లాలని సీఎం కేసీఆర్ సంకల్పించారన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు అందిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబంపై ఆర్థికభారం తగ్గించాలనే ఉద్దేశంతో రూ.1,200గా ఉన్న గ్యాసు సిలిండర్ రూ.400కే సబ్సిడీ కింద ఇస్తామన్నారు. సమ్మేళనంలో ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎ.జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డి అఫిడవిట్‌లో తప్పులు

- తిరస్కరించాలని హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మంత్రి మల్లారెడ్డి తన ఎన్నికల అఫిడవిట్‌లో విద్యార్హతకు సంబంధించి తప్పుడు సమాచారం ఇచ్చారని, ఆయన నామినేషన్ తిరస్కృతికి రిటర్నింగ్ అధికారిని ఆదేశించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కీసర మండలం రామపల్లి దాయరకు చెందిన అంజిరెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. 2014, 2018లో పేర్కొన్న విద్యార్హతలు.,. తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్ పేర్కొన్న విద్యార్హతకు తేడా ఉందని వివరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఇది చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై ఒకటి రెండు రోజుల్లో హైకోర్టు విచారణ జరపనుంది.

రెండోరోజూ ఐటీ దాడులు

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లాలో ఐటీ అధికారుల సోదాలు రెండో రోజూ కొనసాగాయి. గురువారం తెల్లవారుజామున మొదలైన తనిఖీలు శుక్రవారం రాత్రి 8 గంటల వరకు జరిగాయి. తనిఖీల్లో పాల్గొన్న 40 మంది అధికారులు బృందాలుగా విడిపోయి దాడులు సాగించారు. వ్యాపారులు తమ బ్యాంకు ఖాతాల నుంచి లావాదేవీలు సాగిస్తున్నట్లు గుర్తించారు. తమ వ్యాపార లావాదేవీలను కప్పిపుచ్చేలా జాగ్రత్తలు పడుతున్న తీరును గమనించినట్టు తెలిసింది. ఐటీ దాడులు ఎదుర్కొంటున్న వ్యాపారుల కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలతో పాటు విదేశాల్లో పెట్టుబడులకు సంబంధించిన ఆర్థిక అంశాలను ఐటీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.

తెలంగాణ మాలల జేఏసీ సమావేశంలో రసాభాస

- బీఆర్ఎస్ పార్టీకే మాలల మద్దతు అన్న జేఏసీ
- తాము మద్దతు ఇవ్వమన్న ఇతర నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నేత

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర మాలల జేఏసీ సమావేశం రసాభాసగా జరిగింది. బీఆర్ఎస్ పార్టీకే మాలల సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. సమావేశంలో పాల్గొన్న ఇతర మాల సంఘాల నాయకులు జేఏసీ నిర్ణయాన్ని తాము వ్యతిరేకించారు. మాలలకు అన్యాయం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి తమ మద్దతు ఉండదని సమావేశాన్ని అడ్డుకున్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ మాట్లాడుతూ...తెలంగాణలో ఉన్న మాలల సమస్యలను పరిష్కరిస్తామన్న బీఆర్ఎస్ పార్టీకే మాల సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మాలలు అందరూ కారు గుర్తుకే ఓటు వేయాలంటూ తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ తీర్మానం చేసి బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. అయితే మాలలకు దళిత బంధు విషయంలో, విదేశీ విద్యా పథకం విషయంలో అన్యాయం జరిగిందని మాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ సమావేశాన్ని అడ్డుకున్నారు. సమావేశం కొద్దిసేపు రసాభాసగా మారింది. రెండు వర్గాల జేఏసీ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమావేశంలో కన్వీనర్ నల్లాల కనకరాజు, వర్కింగ్ చైర్మన్ తాళ్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు .



జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



పరకాల ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

దర్జాగా బతుకుతున్నం.. మళ్లీ దగా పడదమా?

సాక్షి ప్రతినిధి, వరంగల్/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నం. కొత్తకుండలో ఈగ జొచ్చినట్లు ఒక్కటొక్కటిగా సర్దుకుని దగాపడ్డ రాష్ట్రంలో దర్జాగా బతికే స్థాయికి చేరుకున్నం.. ఆనాడు తలసరి ఆదాయంలో 19, 20వ స్థానం.. ఇప్పుడు దేశంలోనే నంబర్‌వన్.. మల్ల ఎలక్షన్లు వచ్చినయ్ కాంగ్రెసోళ్లు ఏదేదో చెబుతున్నరు.. వాళ్ల వీళ్ల మాటలు నమ్మి ఆగమై పోదమా, ఈ అభివృద్ధిని ఇలాగే కొనసాగించుకుందమా? కాంగ్రెస్ దోఖేబాజ్ పార్టీ. బీజేపీది మతపిచ్చి. ఈ రెండు పార్టీలను ప్రజలు నమ్మొద్దు. ఆలోచించి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి..'అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల, కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంటలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

అప్పటి, ఇప్పటి అభివృద్ధిని బేరీజు వేసుకోండి

'తెలంగాణలో 58 ఏళ్ల గోసకు ఈనాడు హామీల వర్షం కురిపిస్తున్న కాంగ్రెస్ పార్టీయే కారణం. ఉన్న తెలంగాణను ఆంధ్రల కలిపి, ఉద్యమకారులను కాల్చి చంపి, 58 ఏళ్లు తెలంగాణ ప్రజలను గోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది. ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన నిరంతర ఉద్యమంలో భాగంగా 1969లో 400 మంది, మలివిడతలో 1,200 మంది బలిదానాల ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది. ఇలాంటి నేపథ్యంలో సబ్బండ వర్గాల ఉద్యమ ఉధృతిని చూడటం, 33 రాష్ట్రాల మద్దతు కూడగట్టుకోవడం వల్ల ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను 50 ఏళ్లు ఏలిన కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలి. అప్పట్లో టీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం. అలాంటి పార్టీ ప్రజల బాగు కోరుతుందే తప్ప మరొకటి లేదు. ఎవరో చెప్పారని ప్రలోభాలకు లోనుకావొద్దు. రాష్ట్ర అవతరణ నాటికి, ఇప్పటికీ రాష్ట్రంలో మారిన ప్రజల ఆర్థిక, సామాజిక, వ్యవసాయ స్థితిగతులు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను గుర్తు చేసుకోండి. భూ సమస్యలు లేకుండా, దళారీ.. పైరవీల వ్యవస్థ లేకుండా పారదర్శకత కోసం ధరణి చేపట్టాం..'అని కేసీఆర్ తెలిపారు.

భూ మాత పాత పథకమే..

'కాంగ్రెస్ నేతలు ధరణిని వక్రీకరిస్తున్నారు. అధికారంలోకి వస్తే బంగాళాఖాతంలో వేస్తాం అంటున్నారు. ధరణి స్థానంలో తెస్తామని చెబుతున్న భూమాత పోర్టల్ కొత్తదేం కాదు. 30, 40 ఏళ్ల కింద పథకం. దానితో ఒరేగేదేమీ లేదు. కేసీఆర్‌కు పనిలేదని, రైతుబంధు ఉత్తదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంటు చాలన్నడు. 30 లక్షల మోటార్లను 10 హెచ్‌పీకి పెంచాలా? వారి మాటలకు నెత్తా కత్తా (నెత్తి కాదు.. కత్తి కాదు)? ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారు. ఎవరిని బంగాళాఖాతంలో వేయాలో మీరే చెప్పండి..'అని కేసీఆర్ అన్నారు.

మతం పంచాయితీలు పెట్టే పార్టీ బీజేపీ

'ఇక తెల్లారి లేస్తే ప్రజల మధ్య మతం పంచాయితీలు పెట్టే పార్టీ బీజేపీ. తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల ఇవ్వని పార్టీ. మోటార్లకు మీటర్లు పెట్టలేదన్న అక్కసుతో తెలంగాణకు రూ.25 వేల కోట్లు కోత పెట్టింది. మెడికల్ కాలేజీల విషయంలో తెలంగాణకు మొండిచేయి చూపింది. నేను 100 లెటర్లు రాసినా పట్టించుకోలేదు. చట్ట ప్రకారం జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఉండాలి. కానీ బీజేపీ సర్కారు చట్టాల్ని భేఖాతరు చేస్తూ రాష్ట్రానికి ఒక్క నవోదయను కూడా మంజూరు చేయలేదు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన, గత పదేళ్లలో కేంద్రంలో బీజేపీ పాలన, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన చూడాలి. పాలిచ్చే బర్రెను అమ్మి దున్నపోతును తెచ్చుకుంటే మెడకు తుంట కట్టుకున్నట్టు అవుతుంది. పొరపాటున కాంగ్రెస్ చేతికి అధికారమిస్తే వైకుంఠంలో పెద్దపాము మింగిన తరహాలో మళ్లీ గోసపడతాం, వెనక్కిపోతాం. బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయొద్దు. ఓటు మీ చేతిలో పాశుపతాస్త్రం.. ఆ ఓట్లతో గెలిచిన చిత్తశుద్ధి గల నాయకులతోనే అభివృద్ధి సాధ్యం. కాబట్టి ఆలోచించి ఓటు వేయాలి. బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి..'అని ముఖ్యమంత్రి కోరారు.

కరీంనగర్ సభలో భావోద్వేగం

'రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ఇంటింటికీ 24 గంటల పాటు తాగునీటిని అందజేస్తాం. 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తిని 4 కోట్లకు పెంచేందుకు సంసిద్ధమయ్యాం. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో నిరుద్యోగులకు ఉపాధి పెంచుతాం. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో మాట్లాడి పరకాలలో కోర్టును ఏర్పాటు చేస్తా. కొండగట్టును రూ.1,000 కోట్లతో అభివృద్ధి చేసుకుందాం. గర్షకుర్తి, గోపాల్‌రావుపేటలను మండలాలుగా చేస్తా. ఉప్పల్, వావిలాల, చల్లూరులను కూడా మండలాలుగా చేస్తా..'అని కేసీఆర్ హామీ ఇచ్చారు. కరీంనగర్ ఎస్సారార్ కాలేజీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ కాస్త భావోద్వేగానికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఎస్సారార్ కాలేజీలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకున్నారు. గతంలో ఒకసారి (హుజూరాబాద్ ఉప ఎన్నిక విషయంలో) తనను బాధ పెట్టారని, ఈసారి ఆ పని చేయకండని అన్నారు. ఈ సభల్లో మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, ఎంపీ పసునూరి దయాకర్, నేతలు, అభ్యర్థులు చల్లా ధర్మారెడ్డి, మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, సుంకె రవిశంకర్, కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ గొంతు నొక్కుడే వారి ఎజెండా

- అందరూ కలిసే రాష్ట్రానికి వస్తున్నారు
- కేసీఆర్ సింగిల్‌గా వస్తున్నారు
- మేం మిమ్మల్నే నమ్ముకున్నాం
- మంచిర్యాల రోడ్ షో, జన్నారం సభలో కేటీఆర్



మంచిర్యాల రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'ఢిల్లీ నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు మోదీ, రాహుల్, ప్రియాంక, ఖర్గే లాంటి వారెందరో తెలంగాణకు వస్తున్నారు. వాళ్ల ఎజెండా ఒక్కటే. కేసీఆర్ గొంతు నొక్కాలనే. కేసీఆర్ మాత్రం సింగిల్‌గా వస్తున్నారు. మేంమిమ్మల్నే నమ్ముకున్నాం..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఇంటి పార్టీ అని, ఢిల్లీ పార్టీలు అవసరం లేదని చెప్పారు. మన జుట్టు ఢిల్లీ చేతిలో పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో, ఖానాపూర్ నియోజకవర్గం జన్నారంలో ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు.

ఏ పార్టీకైనా రైతుబంధు ఆలోచన వచ్చిందా?

'రాష్ట్రం వచ్చాక తాగు, సాగునీరు, 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నాం. దేశంలో ఏ పార్టీకైనా రైతుబంధు ఇవ్వాలనే ఆలోచన వచ్చిందా? రూ.200 పింఛన్‌ను రూ.2 వేలకు పెంచాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఇస్తున్నాం. గతంలో సర్కారు దవాఖానకు వెళ్లాలంటే భయపడేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. 15 లక్ష ల మందికి కేసీఆర్ కిట్లు ఇచ్చాం. సింగరేణిలో కార్మికుల వాటా పెంచాం..'అని కేటీఆర్ తెలిపారు.

మోదీ పచ్చి మోసకారి: 'బీజేపీ వాళ్లు అల్లం, బెల్లం చేస్తాం అన్నారు. పీఎం నరేంద్ర మోదీ జన్‌ధన్ ఖాతాల్లో పంద్రాలాఖ్ (రూ.15 లక్షలు) వేస్తా అన్నారు. మోదీ పచ్చి మోసకారి. మతతత్వ మంటలు పెట్టే పార్టీ బీజేపీని ఎట్టి పరిస్థితిల్లోనూ నమ్మి మోసపోవద్దు. కాంగ్రెస్‌కు ఇప్పటికే 11 సార్లు చాన్స్‌లు ఇచ్చాం. ఇంకా ఎందుకు అవకాశం ఇవ్వాలి?..'అని ప్రశ్నించారు.

కోడళ్లకు రూ.3 వేలు ఇస్తాం: 'బీఆర్ఎస్ ప్రభుత్వంపై కోడళ్లు కొంత కోపంగా ఉన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తే 18 ఏళ్లు నిండిన రేషన్ కార్డులు ఉన్న వారందరికీ సౌభాగ్యలక్ష్మి కింద రూ.3 వేలు ఇస్తాం. అత్తలకు ఆసరా పింఛన్లు క్రమంగా రూ.5 వేలకు పెంచుతాం' అని హామీ ఇచ్చారు.

ఆలోచించి ఓటు వేయకపోతే ఆగమై పోతాం

'స్కాంలు కావాలంటే కాంగ్రెస్‌కు, స్కీంలు కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలి. మంచిర్యాలలో పేకాట క్లబ్‌లు కావాలో, ఐటీ హబ్‌లు కావాలో తేల్చుకోండి. ఆలోచించి ఓటు వేయకపోతే ఆగమైపోతాం. బోగస్ సర్వేలు నమ్మొద్దు. కారు గుర్తుకే ఓటెయ్యాలి..'అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు, ఖానాపూర్ అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసారి పర్యాటక మంత్రిగా ఉంటా

- అవసరమైతే కేసీఆర్‌ను బతిమాలుకుంటా
- బీఎన్ఐ సదస్సులో మంత్రి కేటీఆర్
- కొత్త రిజర్వాయర్ల పరిసరాల్లో ఎన్నో ఉపాధి అవకాశాలు
- తెలంగాణ '3.ఓ వర్షన్' డెవలప్‌మెంట్‌కు ఐకాన్‌గా నిలుస్తుంది



బీఎన్ఐ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈసారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తెలంగాణలో సామాజిక మౌలిక సదుపాయాలపై దృష్టి పెడతామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. ముఖ్యంగా పర్యాటక శాఖకు పెద్దపీట వేయాలనుకుంటున్నామన్నారు. సీఎం కేసీఆర్ అవకాశం ఇస్తే, లేనిపక్షంలో ఆయన్ని బతిమాలుకునైనా.. వచ్చే ఐదేళ్లు తా ను పర్యాటక మంత్రిగా ఉంటానని అన్నా రు. తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా కొత్త రిజర్వాయర్లు కనిస్తుండటం, వాటి పరిసరాల్లో చాలా ఉపాధి అవకాశాలుండటమే ఇందుకు కారణమని తెలిపారు. శుక్రవారం ఐటీసీ కాకతీయలో బిజినెస్ నెట్‌వర్క్ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఇప్పటివరకు అభివృద్ధి ట్రైలరే..

'తెలంగాణలో మెడికల్, ఆధ్యాత్మిక టూరిజం, అడ్వెంచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం వంటి వాటిల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ నిధులు అవసరం లేకుండానే పీపీపీ పద్ధతిలో మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. 24 గంటల విద్యుత్ అందుబాటులో ఉన్న దృష్ట్యా తెలంగాణకు చెందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ రంగంలో ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టాలి. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఇప్ప టివరకు మేము చూపించింది కేవలం ట్రైలర్ మాత్రమే. ముందు అభివృద్ధి రుచి అందరికీ చూపిస్తాం. హైదరాబాద్‌ను థియేటర్ డిస్ట్రిక్ట్‌గా చేస్తాం. సాఫ్ట్‌వేర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చెందుతున్నట్టే, మా అభివృద్ధి వెర్షన్ కూడా అప్‌డేట్‌తో సిద్ధంగా ఉంది. తెలంగాణ '3.ఓ వర్షన్'డెవలప్‌మెంట్‌కు ఐకాన్‌గా నిలుస్తుంది..'అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఆరున్నరేళ్లలో ఐదు విప్లవాలు

'రాబోయే ఐదేళ్లలో ప్రధానంగా ఐదు రంగాల్లో అనూహ్యమైన ప్రగతిని సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. పర్యాటక, క్రీడా, విద్య–నైపుణ్యం, వైద్యారోగ్యం, ఐటీ వంటి విభాగాలు ప్రాధాన్యతలో ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధి దేశ, విదేశాల్లో ఉన్న వారికి, సెలబ్రిటీలకు అర్థమవుతుంటే.. స్థానిక ప్రతిపక్ష నేతలకు అర్థం కావడం లేదు. తెలంగాణ సాధించిన తర్వాత కరోనా మినహా మాకు దొరికిన ఆరున్నరేళ్లలో 5 విప్లవాలను సాధించాం. మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యంతో గ్రీన్ రెవెల్యూషన్ సాధ్యమైంది. ఫిషరీస్‌కు తెలంగాణ అడ్డాగా మారింది. 46 వేల చెరువులు, నీటి వసతుల ద్వారా టన్నుల కొద్దీ చేపలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగింది. తద్వారా నీలి విప్లవం సాధించాం. ఒక్క సిరిసిల్లలోనే ఆక్వా హబ్‌లో సుమారు 5 వేల ఉద్యోగాలు సృష్టించబోతున్నాం. మాంసం ఉత్పత్తిలో దేశంలోనే ఉత్తమ స్థానంలో ఉన్నాం. తద్వారా పింక్ రివెల్యూషన్ సాధ్యమైంది. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల ద్వారా వైట్ రెవెల్యూషన్ సాధ్యమైంది. తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో పా మాయిల్ పండిస్తున్నాం. తద్వారా ఎల్లో రెవెల్యూషన్ కూడా సాధ్యమైంది..'అని వివరించారు.

కేటగిరీల వారీగా అందరికీ ప్రోత్సాహం

'పారిశ్రామిక రంగంలో దూసుకెళ్లేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. కొత్తగా వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తెలంగాణ అడ్డాగా మారనుంది. మన దగ్గర విశేష సేవలందిస్తున్న టీహబ్, వీహబ్, టీవర్క్స్, టాస్క్, టీఎస్ఐసీ, రీచ్ వంటి వ్యవస్థల ద్వారా ఎంతోమందిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాం. దళితులు, మహిళలు, దివ్యాంగులు, పేదవారు ఇలా కేటగిరీల వారీగా అందరినీ ప్రోత్సహిస్తున్నాం. రుణాల గురించి ఆలోచించకుండా ధైర్యంగా దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి..'అని కేటీఆర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహావీర్ సాండ్ రూమ్ ఫౌండర్ జలీల్ సబీర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా, బీఎన్ఐ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేత

- ఇతర పార్టీలను అవమానించారని హైకోర్టును ఆశ్రయించిన ఎన్ఎస్‌యూఐ

సాక్షి, హైదరాబాద్: బాన్సువాడ ప్రజాఆశీర్వాదసభలో సీఎం కేసీఆర్ ఇతర పార్టీలను అవమానించేవిధంగా వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీచేయాలని కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 3న తాము రాతపూర్వక వినతి పత్రం సమర్పించినా ఈసీ స్పందించలేదని, దీంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఈసీ విడుదల చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు, ఇతర సూచనలకు కేసీఆర్ వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయని, ప్రజాప్రతినిధ్య చట్టం–1951ను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల తర్వాత కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయని, చట్టప్రకారం కేసీఆర్‌పై చర్యలు తీసుకునేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 3న ఈసీకి ఫిర్యాదు చేసిన పిటిషనర్ నిర్ణయం తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా కోర్టును ఆశ్రయించడం సరికాదంది. పిటిషన్‌ను కొట్టివేసింది.



గజ్వేల్ నియోజకవర్గం జగదేవ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్‌ది 420 మేనిఫెస్టో

- మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- కర్ణాటకలో ఇచ్చిన హామీలకే దిక్కులేదు
- ప్రజలు కొడతారన్న భయంతో 24 గంటల కరెంట్‌ను చేర్చారు
- ఈటల విమర్శలపై ఆగ్రహం
- గజ్వేల్ నియోజకవర్గంలో రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలు

గజ్వేల్/ సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ 420 మేనిఫెస్టోతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ రోడ్ షోలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2009లో కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుతం కొన్ని బీఆర్ఎస్ పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టోలో చేర్చారని చెప్పారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలకే దిక్కులేదని, వాటిని తెలంగాణలో అమలుచేస్తారంటే ప్రజలు నమ్మేస్థితిలో లేరని అభిప్రాయపడ్డారు. ప్రజలు కొడతారని భయపడి మేనిఫెస్టోలో 24 గంటల కరెంట్‌ను చేర్చారని ఎద్దేవా చేశారు. పార్టీ మారగానే బీజేపీ నేత ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుల తెలంగాణగా మార్చారని అంటున్న ఈటల.. ఆనాడు రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా ఉండి సంతకం చేస్తేనే కదా అప్పులు వచ్చింది అంటూ మండిపడ్డారు. గజ్వేల్ కోసం ఈటల ఏం చేశారో ఒక్కసారి చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనాతో ప్రజలు అల్లాడుతుంటే ఒక్కనాడన్నా వచ్చి వారి ఇబ్బందులు తెలుసుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలిచే దాకా ఒక్క చాన్స్ ప్లీజ్..

ఆ తర్వాత ఎక్స్‌క్యూజ్‌మీ అంటారు

ఆరు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతోందని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ అమర వీరులను కించపరిచేలా ఆ పార్టీ నాయకుడు చిదంబరం మాట్లాడటం దారుణమన్నారు. పూర్తిగా విఫలమైన కర్ణాటక లాంటి కాంగ్రెస్ పాలన కావాలో, అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ వైఖరి ఎన్నికలప్పుడు ఓడ మల్లన్న, ఆ తర్వాత బోడ మల్లన్న మాదిరి ఉంటుందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఉపకార వేతనాలివ్వడం లేదని, కొత్త ఉద్యోగాలు లేవని అన్నారు. అభివృద్ధికి నిధులివ్వని కాంగ్రెస్ సర్కార్ తీరుపై కర్ణాటకలో ఎమ్మెల్యేలే వీధులకెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. అక్కడ 6 నెలల పాలనలోనే 357 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. వెలుగుల దీపావళి కావాలా? కర్ణాటక లాంటి చీకటి కావాలో.. తెలంగాణ ప్రజలు తేల్చుకోవాలన్నారు. గెలిచే దాకా ఒక్క చాన్స్ ప్లీజ్ అంటారు, ఆ తర్వాత ఎక్స్‌క్యూజ్‌మీ ప్లీజ్ అంటారు. ఒక్క చాన్స్ అంటున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

శ్రీనివాస్‌గౌడ్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్లో పలు అంశాలు పేర్కొనలేదని, ఆయన నామినేషన్‌ను తిరస్కరించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మహబూబ్‌నగర్‌కు చెందిన చలువగాలి రాఘవేంద్రరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టులో శ్రీనివాస్‌గౌడ్‌పై ఉన్న సివిల్ అప్పీల్‌ను అఫిడవిట్‌లో వెల్లడించలేదని, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బాండ్ పేపర్ కొనుగోలు చేసి వివరాలు సమర్పించారని రాఘవేంద్రరాజు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వీటితోపాటు హైకోర్టులో జడ్జి కమిషన్ ముందు తన భార్య సివిల్ కాంట్రాక్టర్ అని చెప్పిన శ్రీనివాస్‌గౌడ్ ప్రస్తుత అఫిడవిట్‌లో ఆ విషయాన్ని కూడా వెల్లడించలేదని, ఇక గోపనపల్లిలోని కమర్షియల్ కాంప్లెక్స్‌పై కిరాయి వస్తుందని పేర్కొన్న మంత్రి మున్సిపల్ పన్నును మాత్రం కట్టడంలేదని పిటిషన్‌లో తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్‌ను తిరస్కరించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ...ఈ అంశాలపై ఫిర్యాదు చేస్తూ ఈసీకి పిటిషనర్ వినతిపత్రం సమర్పించారని, దీనికి కమిషన్ కూడా బదులిస్తూ ఈ నెల 13న వివరాలు అందజేసిందన్నారు. ఈ క్రమంలో పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అవకాశం ఇవ్వాలని రాఘవేంద్రరాజు తరఫు న్యాయవాది కోరగా...అందుకు అవకాశం ఇస్తూ ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది.

'డబుల్' ఇళ్ల పేరిట మోసం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం పేదలకు అందించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తూ గుర్తు తెలియని కొందరు వ్యక్తులు అమాయకులను మోసం చేస్తున్నారని జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హౌసింగ్ డివిజన్–2 పి.వి.రవీందర్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం కేటాయించింది. అయితే కొందరు తమకు కూడా కేటాయింపులు జరిగాయటూ సంబంధింత సర్టిఫికెట్లతో అధికారులను ఆశ్రయించారు. ఆ సర్టిఫికెట్లను పరిశీలించగా నకిలీవని తేలాయి. ఈ సర్టిఫికెట్లు రెండేళ్ల క్రితం జారీ అయినట్లు ఉన్నాయి. దీనిపై మారోజు నవీన్‌కుమార్ అనే బాధితుడికి ఎక్కడి నుంచి ఈ సర్టిఫికెట్లు సంపాదించారని అధికారులు ప్రశ్నించగా అతడు సరైన సమాధానం చెప్పడం లేదు. అలాగే షేక్ సల్మా అనే మహిళను ప్రశ్నించగా 2020లో తాను రూ.2 లక్షలు రెండు వాయిదాలలో చెల్లించానని, తనకు జీబా రహమాన్ అలియాస్ ముంతాజ్ అనే మహిళ సునంద అనే మరో మహిళను పరిచయం చేసిందని, ఆమె ద్వారా సర్టిఫికెట్ పొందినట్లు తెలిపింది.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టు న్యూస్‌లెటర్ ప్రారంభం

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం నెలవారీ న్యూస్‌లెటర్‌ను శుక్రవారం ప్రారంభించింది. సుప్రీంకోర్టు ప్రస్తుత కార్యకలాపాలు, పురోగతితోపాటు పనితీరుపై సమీక్ష ఇందులో ఉంటాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మొదటి న్యూస్‌లెటర్‌ను ప్రారంభించారు. న్యాయస్థానం చరిత్ర, కీలక తీర్పులపై సమీక్ష, గొప్ప వ్యక్తుల కృషిని తెలిపే కథనాలు ఇందులో ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సుప్రీంకోర్టులో కార్యకలాపాలు, పనితీరుపై అవగాహనకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కోర్టు తీరును మెరుగుపరచడానికి సాగుతున్న నిరంతర ప్రయత్నాలను ఇది పాఠకులకు తెలియజేయడంలో సహాయ పడుతుందని ఆయన చెప్పారు. న్యూస్‌లెటర్ ప్రచురణలో కీలక సేవలందించిన సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్, జడ్జిల లైబ్రరీ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థానిక కోటా చెల్లదు: హైకోర్టు

చండీగఢ్: హరియాణా ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలంటూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని శుక్రవారం పంజాబ్ చండీగఢ్ హైకోర్టు కొట్టివేసింది. 'హరియాణా స్టేట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ లోక్ క్యాండిడేట్స్ యాక్ట్, 2020 రాజ్యాంగవిరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,19లకు వ్యతిరేకం. అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇది చెల్లుబాటుకాదు' అని జస్టిస్ జీఎస్ సంధావలియా, జస్టిస్ హర్‌ప్రీత్ కౌర్ జీవన్‌ల ధర్మాసనం పేర్కొన్నట్లు పిటిషనర్ల తరఫు న్యాయవాది అక్షయ్ భాన్ చెప్పారు. హరియాణా ప్రభుత్వం చేసిన చట్టం 2022 జనవరి 15 నుంచి అమలవుతోంది. పది మంది లేదా అంతకంటే సిబ్బంది పనిచేసే ప్రైవేట్ సంస్థలకు ఇది వర్తిస్తుంది. నెలకు గరిష్టంగా రూ.30 వేల వేతనం పొందే ఉద్యోగాలకు దీనిని వర్తింపజేసింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ పలు పారిశ్రామిక సంఘాలతోపాటు ఫరీదాబాద్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్లు వేశాయి.

శబరిమలలో మండల పూజలు ప్రారంభం

శబరిమల: 'స్వామియే శరణం అయ్యప్ప..'అనే శరణుఘోషల నడుమ కేరళలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపు లు తెరుచుకున్నాయి. మలయాళ మాసం వృశ్చికం మొదటి రోజైన శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ప్రధాన ద్వారాలను వార్షిక పూజల కోసం తెరిచారు. అప్పటికే సన్నిధానం వద్ద వేలాదిగా భక్తులు క్యూల్లో ఎదురు చూస్తున్నారు. రెండు నెలలపా టు కొనసాగే మండల-మకరవిలక్కు పూజల కోసం కేరళ నుంచే కాకుండా ఇతర దక్షిణాది రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి ముడుపులు సమర్పించుకుంటారు. ఆలయ ప్రధాన పూజారి మహేశ్ మోహనారు గురువారం సాయంత్రమే గర్భగుడిలో పూజలు చేశారు.

ఫిలిప్పీన్స్‌లో తీవ్ర భూకంపం

మనీలా: ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతాన్ని శుక్రవారం తీవ్ర భూకంపం కుదిపేసింది. దీని తీవ్రతకు షాపింగ్ మాల్స్‌లో పైకప్పులు విరిగిపడ్డాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.7గా నమోదైంది. దేశ దక్షిణ కొసనున్న బురియాస్‌కు 26 కిలోమీటర్ల దూరంలో, భూమికి 78 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. రెండు షాపింగ్ మాల్స్ పిల్లర్లు కదులుతుండటం, వాటి పైకప్పులు ఊడిపడుతుండటం, జనం కేకలు పెడుతూ పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఈ ఘటనల్లో ఎవరికీ గాయాలు కాలేదని సమాచారం.

కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అశోక

బెంగళూరు: కర్ణాటక బీజేపీ శాసనసభా పక్షం ఎమ్మెల్యేలు శుక్రవారం సమావేశమై అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఆర్.అశోక(59)ను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్, రాష్ట్ర బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర, మాజీ సీఎంలు యడియూరప్ప, బస్వరాజ్ బొమ్మై తదితరులు హాజరయ్యారు. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన అశోక మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా చేశారు. కర్ణాటక రాజకీయాల్లో ఆధిపత్యం వహిస్తున్న వొక్కలిగ వర్గం నేతగా ఆయనకు పేరుంది. మేలో జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా 135 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ అధికారం చేపట్టగా, బీజేపీకి 66, జేడీఎస్‌కు 19 స్థానాలు దక్కిన విషయం తెలిసిందే.

విద్యుత్ చౌర్యం కేసు.. మాజీ సీఎంకు జరిమానా

బెంగళూరు: దీపావళి పండుగ సందర్భంగా బెంగళూరులోని తన నివాసానికి విద్యుత్ దీపాలంకరణ కోసం కరెంటు వాడుకున్నందుకు గాను రూ.68,526 చెల్లించినట్లు మాజీ సీఎం కుమారస్వామి చెప్పారు. ఇంతమొత్తం జరిమానా విధించడం అన్యాయమని ఆరోపించారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందునే ఈవిధంగా వేధిస్తున్నారని చెప్పారు. ఎలాంటి తప్పు చేయలేదని తెలిపారు.

అల్-షిఫాలో మృత్యుఘోష

బయట నుంచి ఆహారం, నీరు, ఔషధాలు, ఇంధన సరఫరా బంద్

ఆసుపత్రి ఐసీయూలో నిలిచిపోయిన చికిత్సలు


అల్ షిఫా ఆస్పత్రి ఐసీయూ వార్డు (ఫైల్ ఫొటో)

- ఒక్కరోజులో 22 మంది రోగులు బలి
- జబాలియా క్యాంపుపై ఇజ్రాయెల్ దాడిలో 18 మంది పాలస్తీనియన్లు మృతి
- మరో బందీని హత్య చేసిన హమాస్ మిలిటెంట్లు

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: గాజా స్ట్రిప్‌లో అతి పెద్దదైన అల్-షిఫా ఆసుపత్రిలో మరణ మృదంగం మోగుతోంది. పెద్ద సంఖ్యలో రోగులు కన్నుమూస్తున్నారు. రోగులు, క్షతగాత్రులతోపాటు 7,000 మందికిపైగా సామాన్య పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న ఈ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ సైన్యం గురిపెట్టింది. హమాస్ కమాండ్ సెంటర్ ఇక్కడ ఉందన్న వాదనతో ఆసుపత్రిని పూర్తిగా దిగ్బంధించింది. నిత్యం తనిఖీలు చేస్తోంది. బయట నుంచి ఆహారం, నీరు, ఔషధాలు, వైద్య పరికరాలు, ఇంధనం, విద్యుత్ సరఫరా కాకుండా నిలిపివేసింది. గత ఐదారు రోజులుగా ఇక్కడ చికిత్సలు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ఐసీయూలోని రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గురువారం రాత్రి నుంచి 22 మంది మరణించారని అల్-షిఫా డైరెక్టర్ మొహమ్మద్ అబూ సాల్మియా చెప్పారు. గత మూడు రోజుల వ్యవధిలో ఇక్కడి 50 మందికిపైగా రోగులు మరణించినట్లు సమాచారం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. హమాస్ స్థావరాలనే కాదు, శరణార్థి శిబిరాలను కూడా ఇజ్రాయెల్ సైన్యం ఉపేక్షించడం లేదు. తాజాగా జబాలియా క్యాంపుపై జరిగిన వైమానిక దాడిలో ఏకంగా 18 మంది పాలస్తీనా శరణార్థులు మరణించారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరం సమీపంలో ఓ ఆసుపత్రిపై జరిగిన దాడిలో 14 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు ఎంతమంది మృత్యువాత పడ్డారన్నది తెలియరావడం లేదు. గత కొన్ని రోజులుగా మృతుల, క్షతగాత్రుల గణాంకాలను గాజా ఆరోగ్య శాఖ విడుదల చేయడం లేదు. ఇజ్రాయెల్ దాడుల వల్ల ప్రభుత్వ అధికార వ్యవస్థ పూర్తిగా కుప్పకూలమే ఇందుకు కారణం.

బందీలను హత్య చేస్తున్న హమాస్!

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు 240 మందిని బందీలుగా పట్టుకొని గాజాకు తరలించారు. ఇప్పటిదాకా నలుగురు బందీలను విడుదల చేశారు. గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు ఉధృతం చేయడంతో ప్రతిస్పందనగా బందీలను మిలిటెంట్లు హత్య చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ వద్ద బందీగా ఉన్న 19 ఏళ్ల నోవా మర్సియానో అనే ఇజ్రాయెల్ మహిళా జవానును ఇప్పటికే హత్య చేశారు. ఆమె మృతదేహం అల్-షిఫా వద్ద లభ్యమైంది. అలాగే 65 ఏళ్ల మరో మహిళా బందీ సైతం హత్యకు గురైంది. ఆమె మృతదేహాన్ని అల్-షిఫా వద్ద గుర్తించామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఆగని దాడులు.. అందని సాయం

గాజాపై ఇజ్రాయెల్ సేనలు భీకరస్థాయిలో విరుచుకుపడుతుండడంతో పాలస్తీనియన్లకు మానవతా సాయం అందడం లేదు. దాడులకు విరామం ఇస్తున్నట్లు ఇజ్రాయెల్ చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఆహారం, ఔషధాలు, నిత్యావసరాను గాజాకు చేరవేయలేకపోతున్నామని సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి నిస్సహాయత వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి మారకపోతే త్వరలోనే ఆకలి చావులు ప్రారంభం కావడం తథ్యమని తేల్చిచెప్పింది. మరోవైపు గాజాలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఊహించినదాని కంటే వేగంగా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, సాధారణ జనావాసాలతోపాటు ఆసుపత్రుల్లోనూ జనం రోగాల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకున్నాయి. ఇతర దేశాల నుంచి ఇంధనం వచ్చే అవకాశం కనిపించడం లేదు. దాంతో జనరేటర్లు పనిచేయడం లేదు. విద్యుత్ లేక మొబైల్ ఫోన్ల సేవలు సైతం నిలిచిపోయాయి. గాజాలో పరిస్థితి నానాటికీ దిగజారుతోంది.

గాజాను ఆక్రమించొద్దు: బ్లింకెన్

హమాస్‌పై యుద్ధం ముగిసిన తర్వాత గాజా పరిస్థితి ఏమిటి అన్నదానిపై చర్చ ప్రారంభమైంది. గాజాను ఇజ్రాయెల్ ఆక్రమించుకొని, అక్కడ తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గాజాను మళ్లీ ఆక్రమించుకోవాలన్న ఆలోచన చేయవద్దని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మరోసారి ఇజ్రాయెల్‌కు సూచించారు.

ఆఖరి గౌరవానికీ దూరం

ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడులతో దద్దరిల్లుతున్న గాజాలో మెజార్టీ ప్రజలు ముస్లిం మతస్తులే. దాడుల్లో నిత్యం పదుల సంఖ్యలో జనం మరణిస్తున్నారు. భవనాలు నేటమట్టమవుతున్నాయి. కాంక్రీట్ దిబ్బలుగా మారుతున్నాయి. చాలామంది వాటికింద చిక్కుకొని తుదిశ్వాస విడుస్తున్నారు. గాజాలో చాలా ప్రాంతాలు శ్మశానాలను తలపిస్తున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మొదలై 5 వారాలు దాటింది. గాజాలో ఇప్పటివరకు 1,500 మంది చిన్నారులు సహా 2,700 మంది కనిపించకుండాపోయారు. వారంతా శిథిలాల కింద విగతజీవులైనట్లు తెలుస్తోంది. ఇస్లాం మత సంప్రదాయం ప్రకారం.. మృతులకు సాధ్యమైనంత త్వరగా అంత్యక్రియలు పూర్తి చేయాలి. మృతదేహాలను సబ్బుతో శుభ్రం చేసి, కొత్త వస్త్రాలు చుట్టి, పన్నీరు చల్లి 24 గంటల్లోగా ఖననం చేయాల్సి ఉంటుంది. గాజాలో వేలాది మంది ఈ ఆఖరి గౌరవానికి నోచుకోవడం లేదు. బయటకు తీసేవారు లేక శిథిలాల కింద శవాలు కుళ్లిపోతున్నాయి. గుర్తుపట్టలేని విధంగా మారిపోతున్నాయి కరెంటు, డీజిల్, పెట్రోల్ లేకపోవడంతో గాజాలో సహాయక చర్యలు ఎప్పుడో నిలిచిపోయాయి. భవనాల శిథిలాలను తొలగించేవారే లేరు. కనిపించకుండాపోయిన తమ బిడ్డల కోసం, తల్లిదండ్రుల కోసం జనం గాలిస్తున్నారు. శవం కనిపించినా ఎవరిదో గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడింది.


ఇదిగో హమాస్ సొరంగం..



అల్-షిఫా హాస్పిటల్ కింది భాగంలో సొరంగంలో హమాస్ కమాండ్ సెంటర్ ఉందన్న తన వాదనకు బలం చేకూర్చేలా వీడియోను, కొన్ని ఫొటోలను ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం విడుదల చేసింది. ఇందులో గుహ లాంటి ప్రదేశం కనిపిస్తోంది. ఇది నిజంగా హమాస్ సొరంగమేనా? అనేది నిర్ధారించాల్సి ఉంది. అల్-షిఫా హాస్పిటల్‌లో హమాస్ ఆయుధాల వీడియోను ఇజ్రాయెల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

ఎండ దెబ్బకు ఐదు రెట్ల మరణాలు

2050కి ఎండ తీవ్రత పెరుగుతుందన్న లాన్సెట్ నివేదిక



సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా పెరుగుతున్న ఎండల తీవ్రతతో మానవాళికి పెనుముప్పు పొంచి ఉందని లాన్సెట్ నివేదిక వెల్లడించింది. భానుడి ప్రతాపం ఇదే మాదిరి పెరుగుతూ ఉంటే వచ్చే 27 ఏళ్లలో అంటే 2050 నాటికి ఎండల తీవ్రతకు మరణించే వారి సంఖ్య ఐదు రెట్లు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంది. తాజాగా, లాన్సెట్ 'కౌంట్ డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ ఛేంజ్'పై 8వ వార్షిక నివేదిక విడుదల చేసింది. గాలి, నీరు పరివర్తనం వల్ల తలెత్తే ప్రమాదాలపై ప్రధానంగా ఈ నివేదిక దృష్టి సారించింది. ఆయిల్, గ్యాస్ వంటి రంగాలలో పెట్టుబడులు పెట్టవద్దని ప్రభుత్వాలు, కంపెనీలకు సూచించింది. 2022లో దాదాపు 86 రోజుల పాటు తీవ్రమైన వేడిమిని ఎదుర్కోవలసి వచ్చిందని పేర్కొంది. ఇందులో 60 శాతానికిపైగా ఘటనలకు మానవ కార్యకలాపాలే బాధ్యత అని తెలిపింది. జీవ ఇంధనాలపై పెట్టుబడులు పెట్టే వివిధ కంపెనీల తీరును కూడా లాన్సెట్ నివేదికలో ఎండగట్టింది. జల, వాయు సంబంధిత దుష్పరిణామాలను నిలువరించేందుకు ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు సరిపోవని లాన్సెట్ కౌంట్ డౌన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మరీనా రొమానెలో హెచ్చరించారు. ఎండ తీవ్రత వల్ల వ్యవస్థకు కలుగుతున్న నష్టంపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణం దెబ్బతినడం వల్ల నీరు, వ్యవసాయ ఉత్పత్తులపై కూడా ప్రతికూల ప్రభావం పడి, ప్రపంచ వ్యాప్తంగా పోషకాహార లోపం సమస్య తలెత్తే ప్రమాదం ఉందని అంచనా వేశారు. కేవలం ఎండ తీవ్రత కారణంగా 2041-60మధ్య కాలంలో 52.49కోట్ల మంది ఆహార భద్రత ముప్పు ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొన్నారు. 2050 వరకు ప్రాణాంతక వ్యాధుల సంఖ్య పెరగొచ్చని కూడా లాన్సెట్ ఆందోళన వ్యక్తం చేశారు.


రాజస్తాన్‌లో సగ్వారాలోని గాయత్రీ పీఠంలో పూజలు చేస్తున్న ప్రియాంక

బీజేపీకి సీఎం అభ్యర్థే లేరు

కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఎద్దేవా

జైపూర్: రాజస్తాన్‌లో బీజేపీ చెల్లాచెదురయిందని, అందుకే ఆ పార్టీకి సీఎం అభ్యర్థే లేకుండాపోయారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఎద్దేవా చేశారు. దుంగార్‌పూర్ జిల్లా సగ్వారాలో శుక్రవారం ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. బీజేపీకి సీఎం అభ్యర్థి దొరక్క ప్రధాని మోదీ చేసేది లేక తన పేరుతోనే ఓట్లభ్యర్థిస్తున్నారన్నారు. మతం, మనోభావాలను వాడుకుంటూ ఓట్లడిగే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బీజేపీ పాలనలో ద్రవ్యోల్బణం కారణంగా రైతులతోపాటు ప్రజలు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. 'దేశంలో రైతుల సరాసరి ఆదాయం రోజుకు కేవలం రూ.27 మాత్రమే కాగా, ప్రధాని మోదీ ప్రత్యేక మిత్రుడు అదానీ మాత్రం రోజుకు రూ.16 వేల కోట్లు సంపాదిస్తున్నారు. ఆయన రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం వద్ద రైతు రుణాలు రద్దు చేసేందుకు మాత్రం డబ్బుల్లేవు'అని ధ్వజమెత్తారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఈ ప్రభుత్వం వెన్నుచూపుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తే ప్రజల కోసం ద్రవ్యోల్బణ సహాయక శిబిరాలను నిర్వహిస్తుందని ప్రకటించారు. బీజేపీ అధికారంలోకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ కార్యక్రమాలన్నిటినీ నిలిపివేస్తుందని ప్రియాంకా గాంధీ ప్రజలను హెచ్చరించారు.

'బ్లడ్ మనీ' వినతిని పరిశీలించండి

యెమెన్‌లో మరణ శిక్ష పడిన నర్సు తల్లి పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: యెమన్‌లో మరణ శిక్షనెదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిషా ప్రియ కేసులో 'బ్లడ్ మనీ' చెల్లింపు వినతిని పరిశీలించాలని ఢిల్లీ హైకోర్టు గురువారం కేంద్రానికి సూచించింది. యెమన్ చట్టాల ప్రకారం బాధితుల కుటుంబానికి పరిహారంగా దోషులు చెల్లించే మొత్తమే బ్లడ్ మనీ. యజమాని నుంచి ఉన్న పాస్‌పోర్టు చేజిక్కించుకునేందుకు నిమిషా అతడికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చింది. డోసెక్కువై అతడు చనిపోవడంతో కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. బ్లడ్‌మనీ చెల్లించి నిమిషను రక్షించే విషయంలో వారంలోగా నిర్ణయం తెలపాలని కేంద్రాన్ని హైకోర్టు ఆదేశించింది. యెమెన్‌కు భారతీయుల ప్రయాణాలపై నిషేధం అమల్లో ఉన్నందున నిమిష తల్లి అక్కడికి వెళ్లలేకపోయినట్లు ఆమె లాయర్ తెలిపారు.

కృత్రిమ మేధ దుర్వినియోగంతో

పెను సంక్షోభం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన


శుక్రవారం ఢిల్లీ బీజేపీ కార్యాలయంలో దివాళీ మిలన్‌లో మాట్లాడుతున్న మోదీ

- నేను పాట పాడినట్లు ఫేక్ వీడియో సృష్టించారు
- డీప్‌ఫేక్‌లు పెద్ద ప్రమాదానికి కారణమవుతాయి
- బీజేపీ ప్రధాన కార్యాలయంలో దివాళీ మిలన్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగం అవుతుండడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ వీడియోలు, చిత్రాలు సృష్టించడానికి కృత్రిమ మేధను వాడుకుంటున్నారని, ఇదొక పెను సంక్షోభానికి దారి తీస్తోందని హెచ్చరించారు. ఏఐ దుర్వినియోగం, దాని ప్రభావంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని చేయాలని ప్రసార మాధ్యమాలకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 'దివాళీ మిలన్' సందర్భంగా ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. గార్బా వేడుకలో తాను పాట పాడుతున్నట్లు ఇటీవల ఓ ఫేక్ వీడియోను గుర్తు తెలియని వ్యక్తులు సృష్టించారని, ఓ అభిమాని తనకు ఆ వీడియోను పంపించాడని తెలిపారు. నిజానికి పాఠశాల రోజుల నుంచి తాను ఏనాడూ పాట పాడలేదని నవ్వుతూ చెప్పారు. వైవిధ్యంతో కూడిన మన సమాజంలో డీప్‌ఫేక్‌లు పెద్ద ప్రమాదానికి కారణమవుతాయని అన్నారు. ఏఐ పరిజ్ఞానంతో డీప్‌ఫేక్‌ల సృష్టి వల్ల కొత్త సంక్షోభం తెరపైకి వస్తోందని వెల్లడించారు. సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న వీడియోలు నిజమో కాదో తేల్చుకునే వ్యవస్థ ప్రజలందరికీ అందుబాటులో లేదని పేర్కొన్నారు.

'వోకల్ ఫర్ లోకల్'కు ప్రజల మద్దతు

వివాదాస్పద దృశ్యాలు, సంభాషణలు ఉన్న చలనచిత్రాలు గతంలో వస్తే కొద్దిరోజుల్లోనే ఆ రగడ చల్లారేదని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం అలాంటి చిత్రాలను సమాజంలోని కొన్ని వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని, పెద్ద వివాదంగా మారుస్తున్నాయని, భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఆ చిత్రాలు పరాజయం పాలవుతున్నాయని చెప్పారు. సిగరెట్ పెట్టెలపై ఆరోగ్యపరమైన హెచ్చరికలు ఉన్నట్లుగానే డీప్‌ఫేక్ వీడియోలపైనా అలాంటి హెచ్చరికలు ఉంటే బాగుంటుందని మోదీ అభిప్రాయపడ్డారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇది కేవలం నోటిమాట కాదని, క్షేత్రస్థాయిలో జరగబోయే వాస్తవమని స్పష్టం చేశారు. 'వోకల్ ఫర్ లోకల్' ప్రచారానికి జనం సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని వ్యక్తం చేశారు. దీపావళి పండుగ సమయంలో దేశంలో రూ.4.5 లక్షల కోట్ల విలువైన వ్యాపారం జరిగిందని తెలిపారు. కోవిడ్-19 ముప్పు తొలగిపోవడంతో ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్నారని చెప్పారు.

సాధారణ ప్రజల మరణాలను ఖండిస్తున్నాం

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై మోదీ

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో సాధారణ ప్రజలు మరణించడాన్ని భారత్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రపంచానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయని తెలిపారు. ఇలాంటి తరుణంలో ప్రపంచ మానవాళి క్షేమం కోసం గ్లోబల్ సౌత్ దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కేంద్రం వర్చువల్‌గా నిర్వహించిన 'వాయిస్ ఆఫ్ ద గ్లోబల్ సౌత్' రెండో ఎడిషన్ శిఖరాగ్ర సదస్సులో మోదీ మాట్లాడారు. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో సాధారణ ప్రజలు చనిపోతుండడం బాధాకరమని చెప్పారు. చర్చలు, దౌత్య మార్గాల్లో వివాదాలను పరిష్కరించుకోవాలన్నారు. 21వ శతాబ్దంలో మార్పులకు లోనవుతున్న ప్రపంచాన్ని 'వాయిస్ ఆఫ్ ద గ్లోబల్' వేదిక ప్రతిబింబిస్తోందన్నారు. ఐదు 'సీ'లు.. కన్సల్టేషన్, కమ్యూనికేషన్, కో-ఆపరేషన్, క్రియేటివిటీ, కెపాసిటీ బిల్డింగ్ అనే ఫ్రేమ్‌వర్క్ కింద గ్లోబల్ సౌత్ దేశాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఆప్‌ను మీ జన్మలో ఓడించలేరు

మోదీకి కేజ్రీవాల్ సవాలు • తనను అరెస్టు చేసినా ఆప్‌దే గెలుపని ధీమా



న్యూఢిల్లీ: ''మోదీ జీ! ఢిల్లీలో ఆప్‌ను మీ జన్మలో ఓడించలేరు! అందుకు మరో జన్మ ఎత్తాల్సిందే'' అంటూ ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాలు చేశారు. ''నన్ను అరెస్టు చేసినా సరే, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో గెలుపు ఆప్‌దే. ఇక్కడ బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు'' అని జోస్యం చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''ప్రాంతీయ పార్టీల నేతలను ఎలాగైనా అరెస్టు చేసి ఆప్ వాటి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి అడ్డంకులు సృష్టించాలని నరేంద్ర మోదీ సర్కారు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అదే క్రమంలో తన అరెస్టుకు ప్రయత్నిస్తోందన్నారు. కనుక ఒకవేళ అరెస్టయి జైలుకు వెళ్లినా తానే సీఎంగా కొనసాగాలా అని ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడగాల్సిందిగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ కుట్రలను వారికి తెలియజెప్పాలన్నారు. ''సీఎంగిరీ మీద నాకేమీ అపేక్ష లేదు. సీఎం అయిన 49 రోజులకే ఎవరూ అడగకపోయినా రాజీనామా చేసింది ప్రపంచంలో బహుశా నేనొక్కడినే. కానీ అరెస్టయినా నేనే సీఎంగా కొనసాగాలని పార్టీ ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు ముక్త కంఠంతో కోరుతున్నారు'' అని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో పాత్రపై విచారణకు రావాలంటూ కొద్ది రోజుల క్రితం ఈడీ సమన్లివ్వగా ఆయన గైర్హాజరవడం తెలిసిందే.

కశ్మీర్‌లో రెండు ఎన్‌కౌంటర్లు.. ఆరుగురు ముష్కరులు హతం

శ్రీనగర్/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో శుక్రవారం జరిగిన వేర్వేరు ఎదురుకాల్పుల ఘటనల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కుల్గాం జిల్లాలో రాత్రంతా భద్రతా బలగాలతో కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో అయిదుగురు ముష్కరులు హతం కాగా, రాజౌరీ జిల్లాలో మరొకరు మృతి చెందారు. కుల్గాం జిల్లా నెహమా ప్రాంతంలోని సమ్నో గ్రామంలో అనుమానాస్పద కదలికలపై అందిన సమాచారం మేరకు గురువారం బలగాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి సోదాలు చేపట్టాయి. బలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో ఎదురుకాల్పులు మొదలయ్యాయి. బలగాల దిగ్బంధనంలో చిక్కుకున్న ఉగ్రమూకలు రాత్రంతా కాల్పులు కొనసాగించాయి. ఉదయం కూడా కొనసాగిన కాల్పులతో ఉగ్రవాదులు దాక్కున్న ఇంటికి నిప్పంటుకుంది. దీంతో, బయటకు వచ్చిన అయిదుగురూ బలగాల చేతుల్లో హతమయ్యారని కశ్మీర్ ఐజీపీ వీకే బిర్థి చెప్పారు. మొత్తం 18 గంటలపాటు ఎన్‌కౌంటర్ కొనసాగిందన్నారు. మృతులను లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉన్న పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్(పీఏఎఫ్‌ఎఫ్), ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్‌ఎఫ్)లకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. వీరందరికీ వివిధ హింసాత్మక ఘటనలతో సంబంధముందని తెలిపారు. వీరి నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నాలుగు ఏకే రైఫిళ్లు, రెండు పిస్టళ్లు, నాలుగు గ్రెనేడ్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటన.. రాజౌరీ జిల్లా బుధాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెహ్రోటే ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిన బలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. ఎదురుకాల్పుల్లో గుర్తు తెలియని ఒక ముష్కరుడు హతమయ్యాడు. సంఘటనా ప్రాంతంలో ఏకే-47 రైఫిల్, మూడు గ్రెనేడ్లు లభించాయి. ఘటన అనంతరం ఆ ప్రాంతంలో సోదాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.

జంగ్ తెలంగాణ

ఎన్నికల వేడి మాండ్.. ధర ఎక్కువే..



గెలిచామా.. ఓడామా.. కాదు

పోటీ చేశామా లేదా అన్నదే ముఖ్యం

ఇదే రీతిన ఈసారి లెక్కకు మించి అభ్యర్థులు పోటీ

30 నుంచి 40 మంది వరకు పోటీ చేస్తున్న నియోజకవర్గాలు 11

40 మందికిపైగా పోటీ చేస్తున్న నియోజకవర్గాలు రెండు

గాటె దేవేందర్

'ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా... బుల్లెట్ దిగిందా లేదా'.. ఈ పూరీ మార్కు డైలాగ్‌ను ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న చాలామంది..'' గెలిచామా.. ఓడామా.. కాదు పోటీ చేశామా లేదా అన్నదే ముఖ్యం'' అన్న రీతిన మార్చేసి బరిలో సై అంటున్నారు. మునుపెన్నడూ అంతగా లేని విధంగా ఈసారి ఎన్నికల్లో భారీ సంఖ్యలో అభ్యర్థులు బరిలోకి దిగారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచే కాకుండా చిన్నాచితకా పార్టీల నుంచి, ఇండిపెండెంట్లు కలిపి రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకు గాను ఏకంగా 2,290 మంది పోటీలో ఉన్నట్టు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. అంటే సగటున ఒక్కో నియోజకవర్గానికి 20 మంది పోటీ చేస్తున్నారన్న మాట. ఈ పోటీ ఎంత తీవ్రంగా ఉందంటే 65 చాలా నియోజకవర్గాల్లో రెండు లేదా మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి వస్తోంది. నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 16లోపు ఉంటేనే ఒక బ్యాలెట్ యూనిట్ సరిపోతుంది.కానీ, ఈసారి అంతకంటే ఎక్కువ మంది 65 స్థానాల్లో బరిలో ఉండడంతో బ్యాలెట్ యూనిట్లను పెంచాల్సి వస్తోంది.

ఎల్బీనగర్ టాప్

ఇక నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఎక్కువ మంది పోటీ చేస్తున్న జాబితాలో ఎల్బీనగర్ మొదటి స్థానంలో ఉంది. ఇక్కడి నుంచి ఏకంగా 48 మంది అభ్యర్థులు అమీతుమీ తేల్చుకుంటున్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి 44 మంది బరిలో ఉన్నారు. ఇక, ఏడుగురే పోటీలో ఉండి రాష్ట్రంలో అతి తక్కువ మంది పోటీ చేస్తున్న నియోజకవర్గంగా బాన్సువాడ నిలిచింది. పది మంది కంటే తక్కువగా పోటీ చేస్తున్న నియోజకవర్గాలు మొత్తం నాలుగు కాగా, 20నుంచి 30 మంది పోటీ చేస్తున్న నియోజకవర్గాలు 33, 30 మంది కంటే ఎక్కువ మంది పోటీ చేస్తున్న నియోజకవర్గాలు 13 ఉన్నాయి. మొత్తం స్థానాల్లో నామినేషన్ వేసిన 2898 అభ్యర్థులలో 608 మంది విత్‌డ్రా చేసుకున్నట్లుగా ఎన్నికల సంఘం వెల్లడించిన సంగతి తెలిసిందే.

పేరు కోసం ఒకరైతే... పోటీ చేయాలనే తపన మరొకరిది


ఎలాగైనా పోటీ చేయాలని కొందరు అభ్యర్థులు భావిస్తే మరికొందరు పేరు కోసం పోటీ చేసినట్టుగా ఉంది. ఏదో నామినేషన్ వేశామా లేదా అన్నట్లుగా పోటీలో ఉంటున్నారు. ప్రచారం చేయడం కానీ, ఎన్నికల సంఘం కేటాయించిన తన గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లడం కానీ ఇప్పటి వరకైతే చేయడం లేదు. మరో వైపు కొన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతతోనో, అభ్యర్థిపై నిరసనతోనో...లేక ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చలేదనో పోటీకి దిగుతున్నారు.. కొన్నిచోట్ల సొంతపార్టీ నుంచి టికెట్ రాక రెబల్స్‌గా పోటీ చేస్తున్నారు. మరో వైపు అభ్యర్థి ఓట్లను చీల్చాలని మరికొందరు పోటీ చేస్తున్నారన్న వాదనలూ ఉన్నాయి.

ఎక్కువ మంది పోటీ చేస్తున్న నియోజకవర్గాలు ఇలా..	
ఎల్బీనగర్	48
గజ్వేల్	44
కామారెడ్డి	39
మునుగోడు	39
పాలేరు	37
నాంపల్లి	34
కోదాడ	34
మల్కాజ్‌గిరి	33
ఉప్పల్	32
ఖమ్మం	32
శేరిలింగంపల్లి	31
నల్లగొండ	31
కొత్తగూడెం	30

10 మందికి తక్కువ పోటీ చేస్తున్న నియోజకవర్గాలు ...	
బాన్సువాడ	7
నారాయణపేట	7
బాల్కొండ	8
సికింద్రాబాద్	10

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బొల్లోజు రవి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికలు హోరాహోరీగానే సాగనున్నాయి. ఈసారి ఏకపక్షంగా జరిగే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండుసార్లు గులాబీ జెండా ఎగరేసిన బీఆర్‌ఎస్‌కు ఈసారి గట్టి పోటీనే ఉంది. మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2018 ఎన్నికల్లో గులాబీ పార్టీ ఏకంగా 13 స్థానాల్లో గెలుపొందగా..ఈసారి అంత సులువుగా గట్టెక్కే పరిస్థితులు లేవు. మెజారిటీ స్థానాల్లో నువ్వా.. నేనా అన్న విధంగా పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతుంటే.. అవినీతి ఆరోపణలు మరికొందరి విజయంపై ప్రభావం చూపే అవకాశముంది. మరోవైపు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఈ జిల్లాకు చెందిన నాయకుడు కావడం, కాంగ్రెస్ గెలిస్తే సీఎం అవుతారన్న ప్రచారం రాజకీయాలను ప్రభావితం చేస్తోందని అంటున్నారు. బీజేపీ ప్రధానంగా మక్తల్, మహబూబ్‌నగర్, కల్వకుర్తిపైనే ఆశలు పెట్టుకుంది. మిగిలినచోట్ల ఆ పార్టీకి పెద్దగా కలిసొచ్చే స్థానాలు లేవనే పరిస్థితే ప్రస్తుతానికి ఉంది.



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు

ఏ పార్టీకీ పార్టీ టైమ్ కాదు..

గెలవాలంటే చెమటోడ్చాల్సిందే..

మార్పునకు కొందరు మొగ్గు.. ఇంకొందరు ప్రస్తుత పార్టీకే జై

అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఒకింత అసంతృప్తి...

ప్రభుత్వ పథకాలపై సానుకూలత..

గ్రౌండ్ రిపోర్ట్ — ఉమ్మడి మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ త్రిముఖ పోరు



శ్రీనివాస్‌గౌడ్ | శ్రీనివాస్‌రెడ్డి | మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ నుంచి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నుంచి యెన్నం శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీజితేందర్ రెడ్డి తనయుడు మిథున్‌రెడ్డి పోటీలో ఉన్నారు. గత కొంత కాలం క్రితం వరకు బీజేపీ గాలి వీచినా, ప్రస్తుతం ఆ పార్టీలో కొంత స్తబ్దత నెలకొంది. అభివృద్ధి, ప్రభుత్వ పథకాలను గుర్తుచేస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండడంతో సహజంగా ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ పాలన అంతా బెదిరింపులు, కేసులు, భూకబ్జాలు అంటూ కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం ప్రధానాస్త్రంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య గట్టి పోటీ నెలకొని ఉంది.

మక్తల్ ముగ్గురు..

మక్తల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి, బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి మధ్య త్రిముఖ పోరు కొనసాగుతోంది. ఎమ్మెల్యేతో పొసగకపోవడంతో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, బీకేఆర్, నర్వ పీఏసీఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు పలువురు బడా నేతలు హస్తం గూటికి చేరారు. ఇది బీఆర్‌ఎస్‌కు మైనస్‌గా మారగా, కాంగ్రెస్‌కు ప్లస్ అయినట్లు తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగి దాదాపు 37 వేల ఓట్లు సాధించడంతో ఆయనపై సానుభూతి పెరిగింది. రెడ్డి సామాజికవర్గం ఆయన వైపు చూస్తుండడంతో పోరు కీలకం కానుంది. అంతేగాక ఆ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు గణనీయంగా ఉండటం, ఇటీవలే ప్రధాని మోదీ, మందకృష్ణమాదిగ పాల్గొన్న సభ నేపథ్యంలో మక్తల్ ఎన్నికల్లో జలంధర్‌రెడ్డికి కలిసొచ్చే అంశాలు. ఈ మేరకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులతో జలంధర్‌రెడ్డి సమావేశం అవుతున్నారు. ఇక్కడ ముగ్గురు అభ్యర్థులూ పోటాపోటీగా విజయం కోసం పోరాటం చేస్తున్నారు.

దేవరకద్ర ద్విముఖ పోరు

దేవరకద్రలో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నుంచి కొండాప్రశాంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. బీజేపీ ప్రభావం అంతంత మాత్రంగానే ఉండగా... బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోరు కొనసాగనుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై అభివృద్ధి పనుల పేరిట కొందరు రూ.కోట్ల మేర కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలున్నాయి. కాంగ్రెస్ ఈ అంశాలనే ప్రధానంగా తీసుకుని ప్రచారం చేస్తోంది. బీఆర్‌ఎస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని... కాంగ్రెస్‌తోనే అందరికీ సంక్షేమం అంటూ మధుసూదన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు.

జడ్చర్ల జైకొట్టేదెవరికి?

జడ్చర్లలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండడం ఆయనకు కలిసి వచ్చే అంశం. అయితే ఆయన అనుచరులైన జడ్చర్ల మున్సిపాలిటీ పాలకమండలి కొందరు సభ్యుల అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, మైనస్‌గా నిలుస్తున్నాయి. వీటినే కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి ప్రధానాస్త్రంగా చేసుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు కాంగ్రెస్ గాలి కలిసి వస్తుందనే ధీమాతో ఆయన ఉన్నారు. అయితే ఆయనకు అన్ని మండలాలపై పట్టు లేకపోవడం, ప్రచారంలో వెనుకబడడం మైనస్ అని చెప్పవచ్చు.

కొల్లాపూర్ త్రిముఖ పోటీ

కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ అభ్యర్థిగా ఎల్లేని సుధాకర్‌రావు ఎన్నికల బరిలో ఉన్నారు. సుధాకర్‌రావు ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపులో ప్రభావం చూపనున్నారు. బీజేపీ అభ్యర్థి ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతో పాటు కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి సామాజిక వర్గానికి చెందిన ఓట్లను చీల్చే అవకాశాలు ఉన్నాయి.

అలంపూర్ అండ ఎవరికి?

అలంపూర్‌లో ప్రధానంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు, కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ మధ్య పోటీ నెలకొంది. ముఖ్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం వర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌కే చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చెంతకు చేరారు. మరికొందరు ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఇతర ముఖ్య నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇది సంపత్ కుమార్‌కు అనుకూలించే అంశం. బీఎస్పీ నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సోదరుడు ప్రసన్నకుమార్ కూడా బరిలో ఉండడం, బీఆర్‌ఎస్ వ్యతిరేక ఓట్లను చీల్చే అవకాశం ఉండడం ప్రధాన అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపనుంది.

గద్వాల ఎవరి అడ్డానో..

గద్వాలలో డీకే అరుణ పోటీలో లేకపోవడంతో ఎన్నికల్లో ప్రధాన పోటీ కాస్త బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే కొనసాగుతోంది. బీజేపీ నుంచి బోయ శివారెడ్డి బరిలో ఉన్నా, బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కుర్వ సామాజిక వర్గానికి చేరిన సరిత మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఇక్కడ బీసీ వర్గాల ఓట్లు కీలకం కానున్నాయి. మరో వైపు సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్లపై ప్రజల్లో కొంత వ్యతిరేకత కనిపిస్తోంది. ఆయన అనుచరుల దందాలను కాంగ్రెస్ ప్రధానాస్త్రంగా తీసుకుని ప్రచారం చేస్తోంది. అయితే బీఆర్‌ఎస్‌కు అన్ని మండలాలు, గ్రామాల్లో బలమైన నాయకత్వం, కార్యకర్తలు ఉండడం ఆయనకు కలిసి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా.

షాద్‌నగర్ ఇద్దరి మధ్యే..

షాద్‌నగర్‌లో అధికార బీఆర్‌ఎస్‌కి గట్టి పట్టు ఉంది. అధికార పార్టీ అభ్యర్థి అంజయ్య యాదవ్, ఇప్పటికే రెండుసార్లు విజయం సాధించారు. అధికారపార్టీపై ఉన్న ప్రజా వ్యతిరేకతకు తోడు, బీఆర్‌ఎస్ నుంచి కొనసాగిన వలసలు తనకు కలిసి వస్తాయని కాంగ్రెస్ అభ్యర్థి వీర్లశంకర్ భావిస్తున్నారు. ఇక బీజేపీ నుంచి బరిలోకి దిగిన అందె బాబయ్య మోదీ బొమ్మతో పాటు తన సొంత సామాజిక వర్గాన్ని నమ్ముకున్నారు. మొత్తంగా ఇక్కడ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే కీలకమైన పోటీ నెలకొంది.

వనపర్తి నువ్వానేనా..



నిరంజన్‌రెడ్డి | మేఘారెడ్డి

వనపర్తిలో బీఆర్‌ఎస్ నుంచి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి అనూహ్య పరిస్థితుల్లో టికెట్ దక్కించుకున్న తూడి మేఘారెడ్డి, బీజేపీ నుంచి అనూజ్ఞారెడ్డి పోటీలో ఉన్నారు. బీజేపీ ప్రభావం అంతంతే కాగా, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోరు హోరాహోరీగా ఉండనుంది. మంత్రి నిరంజన్‌రెడ్డికి నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేశారనే పేరుంది. అయితే ఆయన వ్యవహార శైలిపై ప్రజలతోపాటు సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది. దీంతో అహంకారానికి, ఆత్మగౌరవానికి పోరు అనే నినాదంతో కాంగ్రెస్ ప్రచారంలో దూసుకెళ్తోంది. అధికార పార్టీపై వ్యతిరేకత ఇక్కడ ప్రధానాంశంగా నిలుస్తోంది.

నాగర్‌కర్నూల్ నువ్వానేనా..

నాగర్‌కర్నూలులో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, జనసేన నుంచి వంగ లక్ష్మణ్‌గౌడ్ బరిలో ఉన్నారు. పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వడంతో అసంతృప్తికి గురైన బీజేపీలోని ప్రధాన నాయకులు, అనుచరులు ఎక్కువగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో చేరారు. నియోజకవర్గంలో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే హోరాహోరీ పోరు నెలకొంది. జరిగిన అభివృద్ధి పనులు బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఒకింత అనుకూలంగా మారాయి. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డి కాంగ్రెస్ తరపున బరిలో ఉండటంతో గట్టి పోటీ నెలకొంది.

కొడంగల్ పాతకాపుల దంగల్

కొడంగల్‌లో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ నుంచి బంటు రమేష్ పోటీలో ఉన్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోటీ ఉండనుంది. కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్‌గా ఉన్నారు. పైగా కాంగ్రెస్ గెలిస్తే రేవంతే సీఎం అన్న ప్రచారం ప్రజల్లోకి వెళుతోంది. యూత్‌లో ఆయన పట్ల క్రేజ్ ఉండడంతోపాటు మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి వంటి నాయకులు ఆయనకు మద్దతుగా అన్నీ తామై నిలుస్తుండడం, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండడం రేవంత్‌కు కలిసి వచ్చే అవకాశం ఉంది.

నారాయణపేట పోటాపోటీ

నారాయణపేటలో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, బీజేపీ నుంచి రతంగ్‌పాండురెడ్డి పోటీలో ఉన్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే హోరాహోరీ పోటీ నెలకొంది. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఈ క్రమంలో ప్రస్తుతానికి ప్రజల్లో కాస్త మార్పు కనిపిస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పర్ణికారెడ్డికి ఉన్న కుటుంబ నేపథ్యబలం ప్రధాన భూమిక పోషిస్తోంది.

అచ్చంపేట అమీతుమీ

అచ్చంపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, బీజేపీ నుంచి సతీశ్ మాదిగ బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్యే నెలకొంది. నియోజకవర్గంలో ప్రభుత్వంపై అసంతృప్తితోపాటు ఎమ్మెల్యేపై సైతం వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని మెజారిటీ మండలాల్లోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరడం, ప్రభుత్వ వ్యతిరేకత కాంగ్రెస్‌కు కలిసివస్తోంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది.

కల్వకుర్తి ట్రయాంగిల్



జైపాల్‌యాదవ్ | నారాయణరెడ్డి | తల్లోజు ఆచారి

కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ నుంచి తల్లోజు ఆచారి బరిలో ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు జైపాల్‌యాదవ్‌పై సైతం వ్యతిరేకత ఉంది. ఇప్పటికే ఆయనకు చెందిన ముఖ్యమైన కేడర్ కాంగ్రెస్‌లో చేరారు. ఇది కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి కలిసి వచ్చింది. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోరు సాగనుంది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ



మహబూబ్‌నగర్‌లో పరిస్థితి పోటాపోటీగా ఉంది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పట్టణాన్ని బాగానే అభివృద్ధి చేశారు. అయినా, ఎవరు గెలుస్తారని చెప్పే పరిస్థితి లేదు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యనే పోటీ.

– వెంకటేశ్, మహబూబ్‌నగర్, ఆటో డ్రైవర్

రైతుబంధు బీఆర్‌ఎస్‌కు కలిసొచ్చే అవకాశం



అధికార పార్టీకి కాంగ్రెస్ పార్టీకి మధ్య పోటాపోటీ నెలకొని ఉంది. రైతుబంధు వల్ల రైతులు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. మిగిలిన వర్గాలు ఏం చేస్తాయో చెప్పలేను. ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి.

– వెంకటయ్య, రైతు, గోవులాపురం(దేవరకద్ర)

ఇంటికొక ఉద్యోగం ఏమైంది?



ఈ ప్రభుత్వంలో రైతుబంధు, రైతుబీమా పథకాలు అన్నీ బాగానే ఉన్నాయి. కానీ చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు రావడం లేదు. ఇంటికొక ఉద్యోగం ఇస్తామని చెప్పి నెరవేర్చలేదు. పిల్లలు చదువు అయిపోయిన తర్వాత ఉద్యోగం రాక ఆగమవుతున్నారు. పరిస్థితి మాత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు మధ్య పోటాపోటీగానే ఉంది.

– కృష్ణమ్మ, రైతు, మరికల్ (నారాయణపేట)

దళితబంధు కొందరికే ఇవ్వడంతో అసంతృప్తి



గద్వాల నియోజకవర్గంలో ఇంకా ఎవరు గెలుస్తారో అప్పుడే చెప్పలేం. ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలాగైనా మారిపోవచ్చు. అధికార ప్రతిపక్ష పార్టీలు గట్టి పోటీని ఇస్తున్నాయి. దళిత బంధు కొందరికి మాత్రమే రావడం పట్ల ఆ వర్గాల్లో అసంతృప్తి ఉంది. పిల్లల ఉద్యోగాల విషయంలో కూడా వ్యతిరేకత కనిపిస్తోంది.

– వసంత్, రైతు, తప్పెట్లమొర్స్ (గద్వాల)

మక్తల్‌లో సానుభూతి పనిచేస్తుందా..



మక్తల్ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారో అంతు పట్టడం లేదు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ ఉంది. గతంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన జలంధర్‌రెడ్డిపై సానుభూతి ఏమైనా పని చేస్తుందా అన్నది చూడాలి.

– దేవదాసు, పెట్రోల్‌బంక్ పంపు బాయ్, మూలమల్ల (మక్తల్)

కండువా కథ చాలానే!

వనం దుర్గాప్రసాద్

కనిపించే కండువా వెనుక కానరాని లెక్కలెన్నో..

ఒకప్పుడు వీటి తయారీకి సిరిసిల్ల కేరాఫ్.. ఇప్పుడు హైదరాబాద్‌లోనూ

పార్టీ మారితే కండువా కప్పడమే సింబల్

'కండువా మార్చాడు'.. పార్టీ మారితే సాధారణంగా వినిపించే మాటిది. ఒక లీడర్ పార్టీ మారితే అతని వెంట పదులు, వందల సంఖ్యలో వెళ్తారు. వాళ్లంతా కండువాలు మార్చుకోవాల్సిందే. పైకి కనిపించకపోయినా ఈ ఖర్చు ఎక్కువే అంటున్నారు నేతలు. ఆ పార్టీ..ఈ పార్టీ అనే తేడా లేకుండా ప్రతీ నియోజకవర్గంలోనూ ఎన్నికలప్పుడు వీటి అవసరం భారీగానే ఉంటోంది. నియోజకవర్గానికి ఈ ఖర్చు రూ.లక్షల్లోనే ఉంటుంది.



సిరిసిల్ల నుంచి హైదరాబాద్ వరకూ..

కండువాల తయారీకి ప్రసిద్ధి సిరిసిల్ల. ఈ ప్రాంతంలో 25 కుటుంబాలు ఇదే పనిలో ఉన్నాయి. ఇప్పుడు ఇంతకు మించి హైదరాబాద్‌లో ఎక్కువగా తయారీ అవుతున్నాయని సిరిసిల్ల నేత కార్మికులు చెబుతున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో ఆర్డర్లు రావడంతో నేత కార్మికులు హైదరాబాద్‌లో ప్రింటింగ్ చేయాల్సి వస్తోంది. నేతలు కూడా అనేక రకాలను కోరుకుంటున్నారు. కండువాపై పార్టీ నేతలు, లేదా తన కేడర్‌తో పార్టీ మారాలనుకునే వారి ఫొటోలతో కండువాలు ముద్రించాలని కోరుతున్నారు. ఇందుకు కొంత నాణ్యత అవసరమని, దీనికోసం హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోందని సిరిసిల్లకు చెందిన భూపాల్ తెలిపారు. ఒక్కో కండువా తయారీకి రూ.3 ఖర్చు అవుతోందని, తాము రూ. 3.50కు అమ్ముతున్నామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలోనూ దాదాపు లక్ష కండువాలు అవసరమయ్యే వీలుందని అంచనా వేస్తున్నారు. ఈమేరకు ముందుగా ఏ పార్టీ గుర్తు లేకుండా తయారు చేస్తున్నట్టు నేత కార్మికుడు నీరజ్ తెలిపారు.

కండువాకూ కోడ్ కష్టాలు..

కండువాకూ ఎన్నికల కోడ్ ఇబ్బందులు తప్పడం లేదని తయారీదారులు చెబుతున్నారు. ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి తరలించే క్రమంలో కండువాలకు బిల్లులు అడుగుతున్నారని చెప్పారు. బిల్లులు లేకుండా తీసుకెళ్లడం కష్టమని రాజకీయ నేతలంటుంటే... ఈ మొత్తం అకౌంట్స్‌లో జమ చేస్తే ఎన్నికల సమయంలో ఇతరత్రా కష్టాలు వస్తాయని నేత కార్మికులు అంటున్నారు. ఇక కండువాలకు అవసరమైన సిల్క్, పాలిస్టర్ వస్త్రాన్ని తీసుకురావడానికి కూడా ఇబ్బందులు వస్తున్నాయని తయారీదారులు తెలిపారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లకుండా, అనేక మార్గాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని హైదరాబాద్‌కు చెందిన కండువాల తయారీదారు సంజయ్‌గుప్తా తెలిపారు.

ఆర్డర్లే కాదు... ఇబ్బందులూ ఉన్నాయి



తెలంగాణ నుంచే కాదు... ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. దీని కోసం కార్మికులను ఎక్కువ సంఖ్యలో నియమించుకోవాల్సి వస్తోంది. ఇదే తరుణంలో ఎన్నికల సమయం కావడంతో కార్మికులు ఎక్కువ అడుగుతున్నారు. కొన్నిసార్లు వారు దొరికే పరిస్థితీ లేదు. నేతలు బిల్లులు కోరడం కూడా వ్యాపారానికి ఇబ్బందిగానే ఉంది. నగదు బదిలీ కష్టమవుతోంది. అయితే కండువాల వల్ల చాలామందికి ఉపాధి మాత్రం లభిస్తోంది.

– ద్యావనపల్లి మురళి (కండువాల వ్యాపారి, సిరిసిల్ల)

గాసిప్ టైమ్

గడప దాటని నాంపల్లి బ్రదర్స్

మరో రెండు వారాల్లోనే పోలింగ్ జరగనుంది. కానీ ఓ ప్రధాన పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు రాష్ట్రస్థాయిలో ప్రచారానికి వెళ్లకుండా హైదరాబాద్‌లోనే కూర్చొని ప్రతీరోజు మీడియా సమావేశాలతోనే కాలం వెళ్లబుచ్చుతుండటం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ ఇద్దరు నాయకులకు ఏకంగా నాంపల్లి బ్రదర్స్ అంటూ పార్టీలోని కేడర్ ముద్దు పేరు కూడా పెట్టేసింది. జాతీయ నాయకులు పర్యటనకు వచ్చినప్పుడు మినహా వారు బయట పర్యటనలకు ఎక్కువగా సమయం కేటాయించడం లేదట. అదేమంటే..ఇక్కడ కూర్చొని వ్యూహాలు రచిస్తున్నారట. జాతీయస్థాయిలో సీనియర్ నేతలైన ఆ ఇద్దరూ కనీసం తమ జిల్లాల్లోని అభ్యర్థులను గెలిపించే బాధ్యతను మోయాల్సి ఉన్నా.. కనీసంగా పట్టించుకోకుండా కాలక్షేపం చేస్తుండటంతో ఆయా జిల్లాల పార్టీ కార్యకర్తలు తల పట్టుకుంటున్నారట. ఇక పార్టీ ఆఫీసులోనే కూర్చొని అప్పుడే అధికారంలోకి వచ్చేశామన్నట్టుగా వారిద్దరూ ఇచ్చే బిల్డప్ చూస్తుంటే పార్టీ శ్రేణులకు మాత్రం ఎక్కడో కాలుతోందట.



30+ స్టార్ వార్

పలు నియోజకవర్గాల్లో ముఖ్య నేతల ముఖాముఖి పోటీ

● కాంగ్రెస్, బీజేపీలోనూ అగ్ర నేతలు బరిలో ● అమాత్యుల అదృష్టం ఎలా ఉందో..

మేకల కళ్యాణ్ చక్రవర్తి

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని వేమన శతకంలో చెప్పినట్టు ప్రత్యక్ష ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయడమంటేనే ఓ ప్రత్యేకత. అందునా కీలక స్థానాల్లో కీలక నాయకులు తలపడి, ఆయా ప్రాంతాల్లో ఆసక్తికర పోరు జరిగితే మరింత ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కీ ఫైట్ కిక్కిస్తుంది. పోటీచేసే కీలక నాయకుల్లో ఎవరు గెలిచినా, ఓడినా వారికి గుర్తింపు వేరేగా ఉంటుంది. ఈ ఎన్నికల్లో 30కి పైగా స్థానాల్లో ఇలాంటి పోటీనే నెలకొంది. సీఎం కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ కీలక నేతలు హరీశ్‌రావు, కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, బీజేపీ నుంచి బండి సంజయ్, ఈటల, అర్వింద్, ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డి, సీఎల్పీ నేత భట్టి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తదితరులు పోటీ చేస్తున్న స్థానాల్లో ఆసక్తికర పోరు జరుగుతోంది. కొన్ని చోట్ల కొంతమందికి విజయం నల్లేరు మీద నడక లాంటిదే అయినా ఇంకొన్ని చోట్ల ద్విముఖ, మరికొన్ని స్థానాల్లో త్రిముఖ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కీ ఫైట్ ఎక్కడెక్కడ జరుగుతుందో ఒక్కసారి చూద్దాం:

- గజ్వేల్‌లో మరోమారు సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారు. కచ్చితంగా కేసీఆర్‌పై పోటీ చేసి ఆయన్ను ఓడిస్తానంటూ చాలా కాలంగా చెబుతున్న బీజేపీ నేత ఈటల రాజేందర్ ఇక్కడి నుంచి రంగంలోకి దిగారు. కాంగ్రెస్ పక్షాన తూంకుంట నర్సారెడ్డి పోటీ చేస్తున్నా పోటీ మాత్రం కేసీఆర్, రాజేందర్‌ల నడుమ సాగనుంది.
- సీఎం కేసీఆర్ పోటీ చేస్తోన్న మరో నియోజకవర్గం కామారెడ్డి ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే గంపా గోవర్ధన్‌ను తప్పించి మరీ కేసీఆర్ అక్కడి నుంచి బరిలోకి దిగారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పక్షాన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండడంతో ఆసక్తి మరింత పెరిగింది. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెంకటరమణారెడ్డి కూడా గట్టి పోటీ ఇస్తుండడంతో కామారెడ్డిలో త్రిముఖ పోటీ అనివార్యమని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

> - బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు మళ్లీ సిరిసిల్ల నుంచే రంగంలోకి దిగారు. ఆయనపై పాతకాపు కె.కె. మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి మరోమారు పోటీ చేస్తుండగా, బీజేపీ రాణిరుద్రమను అభ్యర్థిగా నిలిపి ప్రయోగం చేస్తోంది. పోటీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నడుమే ఉంది.

- బీఆర్‌ఎస్ ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు తనకు భారీ మెజార్టీని ఇచ్చే సిద్ధిపేట నుంచే మరోసారి పోటీ చేస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి పూజల హరికృష్ణ, బీజేపీ నుంచి దూది శ్రీకాంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో లక్ష ఓట్లకు పైగా మెజారిటీ వచ్చిన సిద్దిపేట నుంచి హరీశ్‌రావును ఢీ కొనడం అంత ఈజీ కాదంటున్నారు.
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ఓటమి పాలలైన కొడంగల్ నుంచే మళ్లీ పోటీ చేస్తున్నారు. ఆయనపై బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి రమేశ్ పోటీ చేస్తున్నా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యనే హోరాహోరీ పోరు ఉంది.
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ స్థానం నుంచి తొలి సారి పోటీ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నుంచి రావి శ్రీనివాస్‌లు కూడా గట్టి పోటీ ఇస్తుండడంతో అక్కడ త్రిముఖ పోటీ నెలకొందనే చెప్పాలి.
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మధిర నుంచే మళ్లీ పోటీ చేస్తున్నారు. ఆయనపై పాతకాపు లింగాల కమలరాజ్ (బీఆర్‌ఎస్) పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ప్రభావం నామమాత్రమేనని, కాంగ్రెస్–బీఆర్‌ఎస్‌ల నడుమ మధిరలో ఆసక్తికర పోరు జరుగుతోంది.
- ఎంపీ .ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోమారు హుజూర్‌నగర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ నుంచి చల్లా శ్రీలతారెడ్డి బరిలో ఉన్నారు. ఉత్తమ్‌పై గత ఎన్నికల్లో ఓడిపోయి, ఆయన సతీమణి పద్మావతిపై ఉప ఎన్నికలో గెలిచిన సైదిరెడ్డి మూడోసారి ఎన్నికల బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యనే పోటీ ఉంది.
- బీజేపీలోని మరో కీలక నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌నుంచి పోటీ చేస్తున్నారు. ఓటమి ఎరుగని నాయకుడిగా గుర్తింపు పొందిన రాజేందర్‌పై పాడి కౌశిక్‌రెడ్డి (బీఆర్‌ఎస్), వొడితల ప్రణయ్‌రావు (కాంగ్రెస్) బరిలోకి దిగారు. గత ఉప ఎన్నికల్లోనూ గెలుపొందిన రాజేందర్‌ను ఢీకొట్టి నిలవడం బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు సాధ్యమవుతుందా లేదా అన్నది ఫలితాలు వస్తే కానీ తేలే అవకాశం లేదు.

> - బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మళ్లీ కరీంనగర్ నుంచే రంగంలోకి దిగారు. ఇక్కడ ఆయన పాత ప్రత్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ (బీఆర్‌ఎస్)ను ఢీకొడుతున్నారు. కాంగ్రెస్ నుంచి పురుమళ్ల శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. ముగ్గురూ మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. అయితే, పోటీ మాత్రం బీఆర్‌ఎస్, బీజేపీల నడుమ ఉంటుందని చెబుతున్నారు.

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఈసారి కోరుట్ల అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు. అసెంబ్లీకి తొలిసారి పోటీ చేస్తున్న ఆయనపై బీఆర్‌ఎస్ నుంచి కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగరావులు పోటీ చేస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి వెలమ సామాజిక వర్గానికి చెందిన నేతలు తలపడుతుండడం, కోరుట్లలో త్రిముఖ పోటీ అనివార్యమవుతోంది.

> - మరో మాజీమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ స్థానంలో మరోమారు బరిలోకి దిగారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్)ను ఢీ కొడుతున్నారు. బీజేపీ నుంచి విద్యావేత్త మాదగోని శ్రీనివాస్‌గౌడ్ పోటీలో ఉన్నారు. బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన నల్లగొండ పట్టణ మాజీ అధ్యక్షుడు పిల్లి రామరాజు యాదవ్ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. పోటీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నడుమే ఉండనుంది.

- పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కాంగ్రెస్ పార్టీ నుంచి అతిపిన్న వయస్కురాలైన హనుమాండ్ల యశస్వినిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఝాన్సీ రాజేందర్‌రెడ్డి కోడలిగా బరిలో ఉన్న ఆమెతో అపార రాజకీయ అనుభవం ఉన్న దయాకర్‌రావు తలపడుతుండడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. బీజేపీ నుంచి లేగ రామ్మోహన్‌రెడ్డి బరిలో ఉన్నా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యే ద్విముఖ పోటీ నెలకొంది.
- వనపర్తి నుంచి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆయనపై కాంగ్రెస్ నుంచి మేఘారెడ్డి (మొన్నటి వరకు బీఆర్‌ఎస్ ఎంపీపీ), బీజేపీ నుంచి అనుజ్ఞారెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక్కడ గతంలో నిరంజన్‌రెడ్డిని ఓడించిన చిన్నారెడ్డికి మొదట టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ తర్వాత మేఘారెడ్డికి కేటాయించింది. మొన్నటిదాకా ఒకే పార్టీలో ఉన్న మేఘారెడ్డి, నిరంజన్‌రెడ్డిల మధ్య పోరు ఆసక్తిని కలిగిస్తోంది.
- మహబూబ్‌నగర్ నుంచి ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వరుసగా మూడోసారి బరిలోకి దిగారు. గతంలో బీజేపీలో పనిచేసిన మాజీ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బీజేపీకి మంచి పట్టు ఉన్న పాలమూరు జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నుంచి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి పోటీ చేస్తుండడంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొందని రాజకీయ వర్గాలంటున్నాయి.
- వీటితో పాటు ప్రస్తుత కేబినెట్ మంత్రులు పోటీ చేస్తున్న నియోజకవర్గాలు, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన గెలిచి ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలు పోటీ చేస్తున్న స్థానాలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 30 చోట్లకు పైగా ఆసక్తికర పోరు సాగుతోంది.

పిట్ట బతుకే ఓటరుదీ... పిట్టమెదడే వాడి యుక్తి!

''వాళ్లకు ఇవ్వం. మనం వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లో బెటిఫిట్స్ ఇవ్వం. మన జెండా మోసినోళ్లకు, మనతోని తిరిగినోళ్లకు..వాళ్లకే మన స్కీముల ప్రయోజనాలు ఇస్తం. మనోళ్లు కానోళ్లు ఎవ్వరైనా ఇళ్లు కట్టుకుంటుంటే.. మున్సిపాలిటీ వాళ్లకు చెప్పి, నేనే దగ్గరుండి కూలగొట్టిస్త'..ఇదీ కొన్ని దశాబ్దాలుగా ఎన్నికవుతూ ఉన్న ప్రజాప్రతినిధి మాట. అదీ పబ్లిగ్గా మీటింగ్‌లో. అదీ ఆన్ రికార్డ్. ఇలా అనడం కరెక్టేనా సార్'' అమాయకంగా అడిగాడు ఓటరు.

''ఆయనంటే ఏదో మామూలు మంత్రిస్థాయి వ్యక్తి. కానీ ఆయన కంటే గొప్పగా సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి కూడా 'ప్రజలకు విచక్షణ ఉన్నప్పుడు ప్రభుత్వానికీ ఉంటది. కాబట్టి మేం మా ఇష్టమైనోళ్లకే ఇచ్చుకుంటం మా బెనిఫిట్లు' అన్నాడు కదా నాయనా. ఈయనతో పోలిస్తే ఆయనెంత'' అని చిద్విలాసంగా అన్నారు స్వామీ ఎలక్షనానంద.

''కేవలం నలభై శాతం ఓట్లతోనే ఎన్నికైనా, అంటే అరవై శాతానికి ఆమోదం కాకపోయినా, దాన్నే మెజారిటీ ఓపీనియన్ అంటారు. తనకు ఓట్లు వేయనోళ్లకు కూడా గెలిచిన వ్యక్తే ప్రతినిధి అనేది మన ఎలక్షన్ సిస్టమ్. ఈ సిస్టమ్‌లో ఎన్నికై ..ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగునా సార్'' ఎలక్షనానంద స్వామిని మళ్లీ అడిగాడు ఓటరు.

నిజానికి ఆయన పేరు సలక్షణానంద స్వామి. ఓ మంచి స్వామీజీగా అన్ని అంశాలతో పాటు రాజకీయాలూ, నేతల అంతర్గత భావాల మీద కూడా వ్యాఖ్యానిస్తుంటారు. ఎన్నికలతో సహా అన్ని విషయాల మీదా నిర్మొహమాటంగా అభిప్రాయాలు చెబుతుంటారు కాబట్టి ఆయన్నలా పిలుస్తారు.

''పిట్టలు చాలా అమాయకంగా కనిపిస్తాయి. 'పిట్టప్రాణం' అనే మాట వినే ఉంటావు. ఓ సామాన్యుడి బతుకులాగే అంతటి బక్క ప్రాణం దానిది. అంతటి అర్భకపు ప్రాణికీ ఎన్నో యుక్తులూ, దాని మీద మరెన్నో కథలు. ఎన్నో సార్లు విన్న అలాంటి కథే మచ్చుకు మరోసారి చెబుతా విను నాయనా'' అంటూ ఎలక్షనానంద స్వామి ఈ కథ చెప్పారు.

అనగనగనగా రాణివారి తోట. అందులో ఓ చెట్టు. ఆ చెట్టు మీద ఓ పిట్టల జంట కాపురముంటోంది. అదే చెట్టుకు కాస్త ఆవల ఓ పుట్ట. ఆ పుట్టలో ఓ పాము నివాసముంటోంది.

ఎవరి బతుకు వారు బతుకుతున్నంత కాలం..ఎదుటివాడిని కూడా బతకనిస్తున్నంత కాలం... ఎవరికీ అభ్యంతరముండదు. కానీ.. ఆడ పిట్ట గుడ్లు పెట్టిన ప్రతిసారీ పాము రావడం , గుడ్లు తిని వెళ్లిపోవడం..ఇది ప్రతిసారీ జరుగుతోంది. అప్పటికీ పిట్టల జంట చాలా సార్లు పామును కోరాయి..ఇక తమను వదిలేయమనీ, తమ బతుకు తమను బతకనివ్వమని. కానీ తేలిగ్గా దొరికే ఆహారాన్ని వదల్లేక పాము ప్రతిసారీ అదే పని చేస్తోంది.

పిట్ట బతుకెంత? దాని ఔకాదెంత? పామునది ఏమీ చేయలేదు. అందుకే ఓరోజున రాణిగారి అంతఃపురంలోకి పోయింది పిట్ట. అక్కడి నుంచి చాలా విలువైన, రాణిగారికి అత్యంత ప్రియమైన నగను నోటకరచుకొని వచ్చి, సరిగ్గా పుట్టలో వేసింది. నగ పుట్టలో పడిన ఆనవాలు వదులుతూ మరీ వేసింది. అంతే నాయనా.. భటులు పుట్ట తవ్వేశారూ, నగను పట్టేశారు.

ఇక్కడ గమనించాల్సిన ఓ విషయం ఒకటుంది. పిట్టలు తాము పెట్టిన గుడ్ల బెనిఫిట్టును తమ పిల్లల రూపంలో పొందాలి. పిట్టబిడ్డ పిట్టకు ముద్దు కాదా. అందుకే అది నగను పుట్టలో వేసింది. నగలాగే విలువైనది ఓటు కూడా. ఆ ఓటును పిట్టప్రాణమంతే ఉన్న బక్కజీవి ఓట్ల పెట్టెలో వేసేశారనుకో..మిగతా పనంతా పనంతా ప్రజాస్వామ్యం చూసుకుంటుంది నాయనా. ఇది నేను చెప్పిన నీతి కథ కాదు. అనాదిగా అందరూ చదివిందే. దీని తాలూకు నీతి ఏమిటో ఇంకా విపులంగా వివరించి చెప్పాల్సిందేమీ లేదనుకుంట..అంటూ మరోసారి చిద్విలాసంగా నవ్వేరు స్వామి ఎలక్షనానంద.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఇక్కడ పోలింగ్ భారమంతా మహిళలదే



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ రికార్డు నెలకొల్పింది. శుక్రవారం రాయ్‌పూర్ (నార్త్)లో పోలింగ్ ప్రక్రియ ఆసాంతం మహిళా అధికారులు, సిబ్బంది చేతులమీదుగానే నడిచింది. ప్రిసైడింగ్ అధికారి మొదలుకొని పోలింగ్ అధికారి వరకు మొత్తం 201 పోలింగ్ బూత్‌ల్లో మహిళలకు మాత్రమే బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. 'సంగ్వారీ (ఉమెన్ ఫ్రెండ్లీ) బూత్‌లకు పూర్తిగా మహిళా అధికారులను నియమించాం. 804 మంది మహిళలకు ప్రత్యక్ష బాధ్యతలు అప్పగించాం. మరో 200 మందిని రిజర్వులో ఉంచాం. ఇక్కడ ఐఏఎస్ అధికారి ఆర్.విమలను పరిశీలకురాలిగా నియమించాం. లయిజనింగ్ అధికారి కూడా మహిళే. చాలావరకు బూత్‌ల వద్ద భద్రతకు మహిళా సిబ్బందినే నియమించాం'అని వివరించింది. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి మహిళా ఐఏఎస్ రీనా బాబా సాహెబ్ కంగాలె కావడం విశేషమని ఆ ప్రకటనలో వివరించింది. మహిళా అధికారులే పోలింగ్ నిర్వహించిన రాయ్‌పూర్(నార్త్)నియోజకవర్గంలో స్త్రీ, పురుష నిష్పత్తి కూడా 1010:1000గా ఉండటం మరో విశేషమని పేర్కొంది. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాతే ఒక నియోజకవర్గంలో పోలింగ్ బాధ్యతలను కేవలం మహిళలకే అప్పగించాలన్న ఆలోచన రూపుదిద్దుకుందని రాయ్‌పూర్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సర్వేశ్వర్ నరేంద్ర భూరె తెలిపారు. ఈ మేరకు చేపట్టిన చర్యలు విజయవంతం కావడంతో ఇప్పుడు అందరూ తమను ప్రశంసిస్తున్నారని చెప్పారు. రాయ్‌పూర్ సిటీ(సౌత్) నియోజకవర్గంలోని సగం వరకు బూత్‌ల్లోనూ మహిళా అధికారులనే నియమించినట్లు ఆయన వెల్లడించారు.

'స్మార్ట్' పోలింగ్ స్టేషన్ ప్రత్యేకతలేమిటంటే?

ఇండోర్: ఓటర్లు క్యూలో నిలబడే అవసరం లేకుండానే ఓటేయొచ్చు.., అక్కడే సిరా గుర్తున్న వేలు చూపుతూ కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే కెమెరా ద్వారా సెల్ఫీ తీసుకోవచ్చు..! మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ పోలింగ్ బూత్ ప్రత్యేకతలివీ. నంద నగర్ నియోజకవర్గంలోని 'మా కనకేశ్వరి దేవి'గవర్నమెంట్ కాలేజీ బూత్‌లో ఈ ఏర్పాటును అందుబాటులోకి తెచ్చారు. 'ఓటర్ల క్యూ పెద్దగా అవసరం లేకుండా చేసేందుకు ఆన్‌లైన్ టోకెన్ విధానాన్ని తీసుకొచ్చాం. పోలింగ్ బూత్‌కు వచ్చిన వెంటనే ఓటర్లకు టోకెన్లు అందజేశాం. దీంతో, తమ వంతు వచ్చే వరకు వారు పోలింగ్ బూత్ వద్దే కూర్చోవచ్చు'అని రాష్ట్ర ప్రభుత్వ ఇండోర్ స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్‌కు చెందిన అసిస్టెంట్ ప్లానర్ రుపాల్ చోప్రా పీటీఐకి చెప్పారు. 'పోలింగ్ స్టేషన్ ఆవరణలోనే ఏఐ ఆధారిత కెమెరాను ఏర్పాటు చేశాం. ఓటేసిన వారు ఆ పాయింట్ వద్ద నిలబడి ఇంక్ గుర్తున్న వేలిని చూపితే చాలు వెంటనే కెమెరా క్లిక్‌మనిపిస్తుంది'అని ఆమె వివరించారు. 'అక్కడే ఉన్న స్క్రీన్స్‌పై బార్ కోడ్ ప్రత్యక్షమవుతుంది. ఓటర్ తన ఫోన్‌తో స్కాన్ చేస్తే ఫొటో వెంటనే మొబైల్‌లోకి వచ్చేస్తుంది. సోషల్ మీడియాలోకి సైతం షేర్ అవుతుంది'అని రుపాలి పేర్కొన్నారు.

వినోదం కోసమే ఆమె మధ్యప్రదేశ్‌కు వస్తారు

కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీపై సీఎం చౌహాన్ వ్యాఖ్య

భోపాల్: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఎన్నికల ప్రచారంలో సినిమాల గురించి మాట్లాడటంపై మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రియాంకా గాంధీకి ప్రజాస్వామ్యం అన్నా ప్రజలన్నా గౌరవం లేదన్నారు. మధ్యప్రదేశ్‌కు ఆమె వినోదం కోసమే వస్తున్నారని వ్యాఖ్యానించారు. 'ఎన్నికలను ముఖ్యమైన విషయంగా కాంగ్రెస్ భావించడం లేదు. నటన, జై- వీరూ లేదా ప్రధాని మోదీపై సినిమా తీయడమే ఎన్నికల అంశమని అనుకుంటున్నారా అని ప్రియాంకా గాంధీని అడగాలనుకుంటున్నా. ఎన్నికలను ఆమె తమాషా అనుకుంటున్నారు. ఇది ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే'అని పేర్కొన్నారు. ఓటమిని ఊహించిన కాంగ్రెస్ నేతలు ఇటువంటి వ్యాఖ్యలకు దిగుతున్నారన్నారు. గురువారం దటియా నియోజకవర్గంలోని జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక.. సీఎం చౌహాన్‌ను ప్రపంచ ప్రఖ్యాత నటుడిగా అభివర్ణించారు. ఆయన అమితాబ్‌ను సైతం మించిపోయేవారన్నారు. అభివృద్ధిని గురించి ప్రస్తావించినప్పుడల్లా కమెడియన్‌లా ప్రవర్తిస్తారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీని సైతం ఆమె వదల్లేదు. ప్రతిపక్షంలో ఉండగా తనను వేధించారని చెప్పుకుని మోదీ ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆయనపై మేరే నామ్ పేరుతో సినిమా కూడా తీయొచ్చని ప్రియాంక అన్నారు.

జంగ్ తెలంగాణ పంచతంత్రం

న్యూఢిల్లీ/భోపాల్/రాయ్‌పూర్: మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో శాసనసభ ఎన్నికలు ముగిశాయి. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలుండగా ఒకే దశలో, ఛత్తీస్‌గఢ్‌లో చివరి దశలో భాగంగా 70 అసెంబ్లీ స్థానాల్లో శుక్రవారం పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లో అక్కడక్కడా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లు అమర్చిన బాంబు పేలి ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ మరణించాడు. సాయంత్రం 5 గంటలకల్లా మధ్యప్రదేశ్‌లో 76 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 70.59 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మారుమూల ప్రాంతాల నుంచి సమాచారం ఇంకా అందలేదని, పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని తెలియజేసింది. శనివారం పూర్తి గణాంకాలు వెల్లడవుతాయని పేర్కొంది.

ఏనుగు దాడిలో ఓటరు మృతి

ఛత్తీస్‌గఢ్‌లో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. నక్సల్స్ ప్రభావిత గరియాబంద్ జిల్లాలోని 9 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు పోలింగ్ జరిగింది. రాష్ట్రంలో చివరి దశ ఎన్నికల్లో ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్, ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్‌దేవ్, 8 మంది మంత్రులు, నలుగురు ఎంపీలు పోటీపడ్డారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పటాన్‌దుర్గ్ జిల్లాలోని కురుద్ది గ్రామంలో కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో 75కుపైగా స్థానాలు గెలుచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బలోడాబజార్-భాతపారా జిల్లాలోని కాస్‌డోల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద వరుసలో నిల్చున్న సహోదరబాయి నిషాద్(58) అనే మహిళ అకస్మాత్తుగా మృతి చెందింది. కొరియా జిల్లాలోని మాంగోరా గ్రామంలో ఉమేంద్ర సింగ్(25) అనే యువకుడు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వస్తుండగా, ఏనుగు దాడి చేసింది. దాంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. చివరి దశ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు జరిగాయి.

మధ్యప్రదేశ్‌లో 76%

ఛత్తీస్‌గఢ్‌లో 70.59%

- రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్
- పోలింగ్ శాతం పెరిగే అవకాశం
- పలుచోట్ల చెదురుమదురు సంఘటనలు, ఘర్షణలు
- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ బాంబు పేలి ఐటీబీపీ జవాను మృతి

మధ్యప్రదేశ్‌లో హింసాకాండ

మధ్యప్రదేశ్‌లో 230 స్థానాల్లో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, మాజీ సీఎం కమల్‌నాథ్, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు సహా సహా 2,533 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో హింసాకాండ చోటుచేసుకుంది. మేగావ్ నియోజకవర్గం పరిధిలోని మనహాడ్ గ్రామంలో పోలింగ్ కేంద్రం బయట కొందరు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. దిమానీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన జరిగిన గొడవల్లో ఇద్దరు గాయపడ్డారు. ఇండోర్‌లోనూ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరుపార్టీల కార్యకర్తలు ఘర్షణకు దిగడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. రాజ్‌నగర్‌లో బీజేపీ నేతల వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జబల్పూరులో ఘర్షణలు జరిగాయి.

నక్సల్స్ బాంబు పేలుడులో ఐటీబీటీ జవాన్ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాలు పోలింగ్ సామగ్రితో తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రెజర్ బాంబు పేలి ఒక జవాన్ మృతి చెందగా, మరో జవాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. గరియాబంద్ జిల్లాలోని బింద్రనావగఢ్ అసెంబ్లీ నియోజకవర్గం గోబ్రాలో పోలింగ్ ముగిశాక శుక్రవారం సాయంత్రం ఈవీఎంలు సహా ఇతర సామగ్రితో ఉద్యోగులు, జవాన్లు తిరుగు ప్రయాణమయ్యారు. అటవీ మార్గం ద్వారా జిల్లా కేంద్రానికి కాలినడకన వస్తుండగా, పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకుని నక్సలైట్లు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబును ఐటీబీటీ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జోగిందర్ సింగ్ పొరపాటున తొక్కడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో ఆయన వెనక ఉన్న మరో జవాన్‌కు గాయాలయ్యాయి.



ఓటేశాక సెల్ఫీ పాయింట్ వద్ద దిగ్విజయ్‌సింగ్ దంపతులు



ఓటరు గుర్తింపు కార్డు చూపిస్తున్న మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ దంపతులు



మధ్యప్రదేశ్ పీసీసీ చీఫ్ కమల్‌నాథ్



జ్యోతిరాదిత్య సింధియా



స్వగ్రామం కురుదిలో ఓటేసేందుకు క్యూలో నిలబడ్డ ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్



మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఓ పోలింగ్ కేంద్రం ముందు బారులు తీరిన ఓటర్లు

సాక్షి కరీంనగర్

శనివారం । 18 । నవంబర్ । 2023



దరఖాస్తులు అంతంతే..

ఉపకార వేతనాలకు దరఖాస్తులు నమోదు కావడం లేదు. రెండు నెలల్లో కనీసం 25శాతం అప్లికేషన్లు దాటలేదని చెబుతున్నారు. 10లో▸



క్రీడలతో భవిష్యత్‌కు బాటలు

క్రీడలతో భవిష్యత్‌కు బాటలు పడతాయని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్ అన్నారు. సిటీలో సీఎస్‌పీ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

కాంగ్రెస్ బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టుని

అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శలు చేసిన సీఎం కేసీఆర్

- 'గంగుల' మొండి మనిషి
- కౌశిక్‌కు మెజారిటీ ఇవ్వండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించండి
- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో గులాబీ శ్రేణుల్లో జోష్





జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్/హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/గంగాధర: రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ శుక్రవారం కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. పదేళ్లలో తాము చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శల వర్షం కురిపించారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో సీఎం ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఓ వైపు జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరిస్తూనే మరోవైపు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో, పదునైన మాటలతో ధ్వజమెత్తారు. 60 ఏళ్లు పరిపాలించిన ప్రతిపక్షాలు చేసిందేమీ లేదని, తాము పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కళ్లముందు పరుగులు పెడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని, అలాంటి పార్టీని జిల్లా ప్రజలు 2001లో జరిగిన సింహగర్జన సభ నుంచి అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. రాయేదో.. రత్నమేదో ఆలోచించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ మొండి మనిషి అని ఆయన హయాంలో తీగలవంతెన, మానేరు రివర్ ఫ్రంట్, స్మార్ట్‌సిటీ పనులతో కరీంనగర్ సుందరీకరణ, కూడళ్ల అభివృద్ధి పరుగులు పెడుతోందని కితాబిచ్చారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

34 నిమిషాలు ప్రసంగం...

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో 34 నిమిషాలు ప్రసంగించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి సభాప్రాంగణానికి 1.38 నిమిషాలకు చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి రథంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావు తదితరనేతలతో కలిసి 1.50నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు. మొదటగా కరీంనగర్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. సీఎం కేసీఆర్ సరిగ్గా 2.02 నిమిషాల నుంచి 2.36 నిమిషాల వరకు మాట్లాడారు. 2001లో సింహగర్జన సభను ఇదే వేదికగా నిర్వహించామని అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక విజయాలు సాధించామని, 50 ఏళ్ల కాంగ్రెస్ దరిద్రపు పాలనకు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు బేరీజు వేసుకుని బాగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ మధుసూధనచారి, కార్పొరేషన్ చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, కుర్మాచలం అనిల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



కరీంనగర్ నియోజకవర్గంలో రూ.వేలకోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటి పరంపర కొనసాగింపునకు మరోసారి ఆశీర్వదించి, గెలిపించండి. గతంలో కరీంనగర్ బొందలగడ్డగా ఉండేది. పదేళ్లల్లో రూ.వేలకోట్ల పనులతో రూపురేఖలు మారిపోయాయి. సీఎం కేసీఆర్‌కు జిల్లాపై అమితమైన ప్రేమ ఉంది. తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి సింహగర్జన బహిరంగసభ నుంచి ఇప్పటి వరకు జిల్లా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఢిల్లీ పాలకుల చేతుల్లో పెట్టొద్దు. జిల్లా ప్రజలు అభివృద్ధి వైపో.. విధ్వంసం వైపో తేల్చుకుని ఓటు వేయండి.
– గంగుల కమలాకర్, కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి



రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా

ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. కేసీఆర్ కాళ్లు పట్టుకోనైనా హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా. ఉప్పల్, చల్లూరు, వావిలాల మండలాల ఏర్పాటుకు కృషి చేస్తా. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే ప్రజలకు వెన్నుపోటు పొడిచి గజ్వేల్‌లో పోటీ చేస్తుండు. 15 ఏళ్లుగా ప్రజాసేవలోనే ఉన్నా. ఒక్కసారి అవకాశం ఇవ్వండి . అభివృద్ధి చేసి చూపిస్తా.
– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

కుక్కలు చింపిన విస్తరి అవుతుంది



తెలంగాణ తెచ్చాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. గోదావరి జలాలతో కోటి ఎకరాలకు సాగునీరు అందించి చూపిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. వందేళ్ల వరకు ప్రగతి పరుగులు పెట్టే విధంగా ప్రణాళికలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మితే తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కేసీఆర్‌కు అండగా గులాబీ జెండా ఉంది. మంత్రి గంగులను భారీ మెజార్టీతో గెలిపించాలి.
– బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

కొంగుపట్టి కోరుతున్నా

హుజూరాబాద్ నియోజకవర్గంలో 15 ఏళ్ల నుంచి ప్రజా సేవలోనే ఉన్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడప గడపకు చేరవేస్తున్నాం.కొంగు పట్టి కోరుతున్నా కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వెంటే నేను ఉంటా. – శాలిని, పాడి కౌశిక్‌రెడ్డి భార్య



సీఎం కేసీఆర్‌కు బొట్టు పెడుతున్న పాడికౌశిక్ కూతురు శ్రీనిక

డాడీకి ఒక్క చాన్స్ ఇవ్వండి

హుజూరాబాద్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌లా అభివృద్ధి చేయాలన్నదే మా డాడీ కల. మీ అందరికీ దండంపెట్టి కోరుతున్నా. డాడీకి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. డాడీ వెంట పడి హుజూరాబాద్ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు తెచ్చేలా చేస్తా.
– శ్రీనిక, కౌశిక్‌రెడ్డి కూతురు



కేసీఆర్‌కు గద అందిస్తున్న సునీల్‌రావు

న్యూస్‌రీల్

బస్సుల కోసం పాఠశాల విద్యార్థుల ఆందోళన



బస్టాండులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విద్యానగర్: ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల ప్రచారానికి, బహిరంగ సభలకు ప్రజలను తరలించడానికి ఆయా పార్టీలు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవడంతో.. ఉదయం పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగాలకు వెళ్లేవారు బస్సుల్లేక ఇబ్బంది పడ్డారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాల్లో కేసీఆర్ బహిరంగ సభలుండడంతో.. ఆ పార్టీ నాయకులు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. ఉదయం బస్సుల్లేక తిమ్మాపూర్ మండల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు కరీంనగర్ బస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆర్టీసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రతిరోజు ఇదే పరిస్థితి ఎదురవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. తిరుగు ప్రయాణంలో బస్సు పాసులున్నవారిని సిబ్బంది బస్సులోకి అనుమతించడం లేదని ఆరోపించారు. ఆర్టీసీ ఆర్ఎం వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బస్సును ఏర్పాటు చేయడంతో పాటు తిరుగు ప్రయాణంలో కూడా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామని, ఆయా రూట్లలో వచ్చే వారిని సిబ్బంది అనుమతించేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో అభివృద్ధి



నూతన ఉత్పత్తులను పరిశీలిస్తున్న గౌతమ్

జమ్మికుంట: వ్యవసాయంలో ప్రాముఖ్యత తెలుసుకొని విలువ ఆధారిత ఉత్పత్తులు, నూతన పద్ధతులు పాటిస్తే రైతులు అభివృద్ధి సాధించ వచ్చని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎస్.గౌతమ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని కేవీకేను సందర్శించారు. నూతన పద్ధతుల్లో దిగుబడులు సాధిస్తున్న ఉత్పత్తులను పరిశీలించి రైతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షేక్‌మీరా, కేవీకే ప్రధాన కార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి, డీఈ మహేందర్, డీఏవో శ్రీధర్, ప్రియదర్శిని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.6,850



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.6,850 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 139 వాహనాల్లో 1,439 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6,000 కాగా.. గన్నీ సంచుల్లో 23 మంది రైతులు 46 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,500, మోడల్ ధర రూ.6,300, కనిష్ఠ ధర రూ.5,500కు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో సీసీఐ 14 మంది రైతుల నుంచి 153.50 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,950, కనిష్ఠ ధర రూ.6,739 పలికింది. శని, ఆదివారాలు మార్కెట్ యార్డుకు సాధారణ సెలవులుంటాయని, సోమవారం మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు కొనసాగుతాయని కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ తెలిపారు.

బ్యాలెట్ యూనిట్‌పై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్: పోలింగ్ రోజు బ్యాలెట్ యూనిట్ల ద్వారా ఓటు వినియోగంపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గాల కోసం అదనపు బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో పవన్‌కుమార్ మాట్లాడుతూ.. అక్టోబర్ 20న నిర్వహించిన మొదటిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా 2,674 బ్యాలెట్ యూనిట్లు, 2,089 కంట్రోల్ యూనిట్లు, 2,054 వీవీప్యాట్లను కరీంనగర్ 390, చొప్పదండి 327, మానకొండూర్ 316, హుజూరాబాద్‌కు 305 చొప్పున పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. 15న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కరీంనగర్‌లో 27మంది, హుజూరాబాద్‌లో 22మంది, మానకొండూర్‌లో 10మంది, చొప్పదండిలో 14 మంది చొప్పున అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. ఒక్కో బ్యాలెట్‌కు 16మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందని, కరీంనగర్, హుజూరాబాద్‌లో అభ్యర్థులు అదనంగా ఉండడంతో నిల్వ ఉంచిన 1,003బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ నిర్వహించి కరీంనగర్‌కు 488, హుజూరాబాద్‌కు 382బ్యాలెట్ యూనిట్లు కేటాయించినట్లు వివరించారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం చేయాలి

నిజాయితీగా ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులకు ఓటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పమేలా సత్పతి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ప్రాధాన్యం గురించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ప్రజలకు వివరించాలని సూచించారు. భవిష్యత్‌లో ఓటుహక్కు పొందే విద్యార్థులు తర్వాతి ఎన్నికల్లో మంచి వాతావరణం ఏర్పాటు చేయడానికి దోహదపడతారని అన్నారు. జిల్లాలోని 100 కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. స్వీప్ నోడల్ అధికారి రామాచారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కట్టప్ప'లతో కలవరం!

- అన్ని పార్టీల్లో నేతలకు కోవర్టుల భయం
- వ్యూహాలు ప్రత్యర్థులకు చేరవేతలు
- ఎన్నికలు సమీపిస్తుండటంతో జోరుగా ఫిరాయింపులు
- రహస్య ఆపరేషన్లకు కొత్తగా చేరిన వారిని దూరం పెడుతున్న నేతలు



- ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ కౌన్సిలర్ ఒకరు పార్టీ మారుతున్నడనే సమాచారం కోవర్టుల ద్వారా తెలుసుకున్న సదరు నేత వెంటనే అప్రమత్తమై బుజ్జగించాడు.
- ఒక ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం కొంత దబ్బును రహస్యంగా కారులో హైదరాబాద్ నుంచి తన నియోజకవర్గానికి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. కోవర్టుతోనే సమాచారం లీకై నగదు పట్టుపడినట్లు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.
- మరో నియోజకవర్గ నేత తన సెగ్మెంట్ పరిధిలో దసరా కానుకగా డీజే సౌండ్ బాక్స్‌లు పంచిపెట్టాలనుకున్నారు. అలాగే తన పేరుతో గోడ గడియారాలు పంచి పెట్టడానికి లారీలో తరలిస్తుండగా పట్టుబడ్డాయి. ప్రత్యర్థుల పార్టీల్లోకి కోవర్టులను పంపి వారి సమాచారం సేకరించే సదరు నేతకు ఈసారి కోవర్టులతో రివర్స్ షాక్‌లు కొడుతున్నాయి. దీంతో ఎవరిని నమ్మాల్నో.. ఎవరికి ఏం చెప్పాల్నో అర్థమైతలేదని వాపోతున్నాడు.

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అన్ని పార్టీల్లో ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. దీంతో కొత్తగా వచ్చిచేరిన నేతలు లేదా పార్టీ మారకుండా అసంతృప్తిగా ఉన్న ఇంటిదొంగలు తమ వ్యూహాలు లీక్ చేస్తున్నారేమోనని పలువురు నేతలు సతమతమవుతున్నారు. సొంత శిబిరంలోని ఇలాంటి 'కట్టప్ప'లను పట్టుకోవడం ఎట్లా అని? వారు తలలు పట్టుకుంటున్నారు.

నేతలకు కోవర్టుల టెన్షన్..

- పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ కొలది నేతలకు కోవర్టుల టెన్షన్ పెరిగిపోతోంది.
- ఎన్నికల్లో విజయం సాధించాలంటే తాము ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తున్నామనేది ఎంతముఖ్యమో.. ప్రతిపక్ష పార్టీ నేతలు వేసే ఎత్తుగడలను ముందే పసిగట్టడం అంతే ముఖ్యంగా భావిస్తున్న నేతలు.. కోవర్టు అస్త్రాలు సంధిస్తున్నారు.
- ప్రత్యర్థి పార్టీల నేతలను తమ పార్టీలోకి లాక్కోవడంతోపాటు, తమ పార్టీలోని నేతలు ప్రత్యర్థి గూటికి చేరకుండా చూసుకోవడం ఇప్పుడు కత్తిమీద సాములా మారింది.
- దీంతో ప్రత్యర్థి పార్టీల్లో తమ అనుచరులను ఉంచేలా చూసుకుంటున్నారు.
- దానికోసం భారీగా ఆర్థిక సాయం అందించటంతోపాటు, ఎన్నికల అనంతరం పదవుల హామీతో ప్రత్యర్థి శిబిరంలోకి పంపుతున్నారు.
- ప్రజల నాడీ తెలియక తికమకపడుతున్నా నేతలకు, పార్టీలో మనస్ఫూర్తిగా పనిచేస్తున్న వారు ఎవరో, కట్టప్పలు ఎవరో తెలియక ఆందోళన చెందుతున్నారు.
- ఫిరాయింపు నేతలతోపాటు సొంతపార్టీల్లోనే అసమ్మతి నేతలను సైతం అనుమానిస్తూ, ఎవరిని నమ్మాలో తెలియక టెన్షన్ పడుతున్నారు.

గతంలో చేదు అనుభవాలతో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలానియోజకవర్గాల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులే మళ్లీ ఎన్నికల బరిలో తలపడుతున్నారు. తాయిలాలు, డబ్బు, పార్టీలో చేరికలు తదితర అంశాలను కోవర్టులు లీక్ చేయటంతోనే గతంలో తీవ్రంగా నష్టపోయారు. ఈసారి ఎన్నికల్లో కీలకమైన ఆర్థిక వ్యవహారాలు, పార్టీ ఫండ్ తదితర వివరాలను పార్టీ నేతలకు కాకుండా తమ బంధువులు, కుటుంబ సభ్యులే చూసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఓటర్లకు ఇచ్చే నజరానాలు, ఫండింగ్ ఇస్తున్నదెవరు? అనే అంశాలను తమ అనుచరులకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు. పార్టీ నేతలు, కీలక నేతలను కేవలం ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాల ఖరారు చేయడానికే పరిమితం చేస్తున్నారు. దీంతో కొందరు కార్యకర్తలు నొచ్చుకుంటున్నారు. అయినా, ఒక్కోసారి ఎంత జాగ్రత్త పడినా రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. ఇలా లీకేజీలకు పాల్పడుతున్న కోవర్టులు అన్ని పార్టీలకు దడపుట్టిస్తూ తలనొప్పిగా మారుతున్నారు.

మొదలైన ప్రలోభాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: సాధారణంగా ఎన్నికల ప్రచారం పూర్తయ్యాక తాయిలాలు పంపిణీ చేస్తారు. ద్విముఖ పోటీ ఉన్న స్థానాల్లో, ప్రజల్లో వ్యతిరేకత ఉన్న అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు ముందుగానే ప్రలోభాలకు తెరలేపుతున్నారు. యువతను ఆకట్టుకునేందుకు డీజే బాక్స్‌లు, ఇంటింటికీ తమ ఫొటోతో గోడగడియారాలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కుట్టుమెషిన్లు, కుక్కర్లు, కుంకుమ భరణిలు, మద్యం పెద్దఎత్తున దిగుమతి చేసుకుని సమీప గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. నిఘా బృందాల కళ్లు కప్పి నియోజకవర్గాలకు చేరవేస్తున్నారు. అనేక చెక్‌పోస్టులు ఉన్నా దాటుకుని హైదరాబాద్ నుంచి మంథని నియోజకవర్గానికి చేరిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఫొటోలతో కూడిన గడియారాల లారీ నే సజీవసాక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలంటున్నారు.



ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఫొటో ఉన్న గడియారం

సౌకర్యాలు కల్పించాలి

మానకొండూర్‌రూరల్: పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, బీఎల్‌వోలు, పంచాయతీ సెక్రటరీలు అందుబాటులో ఉండాలని జిల్లా పీడబ్ల్యూడీ నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రటరీలకు ఓటర్లకు కల్పించే సౌకర్యాలపై సమావేశం నిర్వహించారు. వృద్ధులు ఇంటి నుంచే ఓటు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. వికలాంగులకు పోలింగ్ బూత్‌ల వద్ద వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచాలని, పోలింగ్ బూత్‌లు సక్రమంగా ఉన్నాయో లేదో సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సబిత, ఎస్సీ కార్పొరేషన్ డీవో రాజేశ్వరి, ఏసీడీపీవో అరవింద, ఎంపీవో రాజేశ్వర్, బీఎల్‌వోలు, పంచాయతీ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంధ్యారాణి

క్లుప్తంగా

కళోత్సవ్‌ పోటీల్లో పారమిత విద్యార్థి ప్రతిభ



కొత్తపల్లి(కరీంనగర్‌): హైదరాబాద్‌లోని సీసీఆర్టీ(సెంటర్‌ ఫర్‌ కల్చరల్‌ రీసోర్స్‌ అండ్‌ ట్రైనింగ్‌)లో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 15, 16న జరిగిన రాష్ట్రస్థాయి కళోత్సవ్‌ పోటీల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి అప్పనగారి హరిశేషు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతి అందుకున్నట్లు విద్యాసంస్థల చైర్మన్‌ డా.ఇ.ప్రసాదరావు తెలిపారు. గాత్ర సంగీతం బాలుర విభాగంలో రెండో బహుమతిని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ దేవసేన చేతులమీదుగా అందుకున్నట్లు చెప్పారు. జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో పాటు రూ.1,000 నగదు అందజేశారన్నారు. హరిశేషు, గైడ్‌ టీచర్లు వడిగేపల్లి రంగాచార్యులు, జితుమణిశర్మను పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేశ్‌, వీయూఎం ప్రసాద్‌, వినోద్‌ రావు, ప్రధానోపాధ్యాయులు రితేష్‌ మెహతా, ప్రోగ్రాం హెడ్‌ గోపీకృష్ణ, సమన్వయకర్త రాము పాల్గొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్‌ మంతన్‌ పోటీలకు అల్ఫోర్స్‌ విద్యార్థులు



కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ–టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి విద్యార్థి విజ్ఞాన్‌ మంతన్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొల్ల సాయిహర్షిత్‌(6వ తరగతి), కె.సాయిఆశ్రిత్‌(7వతరగతి)కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌, వైజ్ఞానిక శాస్త్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తులు అంతంతే..

- రెండు నెలలవుతున్నా పావువంతు నమోదు కాలె..
- డిసెంబర్‌ 31 వరకు గడువు
- కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసిన సంక్షేమ శాఖ అధికారులు



కరీంనగర్‌: బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం స్కాలర్‌షిప్స్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ మంజూరు చేస్తోంది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించి రెండు నెలలు గడుస్తున్నా.. 25 శాతం మంది విద్యార్థులు కూడా ముందుకు రాలేదని సంక్షేమ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. గడువు ఇచ్చినా ప్రస్తుత విద్యాసంవత్సరం దరఖాస్తులు అంతంతమాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం డిసెంబర్‌ 31 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడగిస్తూ నిర్ణయం తీసుకుంది. వివిధ అభివృద్ధి శాఖల పరిధిలో రెన్యూవల్స్‌ కోసం 55 శాతం మంది దరఖాస్తులు చేసినట్లు సమాచారం. ఫ్రెషర్స్‌ విభాగంలో మూడు సంక్షేమ శాఖల్లో కేవలం 7వేల మంది మాత్రమే దాఖలు చేయడం గమనార్హం. పెంచిన గడువులోపైనా అవాంతరాలు తొలగించి పూర్తిస్థాయిలో దరఖాస్తులు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

స్పందన లేదు..

ఇంటర్‌ ఆపై తరగతులు, వృత్తి విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులు ఉపకార వేతనాలు, బోధనా రుసుముల మంజూరు కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల యాజమాన్యాలకు ఉత్తర్వులు జారీ చేశారు. అయినా విద్యార్థుల నుంచి ఆశించిన మేర స్పందన రాలేదు. ఈపాస్‌ సైట్‌లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తక్కువగా ఉంటోంది. దీంతో ప్రభుత్వం దరఖాస్తు గడువును 2023 డిసెంబర్‌ 31 వరకు పొడిగించింది. గతేడాది దరఖాస్తు చేసుకున్న 18,085 మంది విద్యార్థులు రెన్యూవల్‌ చేసుకోవాల్సి ఉంది. వారిలో ఇప్పటివరకు 11,284 మంది మాత్రమే చేసుకున్నారు. ఫ్రెష్‌ విభాగంలో 4శాఖల నుంచి కేవలం 7వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులే వెల్లడించడం గమనార్హం.

కారణాలివే..

2023–24 విద్యాసంవత్సరంలో ఈపాస్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసే విద్యార్థులకు కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆధార్‌ కార్డులో ఉన్న పేరులో చిన్నచిన్న అక్షర దోషాలు ఉండడంతో.. సైట్‌ దాన్ని స్వీకరించడం లేదు. రెన్యూవల్‌ విద్యార్థులకు ఇప్పటివరకు వార్షిక పరీక్షలు పూర్తి కాలేదు. దాంతో వారి ఉత్తీర్ణత మెమో అప్‌లోడ్‌ కాలేదు. వీటితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పూర్తిస్థాయిలో బ్యాంకు ఖాతాలు కలిగి ఉండకపోవడం, పదోతరగతి మెమోలు ఆన్‌లైన్‌ చేయకపోవడం, కళాశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం, దరఖాస్తు గడువు పొడిగిస్తారనే ఉదాసీనత తోడయ్యాయి. మరోవైపు ఆయా సంక్షేమ శాఖలు కూడా విద్యార్థులను చైతన్యం చేయడంలో కొంత విఫలమయ్యాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు సంక్షేమ శాఖల అధికారులు కళాశాల యాజమాన్యాలకు పలు సూచనలు జారీ చేస్తూ నోటీసులు అందజేసినట్లు సమాచారం. మరో 40 రోజుల్లో గడువు ముగుస్తుండడంతో.. విద్యార్థులు ఉపకార వేతనాల దరఖాస్తులను అందించడం గగనమేనని, కళాశాల యాజమాన్యాలు చొరవ తీసుకుంటే సాధ్యమవుతుందనే అభిప్రాయాలున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



స్కాలర్‌షిప్స్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ కోసం దరఖాస్తు గడువును డిసెంబర్‌ 31 వరకు ప్రభుత్వం పెంచింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలి. దరఖాస్తుల సంఖ్యను పెంచేందుకు ఇప్పటికే కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లకు లేఖలు రాశాం. సమావేశాలు నిర్వహించి చెప్పాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు దరఖాస్తులు సమర్పించే విషయంలో అలసత్వం ఉండొద్దు.

– నేతానియల్‌, ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి

క్రీడలతో భవిష్యత్తుకు బాటలు




బెలూన్లను ఎగరేసి క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం, విద్యార్థుల మార్చ్‌ పాస్ట్‌

- శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ ఎం.వరప్రసాద్‌
- ఘనంగా ప్రారంభమైన సీఎస్‌ఏ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



100 మీటర్ల విజేతలకు పతకాలను ప్రదానం చేసిన అతిథులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: విద్యార్థులకు క్రమశిక్షణను అందించి ఉత్తమమైన జీవనాన్ని ప్రసాదించేవి క్రీడలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎం.వరప్రసాద్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్‌ జాన్స్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం నిర్వహించిన 18వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎస్‌ఏ క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి రంగురంగుల బెలూన్లను ఎగరేసి ప్రారంభించారు. నేను కూడా ఈ పాఠశాలలో చదువుకోవడం గర్వంగా ఉందని, ఈ పాఠశాల విద్యార్థిగా, ఫుట్‌బాల్‌ క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. పోటీల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు, పాఠశాల ప్రిన్సిపాల్‌ సిస్టర్‌ పి.ఇన్నాలు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి సీఎస్‌ఏ పోటీలను 6వసారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులకు మూడు రోజులపాటు ఉచిత భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని అన్నారు. అతిథి సీఎస్‌ఏ కన్వీనర్‌ సిస్టర్‌ కొమనపల్లి మార్గరెట్‌ మాట్లాడుతూ.. రాణించే క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు, ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. సెయింట్‌ జాన్స్‌ స్కూల్స్‌ సుపీరియర్‌ జనరల్‌ సిస్టర్‌ వట్టి జపమాల మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలోని 18 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు మార్చ్‌ పాస్ట్‌ నిర్వహించి అతిథులకు క్రీడావందనాన్ని సమర్పించారు. సీఎస్‌ఏ ఎడ్యుకేషనల్‌ కౌన్సిలర్‌ సిస్టర్‌ వేలాంగణి, సెంటెన్స్‌ పాఠశాల సుపీరియర్‌ కరస్పాండెంట్‌ సిస్టర్‌ జి.నక్షత్రం, ప్రైమరీ పాఠశాల ఇన్‌చార్జి సిస్టర్‌ పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్‌ కేవీ త్రినాథ్‌ రెడ్డి, బద్రుద్దీన్‌ కీమాని, డాక్టర్‌ మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, సర్వమత ప్రార్థనలు అలరించాయి.

అమ్మా.. వైద్యసేవలు ఎలా ఉన్నాయి..

- ఉదయం 9గంటల నుంచే ఓపీ సేవలు అందాలి
- బయోమెట్రిక్‌తో హాజరు నమోదు చేయండి
- కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ ఆదేశాలు



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్‌

పెద్దపల్లిరూరల్‌: 'అమ్మా.. వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.. వైద్యులు, సిబ్బంది పనితీరు ఎలా ఉంది?' అని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ పేషెంట్లతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు బ్లాకులను పరిశీలించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, బయోమెట్రిక్‌ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని సూపరింటెండెంట్‌ రమాకాంత్‌ను ఆదేశించారు. ఉదయం 9గంటల నుంచే ఓపీ సేవలు మొదలు కావాలన్నారు. తొలికాన్పుకు వచ్చే వారికి సాధారణ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆప్తమాలజీ ఆపరేషన్‌ థియేటర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డాక్టర్‌ శౌరయ్య తదితరులు ఉన్నారు.

ప్రాథమిక స్థాయినుంచే మెరుగైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్‌కు ధీటుగా సౌకర్యాలను కల్పిస్తున్నామని, అదే రీతిన బోధన అందించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ అన్నారు. బందంపల్లి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. పెండింగ్‌ పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

బస్సుల్లేక విద్యార్థుల అవస్థలు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్‌: ఖని బస్టాండ్‌లో శుక్రవారం ఆర్టీసీ బస్సుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామగుండం లింగాపూర్‌ ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు రోజూ 2బస్సులు నడుపుతారు. కానీ శుక్రవారం ఒక్క బస్సే నడపడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అసహనంతో బస్టాండ్‌ ఎదుట గల రాజీవ్‌ రహదారిపైకి వచ్చి నిరసనను తెలిపారు. విద్యార్థుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. డిపో మేనేజర్‌ నాగభూషణం మాట్లాడుతూ, బస్సుల కొరతతో ఒకే బస్సు నడిపంచామన్నారు. ఆలస్యంగానైనా రెండు ట్రిప్పులు నడిపించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించామని తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌ ప్రాంతానికి చెందిన కొక్కుల గంగాధర్‌, కొక్కుల శశికుమార్‌, కొక్కుల అన్నపూర్ణ, కొక్కుల లక్ష్మీబాయిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్‌ తెలిపారు. పద్మనగర్‌కు చెందిన నిమిషకవి శ్రీరామ్‌ అదే ప్రాంతానికి చెందిన కొక్కుల గంగాధర్‌ ఇంటికి బుధవారం అర్ధరాత్రి వెళ్లాడు. ఇంట్లో ఉన్న గంగాధర్‌తో పాటు, అతని కుమారుడు శశికుమార్‌, భార్య అన్నపూర్ణ, తల్లి లక్ష్మీబాయిపై స్క్రూ డ్రైవర్‌తో పాటు, కత్తితో దాడిచేయగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. గంగాధర్‌ ఫిర్యాదు మేరకు శ్రీరామ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పేర్కొన్నారు.

అడ్డుకోవడం సరికాదు



పోలీసుల అదుపులో నాయకులు

హుజూరాబాద్‌రూరల్‌: రాజ్యాంగం ప్రకారం అనుమతులు పొంది సభను నిర్వహించుకునే బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ద్వారా తమ గోడును వెల్లబోసుకుందామని వెళ్లే జిల్లా సాధన సమితి నాయకులను పోలీసులతో అడ్డగించడం సరికాదని జేఏసీ కమిటీ చైర్మన్‌ ఆవునూరి సమ్మయ్య, తెలంగాణ జన సమితి పార్టీ ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, డెమోక్రటిక్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర ఆడిట్‌ కమిటీ కన్వీనర్‌ పల్కల ఈశ్వర్‌రెడ్డి, సేవ్‌ డెమోక్రసీ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరి రమేశ్‌ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలో బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ వస్తున్నారన్న నేపథ్యంలో జిల్లా సాధన సమితి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా సాధన కోసం ఈ ప్రాంత ప్రజలు 2016 నుంచి అనేక ఉద్యమాలను ప్రజాస్వామిక పద్ధతిలో చేస్తున్నారని తెలిపారు.

హాకీ టోర్నమెంట్‌లో విజయం

హుజూరాబాద్‌రూరల్‌: హుజూరాబాద్‌ పట్టణా నికి చెందిన మాటూరి రాజ్‌కుమార్‌ నేతృత్వంలో భువనేశ్వర్‌లో జరిగిన ఆల్‌ ఇండియా సివిల్‌ సర్వీసెస్‌ హాకీ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున క్రీడాకారులు విజయం సాధించారు. రాజ్‌కుమార్‌ నాయకత్వంలో గెలవడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లు దగ్ధం

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): స్థానిక మార్కండేయ కాలనీకి చెందిన వనపర్తి గోవిందమ్మ ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం అయ్యింది. నగదు, దుస్తులు, సర్టిఫికెట్లు కాలిపోయాయి. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు తెలిపారు. నాయకులు బోయిని రాజేందర్‌, చింతల అర్జున్‌, దేవా, నాగరాజు, మోహన్‌ బాబు బాధితకుటుంబాన్ని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో మైనర్‌ బాలుడి దుర్మరణం



సిద్ధార్థ(ఫైల్‌)

జమ్మికుంట: రోడ్డు ప్రమాదంలో ఓ మైనర్‌ బాలుడు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పట్టణ ఎస్సై రాజేశ్‌ వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి మున్సిపల్‌ పరిధి కొత్తపల్లికి చెందిన అకుల సిద్ధార్థ(సిద్దు) అనే మైనర్‌ బాలుడు(15), పట్టణంలోని ఎంప్లాయీస్‌ కాలనీకి చెందిన ఎండీ గౌస్‌ ఇద్దరు కలిసి మోత్కులగూడెం నుంచి బైక్‌పై వస్తున్నారు. జమ్మికుంట పట్టణంలోని ఫ్లైఓవర్‌ బ్రిడ్జిపై మినీ వ్యాన్‌(ట్రాలీ) బైక్‌ను ఢీకొట్టగా.. సిద్ధార్థ తలకు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ నడుపుతున్న ఎండీ గౌస్‌ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి ఆకుల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరికి గాయాలు



తిమ్మాపూర్‌: నుస్తులాపూర్‌ వైన్స్‌ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పొలంపల్లి గ్రామానికి చెందిన పడాల కొమురయ్య తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం నుస్తులాపూర్‌కు వెళ్లాడు. తిరిగి పొలంపల్లి వెళ్లే క్రమంలో గ్రామ శివారులోని వైన్స్‌ వద్ద నల్లగొండ గ్రామానికి చెందిన మార్క రాజయ్య రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. అదుపుతప్పి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరి పరిస్థితి విషమం



మోహన్‌ (ఫైల్‌)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్‌ రోడ్‌లో విద్యుత్‌ కార్యాలయం ఎదుట శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. సారంగాపూర్‌ మండలం నాగునూర్‌ గ్రామానికి చెందిన జంగ మోహన్‌(60), జంగ మహేశ్‌ ద్విచక్ర వాహనంపై నూకపల్లిలోని మహేశ్‌ భార్య గౌతమి, ఇద్దరు కుమారులను తీసుకువచ్చేందుకు బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్‌ కార్యాలయం ఎదుట టిప్పర్‌ ఢీకొనడంతో మోహన్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. మహేశ్‌ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జంగ పద్మ ఫిర్యాదు మేరకు టిప్పర్‌ డ్రైవర్‌ సారంగాపూర్‌ మండలం రంగపేట గ్రామానికి చెందిన బోదాసు సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్‌ తెలిపారు. కాగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో మోహన్‌ మృతదేహాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

లారీ ఢీకొని ధాన్యం ట్రాక్టర్‌ బోల్తా



రోడ్డుపై ధాన్యం బస్తాలు

తిమ్మాపూర్‌: నుస్తులాపూర్‌ రాజీవ్‌ రహదారిపై నుస్తులాపూర్‌ నుంచి కరీంనగర్‌ వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను అదే దారిలో వెళ్తున్న లారీ ఢీకొంది. ట్రాక్టర్‌ బోల్తా పడగా.. రోడ్డు మీద ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. స్థానికులు పోలీసులకు సమాచారమందించడంతో.. అక్కడకి చేరుకొని ట్రాఫిక్‌ నియంత్రించారు. ట్రాక్టర్‌ శంకరపట్నం మండలం నుంచి అలుగునూర్‌ వెళ్తున్నట్లు ట్రాక్టర్‌ డ్రైవర్‌ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో పరిశీలిస్తున్న ఏఎస్సై

గన్నేరువరం: గన్నేరువరంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ పోచమ్మ ఆలయ సమీపంలో పెద్దమ్మ ఆలయముంది. ఎప్పటిలాగే ఆలయ పూజారి సమ్మయ్య శుక్రవారం ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజలు చేయడానికి ఆలయం శుభ్రం చేస్తున్న క్రమంలో ఆలయ తలుపుల తాళం ధ్వంసమై ఉండడంతో.. స్థానికులు, పోలీసులకు సమాచారమందించారు. ఏఎస్సై లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్‌ సతీష్‌ సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను సేకరించడానికి క్లూస్‌ టీంను రప్పించారు. ధ్వంసమైన తాళంతో పాటు తలుపులు, ఆలయ హుండీ, పెద్దమ్మ తల్లి విగ్రహం వద్ద ఆనవాళ్లు సేకరించారు. పెద్దమ్మ తల్లి విగ్రహంపై ఉన్న పుస్తెలు, ముక్కుపుడక, నక్లెస్‌ మొత్తం రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు బోయిని పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌ రూరల్‌: గట్టెపల్లి గ్రామాభివృద్ధి పేరిట ఇసుక లారీల నుంచి వసూలు చేస్తున్న నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తు ఆ గ్రామస్తులు శుక్రవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ సుల్తానాబాద్‌ మండలం గట్టెపల్లి వాగులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారని, దానినుంచి లారీల ద్వారా ఇసుక తరలిస్తుండగా గ్రామాభివృద్ధి కమిటీ పేరిట రసీదు బుక్కులు ప్రజాప్రతినిధులు తయారు చేసి ఒక్కో లారీకి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. నీ డబ్బును గ్రామపంచాయతీ ద్వారా గ్రామాభివృద్ధికి మాత్రమే వినియోగిస్తామని చెప్పినా.. ఆ పనులు చేయడం లేదని ఆరోపించారు. ఈ నిధులపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా లారీల నుంచి గ్రామ పంచాయతీ ఎలాంటి డబ్బులు వసూలుచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శీలం శంకర్‌, మాజీ సర్పంచ్‌ రాజమౌళి, గ్రామస్తులు రాజారాం, గుర్రం శ్రీనివాస్‌, మధుకర్‌, సంతోష్‌, గౌస్‌, కొడెం శ్రీనివాస్‌, రమణ పాల్గొన్నారు.

102 మంది బైండోవర్‌

జ్యోతినగర్‌(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 102 మందిని బైండోవర్‌ చేసినట్లు ఎస్సై జీవన్‌ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల నిర్వహణలో భాగంగా రోజువారీ తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎక్సైజ్‌ విభాగంలో 14 కేసుల్లో రూ.96,656 విలువైన మద్యం, రెండు కేసుల్లో ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.54,50,670 నగదు, 27 కేజీల వెండి స్వాధీనం చేసుకుని రిటర్నింగ్‌ అధికారి కార్యాలయంలో అప్పగించామన్నారు. 102 మంది బైండోవర్‌లో 16 మంది రౌడీషీటర్లు ఉన్నారని, మరికొన్ని కేసుల్లో ఇంకొందరిని బైండోవర్‌ చేస్తామన్నారు.

'దళితులను మోసం చేసిన కాంగ్రెస్‌'



మాట్లాడుతున్న చిలుక ప్రసాద్‌

రామగుండం:దళితులు, బహుజనులు, అణగారిన వర్గాలను కాంగ్రెస్‌ పార్టీ ఆర్థికంగా అణచివేసిందని దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్‌ ఆరోపించారు. అంతర్గాం ప్రెస్‌ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ సర్కార్‌ దళితులను ఓటు బ్యాంకుగానే పరిగణించిందని విమర్శించారు. ఒక్క అవకాశం పేరిట కర్ణాటకలో కాంగ్రెస్‌ 24 గంటల విద్యుత్‌, రూ.రెండు వేల పింఛన్‌ హామీలతో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అన్నింటా విఫలమైన విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు గడమండ శ్రీహరి, కనుకుంట్ల రమేశ్‌, మామిడిపెల్లి శ్రీనివాస్‌, రొడ్డ సంపత్‌, మాతంగి శివరాజ్‌ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



రామగిరి(మంథని): ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎంల పనితీరుపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని మంథని ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి హనుమా నాయక్‌ అన్నారు. జేఎన్టీయూలో చేపట్టి శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. శిక్షణ పొందిన పీవో, ఏపీవో లు పోలింగ్‌ కేంద్రాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సందేహాలు ఉంటే మాస్టర్‌ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.





భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

నగరంలోని పలు ఆలయాల్లో పుట్టలున్న ప్రాంతాల్లో శుక్రవారం నాగులచవితి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీపురం, కోర్టు వద్ద గల పుట్టలో మహిళలు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నవగ్రహాలు, పుట్టలున్న ఆలయాల్లో జనం సందడి కనిపించింది. అంజనాద్రి, మహాశక్తి, రామేశ్వర, గౌరీశంకర, గిద్దె పెరుమాళ్లు, భవానీశంకర, యజ్ఞవరాహస్వామి ఆలయాల్లో నాగేంద్ర స్వామికి, నవగ్రహాలకు పూజలు, అభిషేకాలు జరిపారు. - కరీంనగర్ కల్చరల్

ప్రజల కోసం పోరాడి జైలుకెళ్లా..

- భూకబ్జాలు.. గుట్టలు మాయం చేయలె
- ఎంపీ, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: నేను అవినీతిపరుడినట.. నా దగ్గర డబ్బు సంచులున్నయట.. అందుకే అధ్యక్ష పదవి నుంచి నన్ను తీసేశారట.. నేనేమన్నా ఆయన లెక్క మంత్రినా? అధికారంలో ఉన్నామా? నీ లెక్క భూకబ్జాలు చేశానా? గుట్టలను మాయం చేశానా? భూములు కబ్జా చేసి కమీషన్లు తీసుకున్నానా? నేనెట్లా అవినీతికి పాల్పడుతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణలోనే అత్యంత అవినీతిపరుడైన మంత్రి గంగుల కమలాకర్‌కు తనను విమర్శించే నైతికహక్కు లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 22, 23, 24 డివిజన్లతో పాటు కరీంనగర్ మండలం చామనపల్లిలో ప్రచారం నిర్వహించారు. చామనపల్లికి వచ్చిన సంజయ్‌కు యువకులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంజయ్ మాట్లాడుతూ.. నన్ను ఎంపీగా గెలిపిస్తే ప్రజల కోసం కొట్లాడితే సీఎం కేసీఆర్ 74 కేసులు పెట్టించి జైలుకు పంపించాడన్నారు. పదేళ్ల నుంచి తీగలగుట్టపల్లి ఆర్వోబీని పట్టించుకోని మంత్రి గంగుల కమలాకర్, నిధులు తీసుకొచ్చిన తనకు తెలియకుండానే కొబ్బరికాయ కొట్టి తానే తెచ్చినట్లు ప్రచారం చేసుకున్నాడని విమర్శించారు. నేను చామనపల్లికి రాలేదంటున్న కమలాకర్‌కు అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఓదార్చి ప్రభుత్వంతో కొట్లాడిన విషయం గుర్తు లేదా? అని ప్రశ్నించారు. పంటలకు నష్టపరిహారం సీఎం కేసీఆర్ నుంచి రైతులకు ఎందుకు ఇప్పించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రిగా ఉండి కొత్తగా ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, గంగుల ఓడిపోవడం ఖాయమని అన్నారు. తెలంగాణలోనే అత్యంత అవినీతిపరుడైన గంగుల కమలాకర్‌కు సీఎం కేసీఆర్ బీఫామ్ ఇవ్వకుండా సతాయించి, కరీంనగర్‌కే పరిమితం చేసిండని అన్నారు. నేను అవినీతికి పాల్పడితే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వరని, హెలిక్యాప్టర్ ఇచ్చి రాష్ట్రమంతా ప్రచారం చేయాలని పంపారని తెలిపారు. ఓటమి భయంతో కమలాకర్ కార్యకర్తలకు లక్ష సెల్‌ఫోన్లు, ఓటుకు రూ.10వేలు ఇచ్చి గెలవాలని చూస్తున్నాడని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను పరిశీలించి మీ కోసం కొట్లాడి జైలుకెళ్లిన తనకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంద్ర నళిని, ఎం.సంతోష్‌కుమార్, ఎం.కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్, హాజరైన ప్రజలు

నాగులమల్యాలలో బీజేపీ ఇంటింటి ప్రచారం

కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు. కొత్తపల్లి మండల ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రంజిత్, నాయకులు రమేశ్, అంజన్‌కుమార్, కరుణాకర్, రవీందర్, గంగారాజు, అనిల్, శ్రీనివాస్, ప్రసాదరావు తదితరులు ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటేసి మచ్చలేని అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



బండి సంజయ్‌ను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ కార్యకర్తలు

బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్ పెంట సత్యనారాయణ

కరీంనగర్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ నాయకుడు పెంట సత్యనారాయణ శుక్రవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. తన అనుచరులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎంపీ కార్యాలయానికి వచ్చిన పెంట సత్యనారాయణను బండి సంజయ్ సాదరంగా ఆహ్వానించారు. ఆయనతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు మంచిర్యాల జిల్లాకు చెందిన వివిధ పార్టీలకు నాయకులు పలువురు కరీంనగర్‌కు వచ్చి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరారు. బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అలంకారప్రాయమేనా..!





టవర్‌సర్కిల్‌లో వెలగని స్ట్రీట్ లైట్లు

- టవర్‌సర్కిల్ వద్ద వెలగని స్మార్ట్ స్ట్రీట్ లైట్లు
- హౌసింగ్‌బోర్డులో ప్రారంభం కాని వైనం

కరీంనగర్ కార్పొరేషన్: నగరానికి వాణిజ్య కేంద్రమైన టవర్‌సర్కిల్ వద్ద స్మార్ట్ స్ట్రీట్ లైట్లు అలంకారప్రాయంగా మిగిలాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో వీధిదీపాలు వెలగడం లేదు. స్మార్ట్ సిటీలో భాగంగా ఏడాదిక్రితం నగరంలోని ప్రధాన వీధుల వెంట స్మార్ట్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశారు. ముందుగా కలెక్టరేట్ రోడ్‌లో ఏర్పాటు చేయగా, ఆ తర్వాత నగరంలోని ఇతర ప్రధాన రహదారులు, పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా టవర్‌సర్కిల్ ప్రాంతంలోనూ ఏర్పాటు చేసి ఆరు నెలల క్రితం ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ లైట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే సాగుతోంది. ఈ క్రమంలో 45 రోజులు నుంచి లైట్లు వెలగడం లేదు. కేబుల్ సమస్య కారణంగానే ఈ లైట్లు వెలగడం లేదని అధికారులు నిర్ధారించారు. లైట్ల సామర్థ్యానికి తగిన విధంగా కేబుల్ లేకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తేలగా, కనీసం లైట్ల సామర్థ్యం కూడా చూడకుండా కేబుల్ ఎలా వేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలో చేపడుతున్న పనుల్లో చాలాచోట్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఈ జాబితాలో తాజాగా స్ట్రీట్ లైట్లు కూడా చేరడం విశేషం. నగరానికి ప్రధాన ఆకర్షణగా ఉండే టవర్‌సర్కిల్ వద్దనే స్ట్రీట్‌లైట్లు వెలగకపోతే మిగతా ప్రాంతాల్లో వాటి నిర్వహణ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించొచ్చు.

హౌసింగ్ బోర్డులో ప్రారంభం కాని లైట్లు

స్మార్ట్‌సిటీలో భాగంగా మోడల్ కాలనీగా అభివృద్ధి చేసిన హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇప్పటివరకు స్మార్ట్ స్ట్రీట్ లైట్లు ప్రారంభం కాలేదు. కాలనీవ్యాప్తంగా దాదాపు 200 వరకు లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, వాటికి బాక్స్‌లు కూడా అమర్చారు. ఇప్పటి వరకు విద్యుత్‌కనెక్షన్ ఇవ్వకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. స్మార్ట్ స్ట్రీట్ లైట్ల కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలనే ట్రాన్స్‌కో సూచన మేరకు పెండింగ్ పడ్డట్లు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో, సంవత్సర కాలంగా అవి అలంకారప్రాయంగా మిగిలాయి.

ఇప్పటికైనా టవర్‌సర్కిల్‌లో స్మార్ట్ స్ట్రీట్ లైట్ల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని, హౌసింగ్ బోర్డుకాలనీలో లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త కేబుల్ వేస్తున్నాం

టవర్‌సర్కిల్‌లో స్మార్ట్ స్ట్రీట్ లైట్లకు కొత్త కేబుల్ వేస్తున్నాం. పాత కేబుల్ స్థానంలో కొత్త కేబుల్ వేసే పనులు కొనసాగుతున్నాయి. వారం పదిరోజుల్లో పనులు పూర్తి చేసి స్ట్రీట్ లైట్లు వెలిగిస్తాం.

– గఫూర్, ఏఈ, నగరపాలక సంస్థ

చిత్ర కథ: బడిలో క్రీడాప్రాంగణం



గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతీ ఊరిలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. అయితే కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ స్థలా లు అందుబాటులో లేకపోవడంతో అధికారులు పాఠశాలల్లోనే క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. దుబ్బపల్లి, ఫకీర్‌పేట, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసి యువకులు వ్యాయామం చేసేందుకు వీలుగా పరికరాలను అమర్చారు. - కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

ఘనంగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న మేయర్, నాయకులు

కరీంనగర్: మాజీ రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి,, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అమరావతి సలీం ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణచౌక్‌లో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మేయర్ సునీల్ రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌లు హాజరై కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థి చదువుకు కరీంనగర్‌కు చెందిన సైహాన్‌సింగ్‌కు అమరావతి సలీం అందించిన ఆర్థిక సాయం రూ.51,000ల చెక్కును అందజేశారు. ప్రధాన ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గోపాల్‌రావు, కార్పొరేటర్లు అశోక్‌రావు, సరిల్ల ప్రసాద్‌తో పాటు మహేందర్, మహమూద్, రాజు, మోనిత స్టాలిన్, చిన్న, గుండ గుణనిధి, కె. ధర్మేందర్, ఇలియాస్, శివదీప్, ప్రద్యూమ్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మానకొండూర్‌రూరల్: అభయ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఉచిత కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ అరుణప్రభంజన్ తెలిపారు. ఔత్సాహికులు 9640789108 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కుట్టుశిక్షణ తరగతులు నిర్వహించి 200 మందికి కుట్టుయంతారలు పంపిణీ చేశామన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఆగని అక్రమ నిర్మాణాలు

- కమాన్‌పూర్‌లో జోరుగా కట్టడాలు
- ఎన్నికల వేళ.. అక్రమాల దందా
- కబ్జా కోరల్లో విలువైన ప్రభుత్వ భూమి
- పట్టించుకోని అధికారులు



కమాన్‌పూర్‌లోని అసైన్డ్ భూమిలో నిర్మిస్తున్న కట్టడాలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 120, 123లోని ‘తూంకుంట’లో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. అధికారుల సమన్వయం లోపం అక్రమార్కులకు వరంగా మారింది. ఒక్క చిన్న పశువుల పాకతో ప్రారంభమైన ఆక్రమణలు ప్రస్తుతం భవంతుల నిర్మాణాల వరకు చేరుకున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ తహసీల్దార్ ‘మామూలు’గా తీసుకోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. రాజకీయ ఒత్తిళ్లతో తదనంతరం వచ్చిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో జోరుగా అక్రమ నిర్మాణాలు సాగాయి. ఇక ఇప్పుడైతే అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా సందిట్లో సడేమియాలాగా మళ్లీ నిర్మాణాలు జోరందుకున్నా యి. ఇదే తూంకుంటలోని అక్రమ నిర్మాణాలను గతంలో ఓ తహసీల్దార్ కూల్చివేయడంతో పాటు అందులో వేసిన బోరుబావిని, ఆ స్థలంలో మట్టి నింపుతున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అయితే ఇదే స్థలంలో మళ్లీ నిర్మాణాలు సాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది. చట్టప్రకారం ఒక తహసీల్దార్ చ ర్యలకు ఉపక్రమిస్తే.. తదనంతరం తహసీల్దార్లు అదే చట్టాన్ని అనుసరించాలి. కానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం కళ్లుండి చూడలేని దుస్థితిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పనిచేసే పంచాయతీ వ్యవస్థ అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారనే నిందను మోస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రూపాయల విలువైన అసైన్డ్ భూమిని కాపాడటంలో అధికారులు విఫలమయ్యారని స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని అధికారులు బుట్టదాఖలు చేస్తుండటంపై గ్రామస్తుల్లో సందేహాలు నెలకొన్నాయి. అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కొంతమంది ఫిర్యాదులు చేసి అసహనానికి లోనయ్యారే తప్ప అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కుల హవా ఏ విధంగా నడుస్తుందో చెప్పవచ్చు. ఈ తూంకుంటలో అక్రమ నిర్మాణాలు వెలిసాయని నీటి పారుదల శాఖ అధికారులు సైతం గతంలోనే తేల్చినప్పటికీ రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అనధికార నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన నోటీసు

అధికారుల సమన్వయం లోపం.. అక్రమార్కులకు వరం

కరీంనగర్–వేములవాడ ప్రధాన రహదారి పక్కనున్న అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ భూమిపై రెవెన్యూ అధికారులు తేల్చాలని పంచాయతీ అధికారులు.. లేదు లేదు అనుమతిలేని అక్రమ నిర్మాణాలు ఆపాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనంటూ రెవెన్యూ అధికారులు ఒకరిపై మరొకరు గతంలో దాటవేసే ధోరణిని అవలంబించడంతోనే అక్రమ నిర్మాణాల జోరు కొనసాగింది. అదికాస్త ప్రస్తుతం కొనసాగుతోంది. కరీంనగర్‌కు కూతవేటు దూరంలో ఉండటం వల్ల భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు విలువైన భూమిని కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

నోటీసులిచ్చాం

కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని తూంకుంటలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు ఎలాంటి పంచాయతీ అనుమతుల్లేవు. సెలవు దినాలను చూసుకొని నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై తగిన డాక్యుమెంట్లు సమర్పించాలని కోరుతూ నోటీసులిచ్చా. ఈ నిర్మాణాలను ఎంపీవో దృష్టికి తీసుకెళ్లా. తూకుంటలోని ఏ ఒక్క కట్టడానికి కూడా పంచాయతీ అనుమతి లేదు.

– నరేశ్, పంచాయతీ కార్యదర్శి, కమాన్‌పూర్

ఇంటి వద్దే ఓటింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ నవీన్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దనే ఓటింగ్ చేసే విధానంపై బీఎల్‌వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారి, తహసీల్దార్ నవీన్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఇప్పటికే అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి పోస్టల్‌బ్యాలెట్ పత్రాలను అందజేశామన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీ రోజున దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారందరినీ అందుబాటులో ఉండేలా బీఎల్‌వోలు చూడాలన్నారు. ఓటర్లందరికీ పోల్‌చిట్టీలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి సరస్వతి, సీడీపీవో ఉమారాణి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని ఆంగ్ల భాష ఉపాధ్యాయులకు శుక్రవారం తొలిమెట్టుపై అవగాహన కల్పించారు. జిల్లా పరిశీలకులు వినయధర్‌రాజు, సరిత, ఎంఈవో విడుపు శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టుపై తెలుసుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రణాళికలను సిద్ధం చేసుకొని రాబోయే రోజుల్లో పరిశీలకులు సందర్శనకు వచ్చినప్పుడు రికార్డులు చూపాలని అన్నారు. ప్రగతిని విశ్లేషణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్లు ఆకుల సదానందం, మిడిదొడ్డి మిడిదొడ్డి సమ్మయ్య, మండల నోడల్ అధికారి పద్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఉమ్మారెడ్డి, వేణుగోపాల్‌చారి, సంపత్, శ్యామ్‌కుమార్, సీఆర్పీలు రవి, సురేశ్, రాంబాబు, మహేందర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు గాంధీనగర్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్ కుమార్, ఏఈ రాజేశంలు పాల్గొన్నారు.




తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్ దంపతులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



కుటుంబ సభ్యులతో జస్టిస్ వినోద్ కుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

19న తిరుమలలో పుష్పయాగం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19న పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. 19న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ, 19న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



34 లక్షల ఎకరాలపై పేదలకు హక్కులు

- చరిత్రను తిరగరాస్తూ సామాజిక భూ హక్కులు
- నూజివీడు బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్
- దశాబ్దాల అనుభవదారులను చట్టబద్ధంగా హక్కుదారులను చేశాం
- ఇది చరిత్రలో గొప్పగా నిలిచిపోయే రోజు
- 42,307 మందికి కొత్తగా 46,463.82 ఎకరాల డీకేటీ పట్టాల పంపిణీ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



లబ్ధిదారుకు భూ పట్టా అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములపై పేదలకు సర్వ హక్కులు కల్పిస్తోంది మీ బిడ్డ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలు, రైతుల గుండె చప్పుడు విన్నది కాబట్టే మనందరి ప్రభుత్వం దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వారికి భూములపై పూర్తి హక్కులు కల్పిస్తూ మనస్ఫూర్తిగా మంచి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35,44,866 ఎకరాలకు సంబంధించి 20,24,709 మంది పేదలకు హక్కులు కల్పించి ఆ భూములను మీ బిడ్డ ప్రభుత్వం వారి చేతుల్లో పెడుతోందన్నారు. మనందరి ప్రభుత్వంలో సామాజిక న్యాయమన్నది ఒక నినాదంగా కాకుండా ఒక విధానంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేద వర్గాలను అక్కున చేర్చుకుని సామాజిక, ఆర్థిక న్యాయం చేయగలిగామన్నారు. ప్రతి పేదవాడు కాలర్ ఎగరవేసి అదిగో మా అన్న ప్రభుత్వం.. మా ప్రభుత్వం.. మా కోసం ఆలోచన చేసేవాడు ఒకడు ఉన్నాడు అని చెప్పుకునే విధంగా పాలన సాగిందని చెప్పేందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46,463.82 ఎకరాల భూమిని 42,307 మందికి కొత్తగా డీకేటీ పట్టాలు పంపిణీ చేసే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దశాబ్దాలుగా అనుభవదారులుగా ఉన్న పేద రైతులకు అసైన్డ్ భూములపై హక్కులు కల్పించడంతోపాటు చుక్కల భూముల సమస్యకు సైతం పరిష్కారాన్ని చూపామన్నారు. దళితుల శ్మశాన వాటికల కోసం 1,563 గ్రామాల్లో 951 ఎకరాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. 2003 నాటి అసైన్డ్ భూములపై హక్కులు, కొత్తగా డీకేటీ పట్టాలను అందిస్తూ పేదలకు వెన్నుదన్నుగా నిలుస్తుంటే పెత్తందారులకు నచ్చడం లేదని మండిపడ్డారు. పేద వర్గాల పట్ల బాధ్యతగా, చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంటే ప్రతిపక్షం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో నిరుపేదలకు భూ పంపిణీ, అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు, లంక భూములకు పట్టాలు, చుక్కల భూములు, షరతు గల పట్టా భూములు, సర్వీస్ ఈనాం భూములు 22 (ఏ) నుంచి తొలగింపు, భూమి కొనుగోలు పథకం ద్వారా అందించిన భూములపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. భూములకు సంబంధించి కేవలం 53 నెలల వ్యవధిలో తీసుకున్న తొమ్మిది రకాల విప్లవాత్మక నిర్ణయాలతో పేదలు, రైతన్నలకు చేకూర్చిన మేలును వివరిస్తూ ఆయా అంశాలను సీఎం జగన్ ప్రస్తావించారు.

ప్రపంచంలోనే అతి పెద్దది..

ఏపీలో ఎలక్ట్రిక్ వాహన యూనిట్

- జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రకటన
- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం.. పుంగనూరులో యూనిట్
- రూ.4,640 కోట్ల పెట్టుబడి.. 8,080 మందికి ఉపాధి
- ఈ నెలాఖరులో పనులు ప్రారంభం.. 2025కి వాణిజ్య ఉత్పత్తి మొదలు




సాక్షి, అమరావతి: జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రపంచంలోనే అతిపెద్ద తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తోంది. చైనా వెలుపల ఈ స్థాయిలో భారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదిరినట్లు పెప్పర్ మోషన్ జీఎంబీహెచ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భారీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా పుంగనూరులో 800 ఎకరాలు కేటాయించడంతో పాటు పలు రాయితీలను ఇచ్చింది. సుమారు రూ.4,640 కోట్లు (600 మిలియన్ అమెరికన్ డాలర్లు) పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 8080 మందికి ఉపాధి లభిస్తుంది. టెస్లా మాదిరి అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత ఎలక్ట్రిక్ బస్ అండ్ ట్రక్ తయారీ యూనిట్‌తో పాటు డీజిల్ బస్సులు, ట్రక్కులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రిట్రో ఫిట్టింగ్, 20 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉండే బ్యాటరీ తయారీ యూనిట్, విడిభాగాల తయారీ యూనిట్లు కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. పరిశ్రమలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహం, ఆయన తీసుకుంటున్న ప్రగతిశీల ఆర్థిక విధానాలకు తోడు పోర్టులు, పారిశ్రామిక మౌలిక వసతులు పెద్ద ఎత్తున సమకూరుస్తుండటంతో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు పెప్పర్ మోషన్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆండ్రియాస్ హేగర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

2025 నాటికి ఉత్పత్తి ప్రారంభం

ఈ నెలాఖరులో యూనిట్ నిర్మాణం ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది. 2025 ప్రారంభం నాటికి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. 2027 నాటికి ఏటా 50,000 కంటే ఎక్కువ బస్సులు, ట్రక్కులు తయారు చేసే సామర్థ్యానికి యూనిట్ చేరుకుంటుందని వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలను కూడా ఇక్కడే ఉత్పత్తి చేసి, అంతర్జాతీయంగా సరఫరా చేయనున్నట్లు తెలిపింది.

బోగస్ ఇన్వాయిస్‌లతో 'స్కిల్' నిధులు స్వాహా

- చంద్రబాబు సన్నిహితుడు యోగేశ్ గుప్తానే పాత్రధారి
- ఆయన చెబితేనే వాటిని ఇచ్చా..
- పూర్తి కుట్రను వెల్లడిస్తా.. అప్రూవర్‌గా అనుమతించండి
- న్యాయస్థానంలో ఏసీఐ ఎండీ చంద్రకాంత్ షా పిటిషన్
- స్కిల్ కుంభకోణం కేసులో కీలక మలుపు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని కొల్లగొట్టిన 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' కుంభకోణం కేసు కీలకమలుపు తిరిగింది. షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా చంద్రబాబు ముఠా అడ్డగోలుగా నిధులను అక్రమంగా తరలించారన్నది స్పష్టమైంది. ఈ బాగోతంలో కీలక పాత్రధారిగా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా మొత్తం అవినీతి నెట్‌వర్క్‌ను వెల్లడిస్తూ వాంగ్మూలం ఇచ్చారు. స్కిల్ స్కాం కేసులో నిందితుడు (ఏ–13)గా ఉన్న ఆయన తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ స్కాంలో బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా నిధులను ఎలా కొల్లగొట్టిందీ వివరిస్తూ ఆయన గతంలోనే గుంటూరులోని న్యాయస్థానంలో 2022, జులై 23న 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చారు. తాజాగా.. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారి స్కిల్ స్కాంలో సూత్రధారులు, పాత్రధారులు, తెరవెనుక కుట్రను వెల్లడించేందుకు ఆయన స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అందుకోసం తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించి తనను ఈ కేసులో సాక్షిగా పరిగణించాలని కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో చంద్రకాంత్ షాను సీఐడీ గతంలో అరెస్టుచేయగా ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు.

యోగేశ్ గుప్తానే కథ నడిపారు..

ఇక ఈ కేసులో చంద్రబాబు సన్నిహితుడు యోగేశ్ గుప్తా పాత్ర మరోసారి బయటకొచ్చింది. అమరావతిలో తాత్కాలిక సచివాలయ భవనాలు, టిడ్కో ప్రాజెక్టు కాంట్రాక్టుల కేటాయింపులో నిర్మాణ సంస్థల నుంచి ముడుపులు వసూలుచేసి చంద్రబాబుకు చేరవేయడంలో యోగేశ్ గుప్తా పాత్రధారిగా ఉన్నారు. అందుకే ఈయనకు ఐటీ శాఖ కూడా నోటీసులిచ్చి విచారించింది. అలాగే, స్కిల్ స్కాం కేసులోనూ యోగేశ్ గుప్తా నిందితుడుగా (ఏ–22) ఉన్నారు. నిధుల అక్రమ తరలింపులో ఈయన కీలకపాత్ర పోషించారని చంద్రకాంత్ షా తన అప్రూవర్ పిటిషన్‌లో వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడు సావన్ కుమార్ జజూ (ఏ–26)తో కలిసి యోగేశ్ గుప్తా 2016లో ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షాను సంప్రదించారు. డిజైన్‌టెక్, స్కిల్లర్ కంపెనీలకు సాఫ్ట్‌వేర్ సమకూర్చినట్లు.. ఐటీ సేవలు అందించినట్లుగా బోగస్ ఇన్వాయిస్‌లు కావాలని కోరారు. అనంతరం.. ఏసీఐ కంపెనీ పేరిట స్కిల్లర్ కంపెనీకి 18 బోగస్ ఇన్వాయిస్‌లు, డిజైన్‌టెక్ కంపెనీకి రెండు బోగస్ ఇన్వాయిస్‌లు ఇచ్చారు. సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఒప్పందం కుదుర్చుకున్నట్లు.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు నమ్మించేందుకే బోగస్ ఇన్వాయిస్‌లు తమ నుంచి తీసుకున్నట్లు తాను గుర్తించానని చంద్రకాంత్ షా పేర్కొన్నారు. ఈ బోగస్ ఇన్వాయిస్‌ల విలువ మేరకు రూ.64,87,39,313 ఏసీఐ కంపెనీ బ్యాంకు ఖాతాలో జమచేశారు. అనంతరం సావన్‌కుమార్ చెప్పిన పలు షెల్ కంపెనీలకు ఆ నిధులను చంద్రకాంత్ షా బదిలీ చేశారు. మరోవైపు.. స్కిల్ స్కాం నిధులు రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు సీఐడీ తాజాగా గుర్తించింది. ఇందులో రూ.64.87 కోట్లు ఏసీఐ కంపెనీ బోగస్ ఇన్వాయిస్‌లతోనే అక్రమంగా తరలించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. చంద్రకాంత్ షా అప్రూవర్ పిటిషన్‌పై విచారణకు డిసెంబర్ 5న హాజరుకావాలని న్యాయస్థానం ఆయన్ని ఆదేశించింది. దాంతో స్కిల్ స్కాం దర్యాప్తులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ మేనేజర్, బిల్ కలెక్టర్



లంచం తీసుకున్న డబ్బులను చూపిస్తున్న ఏసీబీ అధికారులు, వృత్తంలో మేనేజర్, బిల్‌కలెక్టర్

లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం మేనేజర్, బిల్ కలెక్టర్ లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ వి.రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటిక్యాల గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ సర్వే నంబరు 376లో రేకుల షెడ్డు నిర్మించుకుని ఇంటి నంబరు కోసం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రీహరిని కలిశాడు. రూ.లక్ష ఇస్తేనే ఇంటి నంబరు ఇస్తానని తెలిపాడు. అంత ఇవ్వలేనని బాధితుడు తెలుపగా.. రూ.80 వేల నుంచి రూ.20 వేలకు దిగివచ్చాడు. చివరికి రూ.15వేలకు అంగీకరించడంతో బాధితుడు శ్రీనివాస్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. శుక్రవారం ఉదయం బాధితుడు డబ్బులు ఇస్తానని చెప్పగా.. మేనేజర్ అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్ మహేందర్‌కు ఇవ్వాలని చెప్పాడు. దీంతో మహేందర్ ఇటిక్యాలకు వెళ్లగా డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే కార్యాలయానికి వచ్చి మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు జాన్‌రెడ్డి, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పని చేయమంటున్నారు

- బాల్క సుమన్‌కు అనుకూలంగా ఉండాలంటున్నాడు
- మందమర్రి తహసీల్దార్‌పై సీనియర్ అసిస్టెంట్ ఫిర్యాదు



మోహన్



తహసీల్‌లో పుట్టిన రోజు వేడుకలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పని చేయాలని మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్ తనపై ఒత్తిడి తెస్తున్నారని సీనియర్ అసిస్టెంట్ మోహన్ ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 16న కలెక్టర్, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్, చెన్నూరు ఆర్వోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం విధులకు వస్తే ఆఫీసు నుంచి వెళ్లిపోమన్నారని మీడియాకు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్ ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు అనుకూలంగా పని చేసేందుకు పోస్టింగ్ తెచ్చుకున్నారని ఆరోపించారు. తహసీల్దార్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కోటపల్లి ఎంపీపీ సురేఖ రామయ్య అల్లుడని, అక్కడే నివాసం ఉంటూ ఆ పార్టీకి అనుకూలంగా ఉంటూ, సిబ్బందిని కూడా పని చేయాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుల నుంచి బిర్యానీ, భోజనాలు తెప్పించుకుంటున్నారని ఆరోపించారు. గత నెలలో ఆఫీసులో పుట్టిన రోజు వేడుకలు కూడా చేశారన్నారు. గతంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి సీసీగా పని చేసిన తహసీల్దార్‌కు పెద్ద వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని చెబుతూ బెదిరిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ఇచ్చిన డబ్బులు తీసుకుని ఓటర్లకు పంచాలని కోరితే తాను తిరస్కరించానని అప్పటి నుంచి తనపై పగపట్టి వేధిస్తున్నట్లు ఆరోపించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ స్పందిస్తూ విధులు సరిగా చేయమని అడిగితే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని, అవన్నీ అవాస్తమని తెలిపారు. కాగా, ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తీస్తున్నట్లు సమాచారం.

పట్టు వదలని.. విక్రమార్కులు

- ఈసారైనా ఎమ్మెల్యే కావాలన్న ఆకాంక్ష నెరవేరేనా..!
- కొందరు పలుమార్లు పోటీ చేసినా దరిచేరని విజయం
- ఓ నేతకు గ్రహచారంలో ఆ యోగం లేదని చెప్పినా ఆగని ప్రయత్నం
- ద్రాక్షను అందుకునేనా..!

సాక్షి, ఆదిలాబాద్: పట్టు వదలని విక్రమార్కులు మరోసారి తమ ఆకాంక్షను నెరవేర్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈసారైనా ఎమ్మెల్యే కావాలని బలంగా ముందుకు సాగుతున్నారు. కొంతమంది పలుమార్లు పోటీ చేసినా ఆ విజయం దరిచేరలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి నేతలు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఓ నేతకైతే గ్రహచారంలో ఆ యోగం లేదని చెప్పినా పోరాటాన్ని ఆపలేదు. ద్రాక్షను అందుకునేందుకు యత్నాలు చేస్తున్నారు.

ప్రతీ ఎన్నికల్లో అపజయమే..

ప్రస్తుతం రాజస్థాన్‌లోనూ ఇదే నెలలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర ఎన్నికల ప్రస్తావన ఇక్కడ ఎందుకొచ్చిందంటే.. 78 ఏళ్ల తీతర్‌సింగ్ అనే వ్యక్తి కరణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇందులో విశేషం ఏముందని అనుకోవచ్చు.. ఇప్పటివరకు యాభై ఏళ్ల కాలంలో ఎన్నికల్లో 20 సార్లు బరిలో నిలిచిన ఆయనకు విజయం దక్కలేదు. దీంతో ఆయనను అక్కడివారందరు పట్టువదలని విక్రమార్కుడని అంటున్నారు. 1970లో ప్రారంభమైన అతని ఎన్నికల ప్రస్థానం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పంచాయతీ ఎన్నికల నుంచి లోక్‌సభ ఎన్నికల వరకు ప్రతీ ఎన్నికల్లో పోటీ చేసినా అపజయమే అతనికి ఎదురైంది.

బోథ్‌లో అనిల్‌జాదవ్..



బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుతం బరిలో నిలిచిన అనిల్ జాదవ్ ఈసారి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. 2009, 2014లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి చెందారు. 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. 2004లోనే టిక్కెట్ కోసం ప్రయత్నించగా దక్కకపోవడంతో ఆ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత ఎన్నికల తర్వాత మళ్లీ బీఆర్ఎస్‌లో చేరి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో నేరడిగొండ జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు.

ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్..



ఆదిలాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పాయల్ శంకర్ మరోసారి బరిలోకి దిగారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో కలిసిరాలేదు. 2014, 2018లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2012లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినా ఆయనకు విజయం వరించలేదు. టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నారు. 2015 నుంచి జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

మంచిర్యాలలో ప్రేమ్‌సాగర్‌రావు..



మంచిర్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమ్‌సాగర్ రావుకు ఇప్పటివరకు ఎమ్మెల్యే పదవి అందని ద్రాక్షే. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆ పార్టీ పరంగా చక్రం తిప్పుతున్న ఆయన ఈసారి గెలవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. 2005 నుంచి 2007 వరకు డీసీసీబీ చైర్మన్‌గా, 2007 నుంచి 2013 వరకు ఆదిలాబాద్ ఎమ్మెల్సీగా వ్యవహరించిన ఆయన అప్పట్లో రాజకీయంగా ఓ వెలుగు వెలిగారు. 2014లో సిర్పూర్ నుంచి, 2018లో మంచిర్యాల నుంచి పోటీ చేసినప్పటికీ ఆయనకు విజయం దక్కలేదు.

సిర్పూర్‌లో రావి శ్రీనివాస్..



సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ ఆశించినప్పటికీ రాకపోవడంతో బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు.

నిర్మల్‌లో శ్రీహరిరావు..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శ్రీహరిరావు అందరికీ సుపరిచితుడే. మూడు దశాబ్దాలుగా ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. ఎమ్మెల్యే పదవి ఆయనకు అందని ద్రాక్షగానే ఉంది. మరోసారి నిర్మల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 2009, 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ ఓటమి పాలయ్యారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా ఇదివరకు వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన మధ్యలో బీఆర్ఎస్‌లో కొనసాగారు. మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు.

కోతుల పునరావాస కేంద్రాన్ని సందర్శించిన వైల్డ్‌లైఫ్ వార్డెన్



అధికారులకు సలహాలు ఇస్తున్న మోహన్‌చంద్ర



పునరావాస కేంద్రం పరిశీలిస్తున్న మోహన్‌చంద్ర

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) గ్రామ సమీపంలోని కోతుల పునరావాస కేంద్రాన్ని వన్యమృగ సంరక్షక సంస్థ అధికారి మోహన్‌చంద్ర శుక్రవారం సందర్శించారు. ఇప్పటివరకు కోతుల పునరావాస కేంద్రంలో చేసిన ఆపరేషన్ల వివరాలు, వాటి సంఖ్యపై వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోతుల బెడద తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువవుతున్న నేపథ్యంలో ప్రతీరోజు ఎక్కువ మొత్తంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని సూచించారు. పంచాయతీ అధికారులకు కోతుల బెడదపై వివరించి గ్రామాల్లోకి వస్తున్న కోతులను పట్టుకునే దిశగా సమన్వయంతో పని చేయాలన్నారు. కోతుల పునరావాస కేంద్రం అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత స్థానిక అధికారులపై ఉందని తెలిపారు. ఆయన వెంట బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్‌వో రామకృష్ణ, ఆదిలాబాద్, నిజామాబాద్ డీఎఫ్‌వోలు ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్–14, 17 బాలబాలికల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీహెచ్ కాంతారావు తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు బోనఫైడ్, బర్త్ సర్టిఫికెట్, గతేడాది ప్రోగ్రెస్‌కార్డుతో పాటు నాలుగు సెట్ల ఎలిజిబిలిటీ ఫారాలతో ఉదయం 10 గంటలకు స్టేడియంలో పోటీల ఆర్గనైజర్ కొమ్ము కృష్ణకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9494945402 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓయూ జేఏసీ ప్రచారం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

మందమర్రిరూరల్: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని ఓయూ జేఏసీ నాయకులు విమర్శించారు. శుక్రవారం మందమర్రి మార్కెట్ ఏరియాలో బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీ ఆర్ పాలనలో నిరుద్యోగ యువకులకు ఉద్యో గ నోటిఫికేషన్ వేయలేదని ఆరోపించారు. వా రి కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు ఇచ్చుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 18 పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని, ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని వివరించారు. ఓయూ విద్యార్థిగా ప్రభుత్వ విప్ స్థాయికి ఎదిగిన చెన్నూర్ ఎమ్మెల్యే ఇంతవరకు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ విద్యార్థులు సురేష్, మహేష్, నిరంజన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జ్వరం



లక్కీ పోజులు సరదా సెంటిమెంట్లు

అమితాబ్ ఇరకాటంలో పడ్డారు. 'నేను చూడకపోతే ఇండియా గెలుస్తుంది' అని ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు ఆయనను మొహమాట పెడుతోంది. 'ఆస్ట్రేలియాతో ఇండియా ఫైనల్స్ చూడకండి సార్' అని అందరూ ఆయనతో మొరపెట్టుకుంటున్నారు. న్యూజీలాండ్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో మనం గెలవాలని ఒక అభిమాని 240 అగరుబత్తులు వెలిగించాడు. క్రికెట్ అంటే ఒక పిచ్చి. వెర్రి. అభిమానులకే కాదు ఆటగాళ్లకు బోలెడన్ని సెంటిమెంట్లు. రేపు ఫైనల్స్. ప్రతి ఫ్యామిలీ ఇందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దశాబ్దాలుగా ఉన్న సెంటిమెంట్లు, సరదా విశ్వాసాల స్పెల్ చూద్దామా

'జులాయి' సినిమాలో ఒక సీన్ ఉంటుంది. క్రికెట్ బెట్టింగ్ కోసం పబ్‌కు వెళ్లిన అల్లు అర్జున్‌కు అక్కడ ఒంగి నీలుక్కుపోయి నిలబడి ఉన్న సప్తగిరి కనపడతాడు. 'వీడేంటి ఇలా?' అని అడుగుతాడు అల్లు అర్జున్ తన ఫ్రెండ్ యాంకర్ ప్రదీప్‌ని. 'వీడా... ఇందాక వీడు ఇలా నిలుచున్నప్పుడు ధోని ఫోర్ కొట్టాడు. సెంటిమెంట్‌గా బాగుంటుందని అలా ఉంచేశాం' అంటాడు ప్రదీప్.


మనవాళ్ల సెంటిమెంట్స్ ఇలా ఉంటాయి.

•••

1970ల నుంచి క్రికెట్‌ను విపరీతంగా ఫాలో అవుతూ స్టేడియంలకు వెళ్లి మరీ మ్యాచ్‌లు చూసిన ఒక తెలుగు అభిమాని తన సెంటిమెంట్లు ఇలా చెప్పుకొచ్చారు– 'మా నాన్న క్రికెట్ చూసేటప్పుడు మా అమ్మను పక్కన కూచోబెట్టుకొని ఇవాళ నీకు వంట లేదు అనేవారు. ఆయనకు అదొక సెంటిమెంట్ అమ్మ పక్కనుంటే గెలుస్తుందని. నేను ఆ తర్వాత మ్యాచ్‌లు చూస్తున్నప్పుడు మధ్యలో మా అమ్మ వచ్చి పలకరిస్తే మనం ఓడిపోతామని సెంటిమెంట్ పడింది. అందుకని మ్యాచ్ ఉన్న రోజు మా అమ్మకు ఉదయాన్నే చెప్పేసేవాణ్ణి ఇవాళ పలకరించవద్దని. పెద్దవాళ్లు కదా. ఊరికే ఉండరు. ఒక్కోసారి మర్చిపోయి వచ్చి పలకరిస్తుంది. ఇంకేముంది... మ్యాచ్ హరీ'...

•••

ఎనభైల్లో ఊరూ వాడా క్రికెట్ ఫీవర్ మొదలయ్యింది. హైస్కూళ్లకు వ్యాపించింది. 1990లు దాటాక బ్లాక్ అండ్ వైట్ టీవీలు ఇళ్ల కప్పుల మీదకు యాంటెన్నాలు లైవ్ టెలికాస్ట్‌లు మొదలయ్యాయి. ఒక నెల్లూరు వాసి ఇలా చెప్పాడు– 'మా ఫ్రెండ్స్‌లో నలుగురైదుగురి ఇళ్లల్లో టీవీలు ఉన్నాయి. కాని ఎందుకనో విజయ్‌గారి ఇంట్లో చూస్తేనే ఇండియా గెలుస్తుందనే నమ్మకం ఏర్పడింది. దాంతో ఇండియా మేచ్ ఉన్న ప్రతిసారీ వాడింట్లో చేరి కిష్కింధకాండ చేసేవాళ్లం. ఇదేం గోలరా... ఇంకెక్కడా టీవీలు లేవా అని వాళ్లమ్మ మొత్తుకునేది. అదో సరదా'...


● ఫైనల్స్ చూడాలా.. వద్దా?

•••

అయితే ప్రతి గ్రూప్‌లో మచ్చనాలుకోడు ఒకడు ఉంటాడు. వాడు 'ఫలానా వాళ్లు పోతారు' అంటే గ్యారంటీగా పోతారు. వాడు తక్కిన రోజుల్లో ఎంత ప్రేమాస్పదమైన ఫ్రెండ్ అయినా క్రికెట్ వచ్చే రోజుల్లో అందరికీ కంటగింపు అవుతాడు. 'మా ఫ్రెండ్ శేషుగాడు ఇలాగే ఉండేవాడు. మేమందరం ఉదయాన్నే లైవ్ చూడ్డానికి ఎగ్జయిట్ అవుతుంటే ఇండియా ఢమాల్ అనేవాడు. ఇండియా అలాగే పోయేది. అందుకని మ్యాచ్‌లు జరిగే కాలంలో వాడు కనిపిస్తే రాళ్లెత్తి కొట్టి మరీ తరిమేసేవాళ్లం' అంటాడొక అభిమాని నవ్వుతూ.

•••

అభిమానులు మందుబాబులైతే వాళ్ల సెంటిమెంట్లకు కూడా లెక్కే లేదు. 'మనకు అలవాటైన బార్‌లో మిగిలిన రోజుల్లో ఎక్కడైనా సరే కూచుంటాం. కాని ఇండియా మ్యాచ్ ఉన్న రోజు మాత్రం నాకొక పర్టిక్యులర్ సీట్‌లో కూచుని చూస్తే గెలుస్తామని సెంటిమెంట్. అక్కడే కూచునేవాణ్ణి. బార్‌వాళ్లు కూడా నా సీట్ నాకే అట్టి పెట్టేవాళ్లు. అంతేనా? గ్లాస్‌లో మందైపోతే వికెట్ పడిపోతుందని ఒక సెంటిమెంట్. అందుకే మందైపోయేలోపు ఒక పెగ్ రెడీగా పెట్టుకునేవాణ్ణి' అని తెలియచేశాడు ఆ క్రికెట్ నిషా అభిమాని.

•••

అదేముంది... ఆటగాళ్లకు కూడా సెంటిమెంట్స్ ఉంటాయి. టెస్ట్ మేచ్‌ల రోజుల్లో బాగా బౌలింగ్ చేసినా, బ్యాటింగ్ చేసినా ఆ ప్లేయర్లు ఆ డ్రస్సుల్ని వాష్ చేయకుండా మేచ్ అయ్యేంత వరకూ అవే డ్రస్సుల్ని వేసుకునేవారు. 'నిన్న రాత్రి ఫలానా సినిమా చూసి నిద్రపోయి ఉదయం బ్రహ్మాండంగా ఆడాను. అందుకే మళ్లీ అదే సినిమా చూసి ఆడతాను అనుకునే వరకు క్రికెటర్ల సెంటిమెంట్లు ఉంటాయి' అని ఒక క్రికెటర్ తెలిపాడు. 'పూజ చేసి సాంబ్రాణి కడ్డీలు గుచ్చి రెండు రోజులుగా ఉంచిన అరటి పండును బౌలర్ శ్రీశాంత్ వికెట్లు పడతాయన్న నమ్మకంతో తినడం చూశానని' ఆ క్రికెటర్ చెప్పాడు. సునీల్ గవాస్కర్‌కు గురువారం గండం ఉండేది. 1980లో రెండు వరస గురువారాల్లో ఇద్దరు అనామక బౌలర్లకు వికెట్స్ ఇచ్చి సున్నాకు ఔట్ అయ్యాడతడు. క్రిష్ణమాచారి శ్రీకాంత్‌కు చేతిలో ఉన్న బ్యాట్‌ను గిర్రున తిప్పితే బాగా కొడతాననే నమ్మకం ఉండేది. అతని మ్యాచులు చూస్తే బ్యాట్ హ్యాండిల్‌ని తిప్పడం కనిపిస్తుంది. మొహిందర్ అమర్‌నాథ్ ఎర్ర కర్చీఫ్‌ను జేబులో పెట్టుకుని ఉండేవాడు. సచిన్‌కు ముందు ఎడమ కాలు ప్యాడ్ కట్టుకుంటే కలిసొస్తుందని నమ్మకం. జహీర్ ఖాన్ పసుపు రంగు చేతిగుడ్డను జేబులో పెట్టుకునేవాడు. బౌలర్ అశ్విన్ అయితే ఒకే బ్యాగ్‌ను అన్ని మ్యాచ్‌లకు తెచ్చేవాడు. అది అతని లక్కీ బ్యాగ్. ఇక అజారుద్దీన్ తావీజ్ లేకుండా మ్యాచ్ ఆడడు. 1987 వరల్డ్ కప్‌లో జింబాబ్వే మీద కపిల్ దేవ్ బ్యాటింగ్‌కు దిగే సమయానికి ఇండియన్ ఆటగాళ్లు ఆశలు వదలుకుని డ్రస్సింగ్ రూమ్ బయటకు వచ్చి నిలబడ్డారు. కపిల్ దేవ్ బాదడం మొదలు పెట్టాడు. అంతే టీమ్ మేనేజర్ మాన్ సింగ్ ఎక్కడి వాళ్లను అక్కడే నిలబడమన్నాడు. క్రిష్ణమాచారి శ్రీకాంత్‌ను పాస్‌కు వెళ్లడానికి కూడా ఒప్పుకోలేదు.


● అగరబత్తుల సెంటిమెంట్

•••

ఇప్పుడు కూడా చాలా సెంటిమెంట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అమితాబ్‌కు తాను మేచ్ చూడకపోతే ఇండియా గెలుస్తుంది అనే సెంటిమెంట్ ఉంది. మరోవైపు ఫైనల్స్‌కు ఆహ్వానం ఉంది. వెళ్లాలా వద్దా అని ఊగిసలాడుతున్నాడు. మరోవైపు అభిమానులు కూడా రకరకాల సెంటిమెంట్లు చెప్పుకుంటున్నారు. 2011 నుంచి వరల్డ్ కప్ పోటీల్లో హోస్ట్ కంట్రీలే గెలిచాయి కాబట్టి ఈసారి హోస్ట్ కంట్రీ ఇండియా గెలుస్తుందని ఒక సెంటిమెంట్. మరోవైపు 2019 వరల్డ్ కప్ సమయంలో చంద్రయాన్–2 ఫెయిల్ అయ్యింది. ఇండియా కప్ కోల్పోయింది. 2023లో చంద్రయాన్ –3 సక్సెస్ అయ్యింది. అంటే మనం వరల్డ్ కప్ గెలుస్తామని ఒక సెంటిమెంట్.

కాని ఆట ఎప్పుడూ టీమ్ సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది... సెంటిమెంట్స్ మీద కాదు. కాకుంటే కొంచెం అదృష్టం కలిసి రావాలంతే. ఆ అదృష్టం కోసం అభిమానుల ఆకాంక్షే సెంటిమెంట్ల రూపంలో బయటకు వస్తుంది.

ఈసారి భారత్ గెలవాలని... అందుకు అందరి సెంటిమెంట్లు పని చేయాలని కోరుకుందాం.

గార్డెన్ టిప్స్



మొక్కల్లో పారబోస్తే సరి!

అన్నం, కూరలు మిగిలిపోతే పడేస్తుంటారు. అయితే ఆ పడేసేదేదో మొక్కల దగ్గర పడేస్తే వాటికి కావాల్సిన పోషకాలు అంది, అవి ఏపుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

- మిగిలిపోయిన పప్పులో నీళ్లు కలిపి పలుచగా చేయాలి. ఈ పప్పు నీళ్లను మొక్కలకు పోయాలి.
- మజ్జిగ మరీ పుల్లగా అయితే తాగలేము. ఈ పుల్లటి మజ్జిగను బకెట్ నీళ్లల్లో పోసి కలపాలి. ఈ నీటిని మొక్కలకు పోయాలి.
- మిగిలిపోయిన అన్నాన్ని మెత్తగా గ్రైండ్ చేసి నీటిలో కలపాలి. ఈ నీటిని మొక్కలకు పోయాలి.
- బియ్యం, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు కడిగిన నీటిని సింక్‌లో పోయకుండా మొక్కలకు పోస్తే మంచిది.
- ఉల్లిపాయ తొక్కలు, అరటి తొక్కలను పడేయకుండా నీటిలో నానబెట్టాలి. పదిగంటల తరువాత ఈ నీటిని మొక్కలకు పోయాలి. ఈ నీటి నుంచి నైట్రోజన్, పొటాషియం, ఫాస్ఫరస్‌లు మొక్కలకు పుష్కలంగా అందుతాయి.

చూశారుగా... మిగిలిపోయినవి మొక్కలకు ఎంత మేలు చేస్తున్నాయో. ఇంకెందుకు ఆలస్యం మీ గార్డెన్ మరింత పచ్చగా కళకళలాడించేందుకు ప్రయత్నించండి.

స్టార్ అభిమాని

వహ్వా వాజ్మా!

వినూత్నంగా ఆలోచించేవారు నలుగురిలో ఉన్నా ప్రత్యేకంగా కనిపిస్తారు. సందర్భం ఏదైనా తమదైన శైలితో కోట్లమందిలోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. ప్రస్తుతం వాజ్మా అయూబీ కూడా ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకుని స్టార్ అభిమానిగా ట్రెండ్ అవుతోంది.

రేపటి ఫైనల్ మ్యాచ్‌తో ముగియనున్న వరల్డ్ కప్‌లో ఇండియా టీమ్ ఆడిన ప్రతి మ్యాచ్‌లో విజయకేతనం ఎగరవేసి, దాదాపు కప్పు ఇండియాదే అని చెప్పకనే చెబుతూ.. ప్రపంచ క్రికెట్ అభిమానుల్ని తనవైపు తిప్పుకుంది. ఇండియా టీమ్‌కు మద్దతు తెలుపుతూ అభిమానుల చూపులు తనపై నిలుపుకుని సోషల్ మీడియా స్టార్‌గా మారింది వాజ్మా అయూబీ.

అఫ్గానిస్తాన్‌కు చెందిన 28 ఏళ్ల వాజ్మా అయూబీకి రేపు జరగబోయే ఫైనల్ మ్యాచ్‌పైనే అందరి కంటే ఇంకాస్త ఎక్కువ ఆసక్తి. ప్రత్యర్థి టీమ్ అయిన భారత్ జట్టు గెలుపును ఆకాంక్షిస్తూ పోస్టులు పెట్టడం ద్వారా మన వాళ్లందరి అభిమానాన్నీ చూరగొంది ఈ సుందరి.

ఉత్తర ఆఫ్గన్ ప్రావిన్స్‌లోని కుందుజ్‌లో పుట్టింది వాజ్మా. చిన్నతనంలో కుటుంబం అమెరికా వెళ్లడంతో కొలరాడోలోనే పెరిగింది. స్కూలు విద్యాభ్యాసం అయిన తరువాత గ్లోబల్ మేనేజ్‌మెంట్ అండ్ లీడర్ షిప్‌లో మాస్టర్స్ చేసింది. ప్రస్తుతం దుబాయ్‌లో వ్యాపారవేత్తగా రాణిస్తోంది. ఫ్యాషన్ మీద ఆసక్తితో 'లామన్' పేరుతో క్లాత్ బ్రాండ్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్టర్‌గా కూడా రాణిస్తోంది.



ఒక పక్క తన వ్యాపారంతోపాటు ఒక్కగానొక్క కొడుకుని చూసుకుంటూనే చైల్డ్‌ఫండ్ ప్రచారకర్తగా, సామాజిక కార్యకర్తగా పనిచేస్తోంది.

మిస్టరీ గర్ల్... క్రికెట్‌ను ఆరాధించే వాజ్మా గతేడాది జరిగిన టీ20 ఆసియా కప్‌లో తొలిసారి మెరిసింది. అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు హాజరై స్టేడియంలో అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఈ మ్యాచ్‌ను టీవీల్లో చూసినవారు కూడా ఎవరీ ఈ అందాల రాశి అంటూ ఆసక్తిగా చూశారు. ఆ తరువాత ఈ మ్యాచ్‌లో గెలిచిన అఫ్గానిస్తాన్‌కు "కంగ్రాట్స్ బ్లూ టైగర్స్" అని అప్పట్లో ట్విటర్‌లో పోస్టుపెట్టింది. ఆ పోస్టు క్షణాల్లో వైరల్‌గా మారింది. అప్పటిదాకా మిస్టరీ గర్ల్‌గా ఉన్న వాజ్మా అందమైన క్రికెట్ అభిమానిగా క్రికెట్ ప్రపంచానికి పరిచయం అయింది.

ఈ ఏడాది సెప్టెంబర్‌లో విరాట్ కోహ్లీ సంతకం చేసిన జెర్సీ వేసుకుని స్టేడియంలో కనిపించింది. ఆ రోజు జరిగిన మ్యాచ్‌లో అఫ్గాన్ టీమ్‌పై విరాట్ కోహ్లీ సెంచరీ కొట్టాడు. సొంత టీమ్ కాకుండా ప్రత్యర్థి టీమ్‌కు మద్దతు తెలపడం చిత్రంగా అనిపించింది. అప్పటి నుంచి ఇండియా టీమ్ అభిమానిగా సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తోంది వాజ్మా. ప్రస్తుతం వరల్డ్‌కప్ చూసేందుకు ఇండియా వచ్చిన వాజ్మా సొంత టీమ్ కాకుండా ఇండియా టీమ్‌కే సపోర్ట్‌గా నిలుస్తూ సోషల్ మీడియా స్టార్ అభిమానిగా మారింది. విరాట్ కోహ్లీ, మొహమ్మద్ షమీకి వీరాభిమాని అయిన వాజ్మా ఇటీవల మ్యాచ్‌లో మొహమ్మద్ షమీ తీసిన ఏడు వికెట్లకు తెగ సంబరపడి పోయి షమీని అభినందనలతో ముంచెత్తింది. ఒక ఆఫ్ఘనీ అమ్మాయి అయ్యుండి ఇండియా టీమ్‌ను ఫేవరెట్‌గా భావిస్తూ స్టార్ అభిమానిగా పాపులర్ అయ్యింది.

వెబ్ సమ్మిట్



కలలను వదులుకోవద్దు...

ప్రపంచంలోనే అతిపెద్దదైన టెక్ కాన్ఫరెన్స్ వెబ్ సమ్మిట్ ఇటీవల పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో జరిగింది. ఈ వెబ్ సమ్మిట్‌కు 153 దేశాల నుండి 70 వేల మందికి పైగా సభ్యులు హాజరయ్యారు. వారిలో 43 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు రికార్డ్ స్థాయిలో మహిళలు పాల్గొన్న ఈవెంట్‌గా ఈ సదస్సు వార్తల్లో నిలిచింది.

గ్లోబల్ టెక్ ఇండస్ట్రీని రీ డిజైన్ చేయడానికి ఒక ఈవెంట్‌గా వెబ్ సమ్మిట్‌ను పేర్కొంటారు. ఇందులో 2,608 స్టార్టప్‌లు పాల్గొన్నాయి. వ్యాపార అవకాశాలను అన్వేషించడానికి, వ్యాపారాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కొత్త టెక్నాలజీని అందుకోవడానికి, సార్టప్‌లను ప్రదర్శించడానికి ఈ సమ్మిట్ వేదికగా నిలిచింది. ఇందులో స్టార్టప్ కంపెనీల సీఈఓలు, ఫౌండర్లు, క్రియేటివ్ బృందాలు, ఇన్వెస్టర్లు.. పాల్గొన్నారు. ఇందులో విశేషం ఏమంటే ప్రతి మూడవ స్టార్టప్... మహిళ సృష్టించినదే అయి ఉండటం. వెబ్‌సమ్మిట్ సీఈవో కేథరీన్ మహర్ ఈవెంట్ ప్రారంభంలో 'స్టార్టప్స్‌ని మరింత శక్తిమంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అత్యంత ముఖ్యమైన ప్రదేశం'గా పేర్కొన్నారు.

స్టార్టప్స్.. నైపుణ్యాలు

ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది తమ స్టార్టప్‌ల ద్వారా వెబ్ సమ్మిట్‌కు అప్లై చేసుకున్నారు. వాటిలో ఎంపిక చేసిన స్టార్టప్‌లను సమ్మిట్ ఆహ్వానించింది. కమ్యూనిటీ, పరిశ్రమలు, పర్యావరణ వ్యవస్థలపై సానుకూల ప్రభావం చూపే విధంగా పనిచేసే స్టార్టప్‌ల విభాగంలో 250 కంటే ఎక్కువ ఉన్నాయి. వంద మెంటార్ అవర్స్ సెషన్స్ ద్వారా 800 కంటే ఎక్కువ స్టార్టప్‌లు ఎక్స్‌పర్ట్స్ నుండి నైపుణ్యాలను నేర్చుకుంటారు. స్టార్టప్‌లలో ఎక్కువ ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమలలో ఏఐ, మెషిన్ లెర్నింగ్, హెల్త్‌టెక్, వెల్‌నెస్, ఫిన్‌టెక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, సస్టైనబిలిటీ, క్లీన్‌టెక్ .. వంటివి ఉన్నాయి.

కార్యాలయాలలో వేధింపులు

ఈవెంట్‌కు హాజరైన వారిలో మొత్తం 43 శాతం మంది మహిళలు ఉంటే, అత్యధికంగా 38 శాతం కంటే ఎక్కువ మంది మహిళా స్పీకర్లు ఉండటం విశేషం. అన్ని ఎగ్జిబిట్ స్టార్టప్ ఫౌండర్లలో దాదాపు మూడింట ఒక వంతు మహిళలే ఉన్నారు. ఈ సందర్భంగా వెబ్ సమ్మిట్ తన వార్షిక స్టేట్ ఆఫ్ జెండర్ ఈక్విటీ ఇన్ టెక్ నివేదికనూ విడుదల చేసింది. దాదాపు సగం మంది మహిళలు కార్యాలయంలో జెండర్ వివక్షను ఎదుర్కోవడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. 53.6 శాతం మంది గడిచిన ఏడాదిలో తమ తమ ఆఫీసులలో లైంగిక వేధింపులను ఎదుర్కొన్నట్టు తెలిపారు. 63.1 శాతం మంది పెట్టుబడిదారులు కృత్రిమ మేధస్సు, యంత్రాలని నమ్మి తమ స్టార్టప్‌లలో వృద్ధిని సాధించినట్టు తెలియజేస్తే 43.2 శాతం మంది మాత్రం తమ కంపెనీలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచినట్టు పేర్కొన్నారు. అయినా, సీనియర్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో మహిళల సంఖ్య గత ఏడాది కంటే 75 శాతం నుంచి 66.7 శాతానికి తగ్గినట్టు గుర్తించారు. ఈ సమ్మిట్... ప్రపంచంలో మహిళ స్థానం ఎలా ఉందో మరోసారి తెలియజేసింది.

ప్రపంచానికి మహిళ

పోర్చుగీస్ ఆర్థికమంత్రి ఆంటోనియా కోస్టా ఇ సిల్వా మాట్లాడుతూ 'టెక్ ప్రపంచంలో ఎక్కువమంది మహిళలు అగ్రస్థానంలో ఉండాలి. వారి అవసరం ఈ ప్రపంచానికి ఎంతో ఉంది. మీ కలలను వదులుకోవద్దు. మహిళలకు అసాధారణమైన సామర్థ్యం ఉంది. సంక్లిష్టంగా ఉన్న ఈ ప్రపంచంలో మహిళల మల్టీ టాస్కింగ్ మైండ్ చాలా అవసరం' అని పేర్కొన్నారు. ఆశలకు, స్నేహానికి, కొత్త ఆలోచనలను అభివృద్ధి చేయడానికి, మన కాలపు సమస్యలను సవాల్ చేయడానికి ప్రపంచం నలుమూలల నుంచి ప్రజలను ఒక చోట చేర్చడానికి వెబ్ సమ్మిట్ గొప్ప వేదిక' అన్నారు.

ఇలాంటి అత్యున్నత వేదికలు ప్రపంచ మహిళ స్థానాన్ని, నైపుణ్యాలను, ఇబ్బందులను అందరి ముందుకు తీసుకువస్తూనే ఉంటాయి. మహిళలు తమ ఉన్నతి కోసం అన్నింటా పోరాటం చేయక తప్పదనే విషయాన్ని స్పష్టం చేస్తూనే ఉంటాయి.

వేదిక


● మొబైల్ బస్‌స్టాప్ ఇన్‌స్టాలేషన్

ట్రావెలింగ్ బస్‌స్టాప్

● ఓట్ ఫర్ ఏ బస్‌స్టాప్

బెంగళూరులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం... అనేది ఒక కోణం.

మరో కోణం ఇది...

'నేను ఒక ప్రైవేట్ కంపెనీలో కొంతకాలం పాటు పనిచేశాను. బస్‌స్టాప్ చేరడానికి కనీసం రెండు కిలోమీటర్ల దూరం నడవాలి. దీంతో ఉద్యోగం మానేయాల్సి వచ్చింది' అంటుంది రజిని.

'ఒకరోజు ఏదో ఫంక్షనుకు వెళ్లొస్తుంటే చాలా ఆలస్యం అయింది. ఆ రాత్రి సమయంలో బస్‌స్టాప్ నుంచి నేను ఉండే చోటికి వెళ్లడానికి రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వచ్చింది. ఎంత భయమేసిందో చెప్పలేను' అంటుంది శ్రీకళ.

'నేను ఇండ్లలో పనిచేస్తుంటాను. నేను ఉన్న చోట నుంచి బస్‌స్టాప్‌కు రావడానికి అయిదు కిలోమీటర్ల దూరం నడవాలి' అంటుంది రుక్మిణి.

రుక్మిణి, శ్రీకళ, రజని... లాంటి ఎంతో మంది మహిళలు బస్సు ప్రయాణానికి సంబంధించి తాము ఎదుర్కొంటున్న సమస్యను ఎవరితోనూ చెప్పుకోలేదు. ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియదు. ఇలాంటి మహిళల విన్నపాన్ని అధికారుల దృష్టికి తీసుకురావడానికి సృజనాత్మక విధానంలో ఏర్పాటయింది ఈ ట్రావెలింగ్ బస్‌స్టాప్...

మరిన్ని సిటీ బస్‌స్టాప్‌లను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో బెంగళూరులోని వివిధ సంఘాలు, కళాకారులు 'అల్లి సెరోనా' పేరుతో ఒక వేదికగా ఏర్పడి 'మొబైల్ బస్‌స్టాప్ ఇన్‌స్టాలేషన్' టూర్‌ను ఏర్పాటు చేశారు. ఈ మొబైల్ బస్‌స్టాప్ బస్సు ఎప్పుడూ వెళ్లని ప్రాంతాలకు వెళుతుంది. ఒక ప్రాంతంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేస్తారు. సాధారణ బస్‌స్టాప్ కంటే సృజనాత్మకంగా ఈ హైపర్–క్రియేటివ్ మొబైల్ బస్‌స్టాప్‌ను రూపొందించారు. దీనిలో టికెట్ కౌంటర్, సిట్టింగ్ ఏర్పాట్లు, న్యూస్‌పేపర్ స్టాండ్, వెయిటింగ్ స్పేస్... మొదలైనవి ఉంటాయి.

'చాలామంది మహిళలు బస్‌స్టాప్‌ల కోసం కిలోమీటర్‌ల దూరం నడవాల్సి వస్తోంది. ఈ సమస్య గురించి మొబైల్ బస్‌స్టాప్ ఇన్‌స్టాలేషన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం' అంటుంది అల్లి సెరోనా క్రియేటివ్ స్ట్రాటజిస్ట్ తనిషా.

'అసంఘటిత రంగంలో పనిచేసే మహిళల కోసం ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేశాం' అంటున్నారు కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ సురేష్ కాంత.

తాము ఉండే ప్రాంతానికి చాలాదూరంగా బస్‌స్టాప్‌లు ఉండడంతో ఎక్కువమంది మహిళలు బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బస్సు రాని ప్రాంతాలలో వచ్చేలా 'అల్లి సెరోనా'తో కలిసి పని చేస్తోంది మల్లిక.

ఇప్పుడు ఉన్న బస్‌స్టాప్‌లు అరకొర సౌకర్యాలతో ఉన్నాయి, కొన్ని నామమాత్రంగా మాత్రమే ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'ట్రావెల్‌లింక్ బస్‌స్టాప్ ఇన్‌స్టాలేషన్' రూపంలో డ్రీమ్ బస్‌స్టాప్‌కు రూపకల్పన చేసింది అల్లి సెరోనా.


● అల్లి సెరోనా నిర్వహించిన వర్క్‌షాప్‌లో...

'ఈ మొబైల్ బస్‌స్టాప్‌లో ఉన్నట్లే అన్ని బస్‌స్టాప్‌లలో బాగా వెలుతురు ఉన్న లైట్లు, సీసీ కెమెరాలు ఉండాలి. రాత్రివేళల్లో బస్సు కోసం ఎదురు చూస్తున్న మహిళలకు ఇది ఎంతో ఉపయోగం' అంటుంది రుక్మిణి.

ఈ మొబైల్ బస్‌స్టాప్ ఇన్‌స్టాలేషన్ పుణ్యమా అని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో కదలిక మొదలైంది. చిన్న రూట్స్‌లో కూడా బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు మొదలయ్యాయి.

చలికాలం ఉదయం తొందరగా లేవబుద్ధి కాదు.
ముసుగు తన్ని పడుకున్న మంచాన్ని దిగ బుద్ధి కాదు.
రోజంతా బద్ధకంగా....వెచ్చగా ఓ చోట కూచోవాలని ఉంటుంది.
అయితే అలా ఉండకండి. కాస్త శరీరాన్ని అదిలించాలి.
కదిలించాలి. ఒంట్లో నుంచి ఉత్సాహం పుట్టించాలి.
శీతాకాలం మూడ్‌ని డల్ చేయకుండా చూసుకోవాలి.
అందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవి పాటిస్తే సరి!

చలిని వణికిద్దాం..!







చలి మనిషిని మందంగా మార్చేస్తుంది. బయటకు వెళ్లడానికి బద్ధకించేలా చేస్తుంది. స్నానానికి కూడా తొందరగా వెళ్లనియ్యదు. వ్యాయామం అసలే వద్దంటుంది. మనుషులే కాదు, పెంపుడు జంతువులు కూడా చలికాలంలో కాస్తంత బద్ధకంగానే ఉంటాయి. అటూ ఇటూ తిరగడం మానేసి హాయిగా ఓ మూలన ముడుచుకుని పడుకుంటాయి. అయితే మనకి ఆ సౌకర్యం, ఆ వైభోగం ఉండనే ఉండవు. మహా అయితే అప్పుడప్పుడు కాస్త అదను చూసుకుని మరికాసేపు ముడుచుకుని పడుకోగలం అంతే!

వింటర్‌ను విదిలించండి!

చలికాలంలో కూడా ఉదయాన్నే లేచి కాసిన్ని వేడి నీళ్లో, వేడి కాఫీనో, పాగలు కక్కే అల్లం టీనో తాగండి.. బద్ధకంగా అనిపిస్తే మంచం మీద పడుకునే కాస్త కాళ్లా చేతులూ కదిలించండి. కొంచెం బద్ధకం వదిలినట్టనిపించగానే లేచి కొన్ని బేసిక్ ఆసనాలు వేయండి. ప్రాణాయామం, ధ్యానంతో పాటు చలికాలానికి ఉపయోగపడే హస్త ఉత్తరాసనం,పాద హస్తాసనం, ఉష్ట్రాసనం, హలాసనం, భుజంగాసనం వంటి ఆసనాలతో దేహాన్ని కాస్త మీ అదుపులోకి తెచ్చుకోండి. మెల్లగా చురుకుదనం అదే వచ్చేస్తుంది మీ వంట్లోకి.

చకచకా అడుగులు కదపండి

వెచ్చటి ఉన్ని దుస్తులు, తలకు మంకీ క్యాప్ ధరించి వాకింగ్‌కు వెళ్లండి వెళ్లండి. చలి భయం లేకుండా ఇంట్లోనే కాసిని ఆసనాలు వేశారు కాబట్టి ఒంట్లో వేడి పుట్టి హుషారుగానే వాకింగ్ చేయగలమని గుర్తు తెచ్చుకుని చక చకా నాలుగడుగులు వేసేయండి.

● పార్కులో అయితే మీ నడక ద్వారా ఎనిమిది అంకెను వేస్తూ ఉత్తరం నుంచి దక్షిణానికి ఐదు నిమిషాలు తిరిగి దక్షిణం నుంచి ఉత్తరానికి ఐదు నిమిషాలు నడవండి. ఈ నడక మంచిది.

వేడి వేడిగా తినెయ్యండి

శీతాకాలంలో ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. శరీరాన్ని చురుగ్గా ఉంచే వేడి వేడి ఆహారాన్ని ఆరారగా తీసుకోవాలి. అలాంటి వాటిలో మిరియాలు వేసిన పప్పొంగలి, సూప్, ఆవాల పొడి లేదా నువ్వుల పొడి చల్లిన పులిహోర, ఉప్మా వంటివి తీసుకోండి.

మ్యూజిక్ మ్యాజిక్

వింటర్‌లో ఒక్కోసారి ఇల్లు బొత్తిగా కదలబుద్ధి కాదు. అప్పుడు మంచి జోష్ ఉన్న సంగీతం పెట్టుకుని మీ ఇష్టం వచ్చేలా ఎగరండి. వీలయితే లయబద్ధంగా అడుగులు కదుపుతూ డాన్స్ చేసేయండి. ఇది వొంటికి ఉత్సాహాన్నిస్తుంది.

దోస్తానం

● పని చేయాలన్నా వ్యాయామం చేయాలన్నా తోడు ఉంటే హుషారు వస్తుంది. ఈ శీతాకాలంలో బద్ధకాన్ని వదిలించే హుషారైన వ్యాయామ స్నేహితుణ్ణి/స్నేహితురాలిని ఎంచుకోండి. మీరు మారాం చేసినా 'పద' అని తిట్టి, ఉత్సాహపరిచి తీసుకెళ్లేవాళ్లు మీకు మేలు చేస్తారు. కాసేపటిలోనే బద్ధకం పోయి మీరు వ్యాయామంలో, నడకలో పడతారు.

ఇంటి పనులలో సాయం

శీతాకాలం ఇంటి పనులు పంచుకోవడం శరీరానికి మంచిది. ఈకాలంలో అందరికీ నచ్చే గది వంటగది. ఎందుకంటే వెచ్చగా ఉంటుంది. వంట పనిలో సాయం చేయడం, వంట చేయడం చిన్న వ్యాయామం కాదు. కూరగాయలు తరగడం, అంట్లు తోమడం, టీ పెట్టడం, గ్రైండర్ వేయడం... వీటినే వ్యాయామం అనుకుంటే బయటి చలిని ఎదుర్కొనే బాధ తప్పుతుంది.

కంటినిండా నిద్రపోండి

చలికాలం తొందరగా ఇల్లు చేరుకోబుద్ధవుతుంది. అలాగని ఇంటికి చేరాక ఫోన్, టివి, ఇంటర్‌నెట్‌లో గడపడం కంటే మంచి పుస్తకాలు చదవడం మానసిక ఆరోగ్యానికి మంచిది. చక్కగా రగ్గు కప్పుకుని పుస్తకాలు చదవండి. లేదా పిల్లలకు కథలు చెబుతూనో, జీవిత భాగస్వామితో కబుర్లు చెప్పుకుంటూనో నిద్రలోకి జారిపోండి! ●

మీకు తెలుసా?

తినండి... తాగండి...తగ్గండి!



అధిక బరువు నుంచి విముక్తి పొందేందుకు చాలా మంది చాలారకాలుగా ప్రయత్నిస్తుంటారు. కానీ విఫలమౌతుంటారు. వాకింగ్, డైటింగ్, వ్యాయామం ... ఇలా చాలా ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే రోజూ నిర్ణీత సమయంలో వ్యాయామంతో పాటు డైట్‌లో కొన్ని రకాల ఆహార పదార్థాలు ఉండేట్టు చూసుకుంటే బరువు అదుపులో ఉంటుంది. బరువు తగ్గేందుకు కూరగాయలు చక్కగా సాయం చేస్తాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. స్థూలకాయాన్ని నియంత్రణలో ఉంచకపోతే గుండె వ్యాధులు, మధుమేహం, రక్తపోటు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు వెంటాడుతాయి. శరీరాన్ని డొల్లగా మార్చేస్తాయి. రోజూ తగినంత నిద్ర, నీళ్లు, సరైన డైట్ వల్ల స్థూలకాయం రాకుండా ఉంటుంది.

హెల్త్‌టిప్స్



● రాత్రి పడుకునే ముందు గ్లాసు నీళ్లలో టీస్పూను మెంతులు వేసి నానపెట్టాలి. ఉదయం పరగడుపున ఈ నీళ్లను తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. కీళ్లనొప్పులనుంచి ఉపశమనం కలగడంతోపాటు, శరీర బరువు అదుపులో ఉంటుంది. రోజూ మెంతుల నీళ్ల తాగడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.



● రాత్రి పూట నిద్రకు ముందు ఒక గ్లాస్ చల్లని పాలను తాగాలి. పాలను బాగా మరిగించి అనంతరం వాటిని చల్లార్చి కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. అనంతరం వాటిని నిద్రకు ముందు తాగాలి. ఇలా 3 రోజుల పాటు వరుసగా చేస్తే ఎసిడిటీ తగ్గిపోతుంది.



● రోజూ మధ్యాహ్నం, రాత్రి భోజనం అనంతరం కాసిని సోంపు గింజలను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. ఇలా చేస్తుంటే జీర్ణ సమస్యలు అన్నీ తగిపోతాయి. ముఖ్యంగా కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.

హోమ్ వర్క్

చేయించండి కానీ... మీరే చేయద్దు!



సాధారణంగా చాలామంది పిల్లలు ఆడుకోవడంలోనూ, ఫోన్‌లో వీడియోలు చూడటంలోనూ, వీడియో గేమ్‌లు లేదా ఆటలు ఆడుకోవడంలోనూ చూపినంత శ్రద్ధ చదువుకోవడంలో, హోంవర్క్ చేయడంలో చూపించరు. కొందరు సిసింద్రీలు మాత్రం హోం వర్క్ చేయడానికి మొండికేస్తుంటారు. అలాంటి గడుగ్గాయిలతో హోం వర్క్ చేయించడానికి తంటాలు పడలేక అదేదో మనమే చేసేస్తే పోలా... అనుకుని కొందరు పేరెంట్స్ పిల్లలకిచ్చిన హోమ్ వర్క్‌ను తామే చేసేస్తుంటారు. అయితే అది చాలా పొరపాటు. మీ చిన్నారి హోంవర్క్ చేయడానికి మొండికేస్తుంటే.. ఈ చిట్కాలు పాటించి చూడండి!

పని వాతావరణాన్ని సృష్టించండి..

పిల్లల చదువులో హోంవర్క్ కీలకమైన అంశం. ఇది క్లాస్ రూమ్ అభ్యాసాన్ని బలోపేతం చేస్తుంది, అధ్యయన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది, బాధ్యతను అలవాటు చేస్తుంది. అందువల్ల మీ పిల్లల హోమ్‌వర్క్‌ను మీరు చేయొద్దు. దానిబదులు వాళ్ల హోంవర్క్ చేయడానికి తగిన వాతావరణాన్ని సృష్టించండి. వారికి అవసరమైన పెన్నులు, బుక్స్, పేపర్స్, రిఫరెన్స్ మెటీరియల్స్ వంటివాటిని అందుబాటులో ఉంచండి. అప్పుడు వారే హోమ్‌వర్క్ చేయడానికి ఇష్టపడతారు.

దండించ వద్దు

సాధారణంగా చాలామంది పేరెంట్స్ చేసే పని.. పిల్లలు హోంవర్క్ చేయనని మొండికేస్తే తిట్టడం లేదా కొట్టడం. ఇలా చేస్తే పిల్లలు దారికి రారు సరికదా, మరింత మొండిగా తయారవుతారు కాబట్టి వారిని తిట్టి లేదా నాలుగు దెబ్బలు వేసి బలవంతానా హోం వర్క్ చేయించడానికి బదులు ప్రేమగా మాట్లాడుతూనే ఇంటి పని పూర్తి చేసేలా చూడటం చాలా మేలు చేస్తుంది.

అలవాటుగా మార్చేయండి!

చాలామంది పిల్లలు హోం వర్క్ అనగానే ఆడుకున్న తరవాత చేస్తాం, తిన్న తర్వాత చేస్తాం, పొద్దున్నే లేచి పూర్తి చేస్తాం.. అంటూ రకరకాల సాకులు చెబుతుంటారు. హోమ్ వర్క్‌ను వాయిదా చేయకుండా.. రోజూ ఒకే పద్ధతి ఫాలో అయ్యేలా తయారు చేయడం మంచిది. కొందరు స్కూల్ నుంచి రాగానే హోంవర్క్ చేయడానికి ఇష్టపడుతుంటారు, కొందరు ఆడుకున్న తర్వాత హోం వర్క్ చేయాలనుకుంటారు. మీ పిల్లలకు నచ్చిన సమయంలోనే వర్క్ చేసుకునేలా సెట్ చేయండి. రోజూ దీనినే అనుసరిస్తుంటే అదే అలవాటుగా మారిపోతుంది.

తేలికవి ముందుగా...

స్కూల్ నుంచి వచ్చి ఫ్రెష్ అవగానే వాళ్లకు తినడానికి ఏమైనా పెట్టి ఆ రోజు స్కూల్‌లో జరిగిన విషయాల గురించి అడిగి తెలుసుకోండి. ఆ మాటల్లోనే హోం వర్క్ ఏమిచ్చారో కనుక్కోండి. తేలిగ్గా లేదా తక్కువగా ఉన్న వర్క్‌ని ముందుగా చేసేయమని చెప్పండి. కాస్త ఎక్కువ టైమ్ తీసుకునే పనులను మెల్లగా చేయించండి.

సాయం చేయండి కానీ... మీరు చేయద్దు!

పిల్లలు హోం వర్క్ చేయకపోతే రేపు బడికెళ్లగానే టీచర్లు కొడతారని కొంతమంది తల్లులే చేసేస్తుంటారు. ఇలా చేయడం వల్ల పిల్లలు హోం వర్క్ చేయడానికి ఆసక్తి చూపించరు. వాళ్లలో నేర్చుకునే శక్తి కూడా తగ్గుతుంది. వాళ్లకు సహాయం కావలిస్తే చేయాలి గానీ మీరు మాత్రం చేయవద్దు.

ఏ రోజుది ఆ రోజే!

హోమ్‌వర్క్ ఏమీ ఇవ్వకపోతే రీడింగ్ వర్క్ చేయించండి. ఏ రోజు పాఠం ఆ రోజు చదువుకుంటే కలిగే లాభాల గురించి తెలియజెప్పి ఎప్పటి పాఠం అప్పుడు చదువుకునేలా చేయండి.

సినిమా

వారాహి ఆలయం నేపథ్యంలో..



● సుమంత్

సుమంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'మహేంద్రగిరి వారాహి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. జాగర్లపూడి సంతోష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ గోసామి హీరోయిన్. కాలిపు మధు, ఎం. సుబ్బారెడ్డి నిర్మిస్తున్న 'మహేంద్రగిరి వారాహి' టైటిల్ లోగోను సుమంత్ రిలీజ్ చేశారు. ''మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్, 'శుభలేఖ' సుధాకర్, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

కవిత్వం చెప్పగలడు

మూల విరాట్, పద్మ, రాజ్‌కుమార్, స్వప్న ముఖ్య తారలుగా ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. ప్రముఖ కవి కాళోజీ నారాయణ బయోపిక్‌గా విజయలక్ష్మీ జైనీ నిర్మించారు. ఈ చిత్రం టీజర్, ట్రైలర్ విడుదల వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నటుడు, దర్శక-నిర్మాత ఆర్. నారాయణ మూర్తి, తెలంగాణ సాంస్కృతిక సంచాలకుడు మామిడి హరికృష్ణ, నిర్మాత రామ సత్యనారాయణ, దర్శకులు వీయన్ ఆదిత్య, వేణు ఊడుగుల సినిమా హిట్టవ్వాలన్నారు. ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''ఒక రిక్షావాడు కూడా కవిత్వం చెప్పగలడని ఈ సినిమాలో చూపించాం'' అన్నారు. ''కాళోజీగారి ఆత్మ నా ద్వారా ప్రేక్షకులకు పరిచయమవుతున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు కాళోజీ పాత్రధారి మూల విరాట్.

● మూల విరాట్



''నేనిప్పటివరకూ ఏ సినిమాలోనూ సిగరెట్ తాగే సన్నివేశంలో నటించలేదు. 'కోట బొమ్మాళి పీఎస్' సినిమా కథకు అవసరం కావడంతో తొలిసారి స్మోకింగ్ సన్నివేశం చేశాను. అందుకే ఈ చిత్రం నాకు సవాల్‌గా అనిపించింది'' అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్ కుమార్ చెప్పిన విశేషాలు.

తొలిసారి అలాంటి సీన్ చేశా! - వరలక్ష్మీ శరత్‌కుమార్



● నేను కథే హీరోగా భావిస్తాను. నా కెరీర్‌లో తమిళంలో ఎక్కువగా పోలీస్ పాత్రలు చేశాను. కానీ తెలుగులో మాత్రం 'కోట బొమ్మాళి పీఎస్' నా తొలి మూవీ. ప్రస్తుతం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ ట్రెండ్ నడుస్తోంది కాబట్టి పోలీస్ ఆఫీసర్ పాత్రలకు క్రేజ్ ఉంటోంది. ● 'కోట బొమ్మాళి పీఎస్'లో శ్రీకాంత్‌గారు, నేను పోలీస్ ఆఫీసర్స్. ఇద్దరిలో ఒకరు క్రిమినల్ అయితే ఎలా ఉంటుంది? పోలీసులపై రాజకీయ నాయకుల ఒత్తిడి ఏ విధంగా ఉంటుంది? అన్నది ఈ చిత్రకథ. పిల్లి మరియు ఎలుక ఆటలా థ్రిల్ చేసేలా ఉంటుంది. ఓటు గురించి అవగాహన కల్పించే లైన్ కూడా ఉంటుంది. ఎన్నికల టైమ్‌లో వస్తున్న మా సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ● 'వరలక్ష్మి చాలా వైవిధ్యంగా చేసింది' అని ప్రేక్షకులు అనుకునేలా మంచి పాత్రలు చేయడమే నా లక్ష్యం. లేడీ ఓరియంటెండ్ సినిమాలతో పాటు పాత్ర నచ్చితే ఎలాంటి మూవీలోనైనా నటించడానికి రెడీ. తెలుగులో నేను నటించిన 'హనుమాన్' సినిమా సంక్రాంతికి విడుదలవుతోంది. కన్నడలో సుదీప్‌తో 'మ్యాక్స్' చిత్రంలో నటిస్తున్నాను.

అందుకే భావోద్వేగానికి లోనయ్యాను - చంద్రబోస్



● చేనాగ్, సుచిత్రా చంద్రబోస్, చంద్రబోస్, జేడీ స్వామి, ప్రాచీ

''నేనిప్పటివరకు 3700 పాటలు రాశాను. ఈ రోజు నా మీద పాట రాసి, పాడారు. ఆ పాటను నాకు బహుమతిగా ఇచ్చిన 'పర్‌ఫ్యూమ్' టీమ్‌కి కృతజ్ఞతలు. నేను ఆస్కార్ అందుకున్న వీడియోను మళ్లీ ఇక్కడ చూడటంతో భావోద్వేగానికి లోనయ్యాను. 'పర్‌ఫ్యూమ్' పెద్ద విజయం సాధించాలి. నా భార్య సుచిత్ర ఈ చిత్రంలో ఒక పాటకు డ్యాన్స్ కంపోజ్ చేశారు'' అని రచయిత చంద్రబోస్ అన్నారు. చేనాగ్, ప్రాచీ థాకర్ జంటగా జేడీ స్వామి దర్శకత్వం వహించిన చిత్రం 'పర్‌ఫ్యూమ్'. శ్రీమాన్ మూవీస్ సమర్పణలో జె. సుధాకర్, శివ .బి, రాజీవ్ కుమార్ .బి, లావురి శ్రీనివాస్, రాజేంద్ర కనుకుంట్ల, శ్రీధర్ అక్కినేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్‌ను యూనిట్ సత్కరించింది. ఈ వేడుకకి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎస్. విష్ణుమూర్తి, ఐఆర్ఎస్ అధికారి మురళీమోహన్, గ్రీన్ హార్స్ కంపెనీ అధినేత ప్రవీణ్ రెడ్డి, ఆచార్య భట్టు రమేష్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ''కొత్త పాయింట్‌తో రూపొందిన చిత్రమిది'' అన్నారు జేడీ స్వామి, చేనాగ్.

రెండు పాత్రల కథ

జయం రవి, కీర్తీ సురేష్ నటించిన చిత్రం 'సైరన్'. ఆంటోని భాగ్యరాజ్ దర్శకత్వంలో సుజాత విజయ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను నిర్మాత 'దిల్' రాజు విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన చిత్రం 'సైరన్'. రెండు పాత్రల మధ్య నడిచే కథ ఇది. ఖైదీ పాత్రలో 'జయం' రవి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. ఈ మూవీలో తొలిసారి సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో కొత్తగా కనిపిస్తారు రవి. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్.



● జయం రవి

అడవి బాట... బాక్సాఫీస్ వేట

బాక్సాఫీస్ వసూళ్ల వేట కోసం తెలుగు హీరోలు కొందరు అడవి బాట పట్టారు. అడవి నేపథ్యంతో కూడిన కథలతో ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధం అవుతున్నారు. ఆ అడవి కథలపై కథనం.



● మహేశ్‌బాబు



● రవితేజ



● ఎన్టీఆర్

అడవిలో ఈగల్

'ఎక్కడుంటాడు? అని రవితేజను ఉద్దేశిస్తూ అవసరాల శ్రీనివాస్‌ను అనుపమా పరమేశ్వరన్ అడగ్గానే అడవిలో ఉంటాడు అని సమాధానం చెబుతారు. ఈ సంభాషణ ఇటీవల విడుదలైన 'ఈగల్' సినిమా టీజర్‌లోనిది. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కథ రీత్యా ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు అడవి నేపథ్యంలో ఉంటాయని టీజర్ స్పష్టం చేస్తోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది.



● అల్లు అర్జున్

ఆఫ్రికన్ అడ్వెంచర్

ఆఫ్రికన్ అడవుల్లో వేటకు సిద్ధమౌతున్నారు మహేశ్‌బాబు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. రచయిత-దర్శకుడు కె. విజయేంద్ర ప్రసాద్ ఈ చిత్రానికి కథ అందిస్తున్నారు. ఈ చిత్రంలోని ప్రధాన కథాంశం ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగుతుందని, సహజమైన లొకేషన్స్‌లోనే చిత్రీకరించేలా రాజమౌళి అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, విజయేంద్రప్రసాద్ ఈ సినిమాకు స్క్రిప్టుకు మరింత పదును పెడుతున్నారని తెలిసింది. వచ్చే ఏడాది వేసవి తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభించడానికి ప్లాన్ చేస్తున్నారట. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు.

అడవుల్లో దేవర

'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'దేవర'. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా ప్రధాన కథనం సాగుతుంది. అయితే కథ రీత్యా 'దేవర'లో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ సీన్స్ ఉన్నాయని, ఈ సన్నివేశాల చిత్రీకరణ అడవుల్లో జరుగుతుందని, ఇవి 'దేవర పార్ట్ 2'లో ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో హిందీ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. కళ్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' సినిమా తొలి భాగం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

పుష్పరాజ్ రూల్

ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో దర్శకుడు సుకుమార్ అల్లుకున్న ఊహాత్మక కథ 'పుష్ప'. ఇందులో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ టైటిల్ రోల్ చేస్తున్నారు. 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఇప్పటికే విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. దీంతో మలి భాగం 'పుష్ప: ది రూల్' కోసం ప్రస్తుతం వర్క్ చేస్తున్నారు హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'పుష్ప: ది రైజ్' సినిమాలోని కీలక సన్నివేశాలు, కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌ల మాదిరిగానే 'పుష్ప: ది రూల్'లోనూ ప్రధాన సన్నివేశాలు అడవుల నేపథ్యంలోనే సాగుతాయని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఆగస్టు 15న రిలీజ్ కానుంది.



● మంచు విష్ణు

న్యూజిల్యాండ్‌లో కన్నప్ప

శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తుండగా మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా మేజర్ షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరుగుతుంది. ప్రస్తుతం అక్కడి లొకేషన్స్‌లోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతోంది. కథ రీత్యా 'కన్నప్ప' సినిమాలోని చాలా సన్నివేశాలు అడవి నేపథ్యంలోనే ఉంటాయి. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇలా అడవి నేపథ్యంలో సాగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

సాక్షి బిజినెస్
శనివారం
18-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
188	33
65,795	19,732

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,102	▽	11
డోజోన్స్	34,936	△	10
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,504	△	93
డాక్స్	15,919	△	133
షాంఘై	3,054	△	4
నికాయ్	33,585	△	161

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
61,170	△	665
బంగారం (22 క్యారెట్)		
60,925	△	662
వెండి (కిలో)		
73,747	△	892

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	101.67	105.12
€	యూరో	ఒకటి	88.89	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.49	56.18
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.77	55.12
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.83	62.81
SAR	సౌదీ రియాల్	ఖాయమేనేది	21.22	22.75
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమేనేది	21.59	23.42
¥	చైనా యువాన్	ఖాయమేనేది	10.31	12.39

200 బిలియన్ డాలర్లకు ఫార్మా రంగం

- 2030 నాటికి ఎదిగే అవకాశం
- కేంద్ర ఫార్మా కార్యదర్శి చావ్లా అంచనా

న్యూఢిల్లీ: ప్రస్తుతం దాదాపు 50 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ ఫార్మా పరిశ్రమ 2030 నాటికి విలువపరంగా 4–5 రెట్లు వృద్ధి చెందనుంది. తయారీని, ఎగుమతులను పెంచుకోవడం ద్వారా 200 బిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందన్న అంచనాలు నెలకొన్నాయి. పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర ఫార్మాస్యూటికల్స్ విభాగం కార్యదర్శి అరుణీష్ చావ్లా ఈ విషయాలు తెలిపారు. 2030 నాటికి 200 బిలియన్ డాలర్ల స్థాయికి చేరాలంటే ఫార్మా పరిశ్రమ ఏటా రెండంకెల స్థాయిలో వృద్ధి చెందాలని, దిగుమతులను తగ్గించుకుని.. ఎగుమతులపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. 'ఇందుకోసం మనం దిగుమతులపై ఆధారపడుతున్న నిర్దిష్ట రంగాలను ఎంపిక చేసుకోవాలి. వచ్చే పదేళ్లలో ఆయా విభాగాలన్నింటిలోనూ మనం ఎగుమతిదారుగా ఎదిగేలా విధానాలను రూపొందించుకోవాలి' అని చావ్లా పేర్కొన్నారు. 'కొత్తగా స్మార్ట్ ఔషధాల తరం వస్తోంది. వచ్చే 20–30 ఏళ్లలో ఎంతో సంక్లిష్టమైన అనారోగ్యాలకు కూడా స్మార్ట్‌గా చికిత్సను అందించగలిగే కొత్త థెరపీలు రాబోతున్నాయి. దాని కోసం మనం అంతా సంసిద్ధంగా ఉండాలి' అని ఆయన చెప్పారు. ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాలతో పాటు పరిశ్రమకు ప్రభుత్వం విధానపరంగా అన్ని రకాల తోడ్పాటు అందిస్తోందని చావ్లా వివరించారు. భారత్ ఇప్పటికే చాలా విభాగాల్లో ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని తెలిపారు. కొత్త టెక్నాలజీలు వస్తుండటంతో పాటు పరిశోధనలకు సంబంధించి విద్యా సంస్థలు, ప్రయోగశాలలు, పరిశ్రమ కలిసి పని చేస్తున్న నేపథ్యంలో కీలకమైన దాదాపు అన్ని మెడికల్ టెక్నాలజీ ఉత్పత్తులను ఎగుమతి చేయగలిగే స్థాయికి ఎదగగలమని చావ్లా ధీమా వ్యక్తం చేశారు. ఫార్మా రంగంలో ప్రపంచ దిగ్గజంగా ఎదిగేందుకు సాంకేతిక వనరులు, నిపుణులు, పురోగామి ప్రభుత్వ విధానాలు మొదలైన వాటన్నింటినీ సమర్ధవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



మారుత్ డ్రోన్స్ నుంచి సీడ్‌కాప్టర్ 2.0



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మారుత్ డ్రోన్స్ సంస్థ దేశీయంగా తొలి రీఫారెస్టేషన్ డ్రోన్ సీడ్‌కాప్టర్ 2.0ని ఆవిష్కరించింది. సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద కార్పొరేట్లు చేపట్టే కార్యక్రమాలు, రీఫారెస్టేషన్‌కి ఇది తోడ్పడగలదని సంస్థ సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ తెలిపారు. అడవుల నరికివేత అంతర్జాతీయంగా ఆందోళనకర స్థాయిలో పెరిగిందని, 1990–2016 మధ్య కాలంలో దాదాపు 13 లక్షల చ.కి.మీ. మేర అడవుల విస్తీర్ణం తగ్గిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఏటా 1,500 కోట్ల చెట్లు మాయమైపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్కువ వ్యయాలతో అడవులను తిరిగి పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించుకునే దిశగా తమ సీడ్ కాప్టర్ 2.0 డ్రోన్లు ఉపయోగపడతాయని విస్లావత్ వివరించారు. మొక్కల పెంపకానికి తాము చేపట్టిన హరా భరా క్యాంపెయిన్‌కి జాదవ్ పేయెంగ్, దరిపల్లి రామయ్య, రాణా దగ్గుబాటి వంటి ప్రముఖ పర్యావరణవేత్తలు ప్రచారకర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-11-2023	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	525–00
17-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	525–00
వరంగల్	527–00

కార్వీ మాజీ అధికారుల బ్యాంకు ఖాతాల అటాచ్‌మెంట్

సెబీ ఆదేశాలు

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) క్లయింట్ల నిధుల దుర్వినియోగం కేసుకు సంబంధించి రూ. 1.80 కోట్లు రాబట్టేందుకు కార్వీ గ్రూప్ మాజీ అధికారులైన ముగ్గురి బ్యాంక్, డీమ్యాట్ ఖాతాలు, లాకర్లను అటాచ్ చేయాల్సిందిగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. వీరిలో మాజీ వీపీ (ఫైనాన్స్, అకౌంట్స్) కృష్ణ హరి జి., మాజీ కాంప్లయెన్స్ ఆఫీసర్ శ్రీకృష్ణ గురజాడ, బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్స్ జీఎం శ్రీనివాస రాజు ఉన్నారు. వీరి ఖాతాల నుంచి డెబిట్ లావాదేవీలను అనుమతించరాదంటూ బ్యాంకులు, డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు సెబీ సూచించింది. అయితే, క్రెడిట్ లావాదేవీలకు అనుమతి ఉంటుంది. క్లయింట్ల సెక్యూరిటీలను వారికి తెలియకుండా తనఖా పెట్టి కేఎస్‌బీఎల్ దాదాపు రూ. 2,033 కోట్ల మేర నిధులు సమీకరించిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఈ ఏడాది మే నెలలో సెబీ కృష్ణ హరికి రూ. 1 కోటి, రాజుకి రూ. 40 లక్షలు, శ్రీకృష్ణకు రూ. 30 లక్షల జరిమానా విధించింది. వడ్డీలు, ఇతర వ్యయాలతో సహా మొత్తం సుమారు రూ. 1.8 కోట్లు కట్టాలంటూ గత నెల డిమాండ్ నోటీసులు జారీ చేసింది.

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు డీలా

ఆర్‌బీఐ వ్యక్తిగత రుణ నిబంధనలు కఠినతరం ప్రభావం

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వ్యక్తిగత రుణాలపై నిబంధనలు కఠినతరం చేయడంతో బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా స్టాక్ సూచీల రెండు రోజుల ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 188 పాయింట్లు నష్టపోయి 65,795 వద్ద ముగిసింది. నిఫ్టీ 33 పాయింట్లు పతనమైన 19,732 వద్ద నిలిచింది. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 343 పాయింట్లు క్షీణించి 65,640 వద్ద, నిఫ్టీ 98 పాయింట్లు పతనమై 19,667 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. అయితే క్రూడాయిల్ ధరలు తగ్గుదల, ఎఫ్ఐఐల తాజా కొనుగోళ్లు సూచీల నష్టాలను పరిమితం చేశాయి. నష్టాల మార్కెట్లోనూ వినిమయ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, పారిశ్రామిక, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ షేర్లు రాణించాయి.

- ఎస్‌బీఐ 4%, యాక్సిస్ బ్యాంక్ 3%, కెనరా బ్యాంక్ 2%, ఐసీఐసీఐ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్‌లు 1.50%, బ్యాంక్ ఆఫ్ బరోడా 1%, కోటక్ బ్యాంక్ అరశాతం, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు 0.15% చొప్పున నష్టపోయాయి.
- బ్యాంకింగేతర కంపెనీలైన ఎస్‌బీఐ కార్డ్స్, ఉజ్జీవన్ ఫైనాన్స్ షేర్లు 5%, అర్మన్ ఫైనాన్స్ సర్వీసెస్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ షేర్లు 3%, బజాజ్ ఫైనాన్స్ షేరు 2% నష్టపోయాయి.

ఫ్లెయిర్ రైటింగ్ @ రూ. 288–304

ఈ నెల 22-24 మధ్య ఐపీవో



ఫ్లెయిర్ బ్రాండ్ పెన్నుల తయారీ కంపెనీ ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. షేరుకి రూ. 288–304 చొప్పున ఇందుకు ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 22న ప్రారంభమై 24న ముగియనుంది. ఐపీవో ద్వారా కంపెనీ రూ. 593 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు 100 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 49 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

గాంధార్ ఆయిల్ ఐపీవో 22న



ప్రైవేట్ రంగ ఇంధన కంపెనీ గాంధార్ ఆయిల్ రిఫైనరీ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు షేరుకి రూ. 160–169 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 22న ప్రారంభమై 24న ముగియనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 88 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

భారత్‌పై ఇన్నోవా సొల్యూషన్స్ ఫోకస్..

- 2024లో కార్యకలాపాలు మరింతగా విస్తరణ



ప్రదీప్ యడ్లపాటి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఐటీ సంస్థ ఇన్నోవా సొల్యూషన్స్ భారత మార్కెట్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. వచ్చే ఏడాది (2024) ఇక్కడ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు పెద్ద ఎత్తున నియామకాలను కూడా చేపట్టనుంది. సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, భారత విభాగం హెడ్ ప్రదీప్ యడ్లపాటి ఈ విషయాలు తెలిపారు. అమెరికాలోని జార్జియా కేంద్రంగా పనిచేస్తున్న ఇన్నోవా సొల్యూషన్స్ 1998లో ప్రారంభమైంది. 2010లో పేరోల్ సిస్టమ్స్, 2016లో టెక్నాలజీ సొల్యూషన్స్ విభాగంలోకి కంపెనీ ప్రవేశించింది. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా), కమ్యూనికేషన్స్, మీడియా తదితర రంగాల్లో వెయ్యికి పైగా క్లయింట్లకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం అమెరికా, భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, సింగపూర్ తదితర దేశాల్లో 100 పైచిలుకు కార్యాలయాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా 55,000 మంది పైచిలుకు ఉద్యోగులు ఉండగా.. భారత్‌లో 10,000 మంది సిబ్బంది ఉన్నారు. భారత్, ఆసియా–పసిఫిక్‌లోని తమ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం ఈ ఏడాది తొలినాళ్లలో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో కీలక హోదాలో ఉన్న యడ్లపాటిని నియమించుకుంది.

పబ్లిక్ ఇష్యూకి ఫెడ్‌ఫినా

ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్‌లో భాగమైన ఆర్థిక సేవల సంస్థ ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఫెడ్‌ఫినా) తాజాగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా రూ. 1,092 కోట్లు సమీకరించనుంది. నవంబర్ 22న ప్రారంభమయ్యే ఐపీవో మూడు రోజుల పాటు ఉంటుంది. షేరు ధర శ్రేణిని రూ. 133–140గా నిర్ణయించినట్లు సంస్థ సీఈవో అనిల్ కొఠారి తెలిపారు. ఐపీవోలో భాగంగా కొత్తగా రూ. 600 కోట్ల విలువ చేసే షేర్లు జారీ అవుతున్నాయి.



నైశిక్ రెడ్డికి డబుల్స్ టైటిల్

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్‌లో భాగంగా జరిగిన రాజ్‌షాహి అండర్-18 చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన గనగామ నైశిక్ రెడ్డి డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి (భారత్)-పవోర్న్‌ప్రుచ్ నగన్‌బున్‌శ్రీ (థాయ్‌లాండ్) జోడీ ఫైనల్లో 1-6, 7-5, 10-7తో జున్ హైయోక్ హాన్-జిసుంగ్ లీ (దక్షిణ కొరియా) జంటను ఓడించి టైటిల్‌ను దక్కించుకుంది.

పాక్ చీఫ్ సెలెక్టర్‌గా వహాబ్ రియాజ్



పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చీఫ్ సెలక్టర్‌గా మాజీ పేస్ బౌలర్ వహాబ్ రియాజ్‌ను నియమించారు. త్వరలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించే పాకిస్తాన్ టెస్టు, టి20 జట్లను ఎంపిక చేయడమే వహాబ్ తొలి సెలక్షన్ ప్రక్రియ కానుంది. మూడు వన్డే వరల్డ్‌కప్‌లు ఆడిన 38 ఏళ్ల వహాబ్ అంతర్జాతీయ క్రికెట్‌లో 27 టెస్టులు, 91 వన్డేలు, 36 టి20లు ఆడి మొత్తం 237 వికెట్లు తీశాడు.

అటెన్షన్ ప్లీజ్! అహ్మదాబాద్ వెళ్లవలసిన!

భారత్, ఆస్ట్రేలియా ఫైనల్‌పై సర్వత్రా ఆసక్తి

దారులన్నీ అహ్మదాబాద్ వైపే

క్రికెట్ క్రేజ్‌లో భారత అభిమానులు

నింగినంటే రేట్లతో వ్యాపార వర్గాలు



విన్యాసాలకు రిహార్సల్స్

భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ ఫైనల్‌కు ముందు పది నిమిషాల పాటు ఎయిర్ షోతో కనువిందు చేయనుంది. ఇందుకోసం శుక్రవారం ఈ టీమ్ స్టేడియంపై వైమానిక విన్యాసాలను రిహార్సల్స్ చేసింది.

యువర్ అటెన్షన్ ప్లీజ్! అహ్మదాబాద్ వెళ్లవలసిన రోడ్డు, రైలు, ఆకాశ మార్గాలన్నీ కిక్కిరిసి ఉన్నాయి. ఇందులో ఏది ఎక్కినా చుక్కలు చూడటం ఖాయం. తినాలనుకుంటే రేట్లు చూసిన వెంటనే కడుపు నిండిపోయే 'మెనూ'లున్నాయి. బస చేయాలంటే సాధారణ హోటళ్లలోనే వేల రూపాయలు, స్టార్ హోటళ్లలో రూ. లక్షలు... ఫైనల్ ఆట కంటే ముందే 'హాట్ హాట్' టాపిక్‌లయ్యాయి.

అహ్మదాబాద్: తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. కానీ యావత్ దేశం మాత్రం భారత క్రికెట్ జట్టు వన్డే ప్రపంచకప్ టైటిల్ పోరాటాన్ని చూసేందుకు ఇప్పటి నుంచే సిద్ధమైపోతోంది. ప్రయాణ టికెట్లు వేలకు వేలైనా... తినుబండారాలు ఖరీదైనా... హోటల్ గదులు ఎన్ని వేల రూపాయలైనా సరే భారత అభిమానులు మాత్రం 'తగ్గేదేలే' అంటున్నారు. లక్ష పైచిలుకు మంది ప్రత్యక్షంగా చూసే నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరిగే ఫైనల్ కోసం ఖర్చులు బారెడైనా... కళ్లు కాయలు కట్టుకొని మరీ చూసేందుకు ఎదురు చూస్తున్నారు. ఆస్ట్రేలియా రూపంలో గట్టి ప్రత్యర్థి ఎదురైనా... 2003 ఫైనల్ బూచీ వెంబడిస్తున్నా... టీమిండియా అజేయ జైత్రయాత్రపైనే అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు. మూడు రోజుల క్రితం న్యూజిలాండ్ జట్టుపై గత ప్రపంచ కప్ సెమీఫైనల్ ప్రతీకారాన్ని తీర్చుకున్న భారత్... 20 ఏళ్ల క్రితం ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఫైనల్ ఓటమి ప్రతీకారాన్ని కూడా తీర్చుకుంటుందని సగటు అభిమానులంతా ఆశిస్తున్నారు.

రేట్లు ఎన్నో రెట్లు...

అహ్మదాబాద్‌లో సాదాసీదా డార్మెటరీ, మోస్తరు గదులున్న హోటళ్లలో కేవలం రూ.1000, మహా అయితే రూ. 3000 ఉండే గదుల రేట్లు అమాంతం రూ. 20 వేలు, నుంచి 50 వేలకు పెరిగిపోయాయి. ఏసీ, లగ్జరీ సదుపాయాలంటే ఆ రేటు ఇక చెప్పాల్సిన పనేలేదు. లక్షకు అటు ఇటుగానే ఉండనుంది. అలాగే అత్యంత పరిమితంగా 5000 అటు ఇటుగా ఉన్న త్రీస్టార్, ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేయాలంటే రూ. 2 లక్షలదాకా వెచ్చించాల్సిందే. నిజం చెప్పాలంటే ఫైనల్ జరుగుతుంది ముంబైలో కాదు... అహ్మదాబాద్‌లో కాబట్టి చిన్నా, చితక హోటళ్లు, డార్మెటరీ బెడ్లు అన్నీ కలుపుకున్నా 10 వేలకు మించవు. కాబట్టే రేట్లు రాకెట్లలా దూసుకెళ్తున్నాయి.



పిచ్‌ను పరిశీలిస్తున్న రోహిత్

విమానం ఎక్కితే...

అహ్మదాబాద్ వెళ్లే విమానం ఎక్కితే దేశంలో ఎక్కడి నుంచైనా దాదాపు రూ. 5 వేల నుంచి 9 వేల లోపే ఉంటుంది. నెలముందు బుక్ చేసుకుంటే సగం రూ. 3 వేల లోపే అందుబాటులో ఉంటాయి. కొన్ని సంస్థ ప్రొమో కోడ్‌లతో 500 వందలైనా తగ్గేవి. కానీ అలా చూసుకుంటే రూ. 2500 టిక్కెట్ ధర ఇప్పుడు ఏకంగా రూ. 25 నుంచి 35 వేల మధ్యకు పెరిగింది. ఇది నిన్నటి (శుక్రవారం) ధరలు. శనివారం బుక్ చేసుకుంటే మాత్రం అర లక్షయినా ఆశ్చర్యం కలుగక మానదు. పలు విమానయాన సంస్థలు ఆ రూట్లో ప్రత్యేకంగా ఫ్లైట్లు అందుబాటులో పెడుతున్నా అవేవీ ప్రయాణికుల రద్దీని తట్టుకోలేకపోతున్నాయని టికెట్ ఏజెంట్స్ చెబుతున్నారు.

రోహిత్ క్యాచింగ్ ప్రాక్టీస్



జడేజా

శుక్రవారం భారత జట్టుకు ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్ జరిగింది. కెప్టెన్ రోహిత్ శర్మ, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, ఇషాన్ కిషన్, ప్రసిధ్ కృష్ణ, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పారస్ మాంబ్రే మైదానానికి వచ్చారు. ద్రవిడ్‌తో కలిసి రోహిత్ పిచ్‌ను పరిశీలించాడు. ఆ తర్వాత కొంతసేపు క్యాచింగ్ ప్రాక్టీస్ చేశాడు. జడేజా, ఇషాన్ నెట్స్‌లో బ్యాటింగ్ చేశారు.

విజేత జట్ల కెప్టెన్లకు ఆహ్వానం

ఇప్పటి వరకు జరిగిన 12 వన్డే ప్రపంచకప్ టోర్నీలలో విజేత జట్లకు కెప్టెన్‌లకు వ్యవహరించిన వారికి ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆహ్వానించనుంది. క్లయివ్ లాయిడ్ (వెస్టిండీస్; 1975, 1979), కపిల్ దేవ్ (భారత్; 1983), అలెన్ బోర్డర్ (ఆస్ట్రేలియా; 1987), ఇమ్రాన్ ఖాన్ (పాకిస్తాన్; 1992), అర్జున రణతుంగ (శ్రీలంక; 1996), స్టీవ్ వా (ఆస్ట్రేలియా; 1999), రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా; 2003, 2007), ధోని (భారత్; 2011), మైకేల్ క్లార్క్ (ఆస్ట్రేలియా; 2015), ఇయాన్ మోర్గాన్ (ఇంగ్లండ్; 2019) ఈ జాబితాలో ఉన్నారు. జైలులో ఉన్న పాక్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ హాజరయ్యే అవకాశమే లేదు. తెర వెనుక నుంచి శ్రీలంక క్రికెట్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని బీసీసీఐ కార్యదర్శి జై షాపై విమర్శలు గుప్పించిన శ్రీలంక మాజీ సారథి అర్జున రణతుంగ కూడా ఫైనల్‌కు రావడం అనుమానమే.

మ్యాచ్‌కు భారత ప్రధాని, ఆసీస్ ఉప ప్రధాని

ఫైనల్‌ను చూసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ విచ్చేయనున్నారు. వీరితో పాటు బడా పారిశ్రామిక దిగ్గజాలు, పలు రంగాలకు చెందిన దిగ్గజాలు, భారతీయ సినీ రంగ ప్రముఖులంతా హాజరు కానున్న నేపథ్యంలో గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ శుక్రవారం గాంధీనగర్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అతిరథ మహారథులతో పాటు సాధారణ ప్రేక్షకులకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. విశ్వవిజేతగా నిలిచే జట్టుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ట్రోఫీని అందజేసే అవకాశముంది.

సెమీస్‌లో బోపన్న జోడీ



టురిన్ (ఇటలీ): ఈ ఏడాది తమ అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తూ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ... పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన రెడ్ గ్రూప్ చివరి లీగ్ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 7-6 (7/5)తో ఈ ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ చాంపియన్స్ వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జంటపై గెలిచింది. ఈ గెలుపుతో రెడ్ గ్రూప్ నుంచి బోపన్న-ఎబ్డెన్; రాజీవ్ రామ్ (అమెరికా)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీలు సెమీఫైనల్‌కు అర్హత పొందాయి. ఈ సీజన్‌లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 40 మ్యాచ్‌ల్లో గెలిచింది. సీజన్ ముగింపు టోర్నీలో బోపన్న ఆడటం ఇది నాలుగోసారి (2023, 2015, 2012, 2011) కాగా, ఎబ్డెన్ తొలిసారి బరిలోకి దిగాడు. మరోవైపు ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో వరల్డ్ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా), రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్), మెద్వెదెవ్ (రష్యా), యానిక్ సినెర్ (ఇటలీ) సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు.

భారత్ శుభారంభం



మాన్వీర్

కువైట్ సిటీ: ఫుట్‌బాల్ ప్రపంచకప్–2026 ఆసియా జోన్ రెండో రౌండ్ క్వాలిఫయింగ్ పోటీల్లో భారత్ శుభారంభం చేసింది. సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు 1–0 గోల్ తేడాతో కువైట్ జట్టును ఓడించింది. ఆట 75వ నిమిషంలో మాన్వీర్ సింగ్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని 22 ఏళ్ల తర్వాత వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో విదేశీ గడ్డపై భారత్ తొలి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈనెల 21న ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో భారత్ రెండో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో భారత్, ఖతర్, కువైట్, అఫ్గానిస్తాన్ జట్లున్నాయి. ఇంటా, బయట పద్ధతిలో జరిగే లీగ్ మ్యాచ్‌లు ముగిశాక గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు మూడో రౌండ్‌కు అర్హత పొందుతాయి. ఇప్పటి వరకు భారత జట్టు ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో మూడో రౌండ్ కు అర్హత సాధించలేదు.

క్లుప్తంగా...

20 నుంచి ఆడిట్ వారోత్సవాలు

ప్రారంభించనున్న గవర్నర్ తమిళిసై


సాక్షి, హైదరాబాద్: ఆడిట్ వారోత్సవాలను ఈనెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు ఆ శాఖ పరిపాలనా విభాగం డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఆర్.రాజశేఖర్ తెలిపారు. అకౌంటెంట్ జనరల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో జరిగే ఈ వారోత్సవాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రారంభిస్తారని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వారోత్సవాల ప్రారంభానికి ముందురోజు 19న కార్యాలయ సిబ్బంది పిల్లలకు వాకథాన్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న మధ్యాహ్నం జరిగే ప్యానల్ సమావేశంలో జీఎస్టీ–కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ రాజేంద్ర నింజే, పారదర్శక పాలన ప్రచారకర్త, ఫ్యాకల్టీ ఫౌండర్ రాకేశ్, ఇన్వెస్టిగేషన్ విభాగం డీజీపీటీ సంజయ్ బహదూర్ పాల్గొంటారని తెలిపారు. 22న రక్తదాన శిబిరం, హెల్త్‌క్యాంపు, కేన్సర్ చెకప్ క్యాంపులతో పాటు నిపుణులతో ఆరోగ్యం, రూరల్ టెక్నాలజీ, నిర్మాణ మెటీరియల్‌పై ఉపన్యాసం ఉంటుందని వివరించారు. 23న మధ్యాహ్నం 2.30 నుంచి ఫుడ్‌కోర్టు, క్విజ్, టాలెంట్ డిస్‌ప్లేతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

టీఎస్‌టీడీసీ ఎండీ మనోహర్ రావుపై సస్పెన్షన్ వేటు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో తిరుమలలో కనిపించినట్లు ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారనే ఆరోపణలపై రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టీఎస్‌టీడీసీ) ఎండీ బోయినపల్లి మనోహర్‌రావును సస్పెండ్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆయనకు ఓఎస్డీగా వ్యవహరిస్తున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ వై.సత్యనారాయణను ఉద్యోగం నుంచి తొలగించాలని తెలిపింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన విషయంలో పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి నుంచి వివరణ కోరాలని సూచించింది. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలియజేస్తూ 19వ తేదీలోగా నివేదిక సమర్పించాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రెటరీ సంజయ్‌కుమార్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ)కి లేఖ రాశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎక్సైజ్ శాఖమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఈనెల 15న తిరుమల దేవస్థానాన్ని సందర్శించగా.. మనోహర్‌రావు, వై.సత్యనారాయణ ఆయనతో కలిసి కనిపించారని ఈసీకి ఫిర్యాదు అందింది. దీనిపై సీఈఓ కార్యాలయం సమర్పించిన నివేదిక ఆధారంగా ఈసీ నిర్ణయం తీసుకుంది. అధికారుల ప్రవర్తన, ప్రొటోకాల్‌కి సంబంధించి ఎన్నికల కోడ్‌లో పొందుపర్చిన నిబంధనలను ఉల్లంఘించినట్లు ఈసీ అభిప్రాయపడింది.

నామినేషన్ ఆమోదానికి ఆదేశాలివ్వలేం: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన నామినేషన్‌ను ఆమోదించేలా ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. మధిర నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మందూరి శారద నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఫామ్–ఏ, ఫామ్–బీ ఒరిజినల్స్‌కు బదులు జిరాక్సు దాఖలు చేశారు. దీంతో రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. దీన్ని సవాల్ చేస్తూ శారద పిటిషన్ దాఖలు చేయగా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం రాజ్యాంగంలోని ఆర్టికల్ 329బీ ప్రకారం ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని చెప్పింది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్‌కు సూచించింది.

సీఈఓ ఆఫీసులో కమాండ్ కంట్రోల్ రూమ్

రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 119 శాసనసభ నియోజకవర్గాల్లోని మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులను సీఈఓ బృందం ఈ కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షిస్తుందని ప్రకటన పేర్కొంది. 'ఎన్నికల అధికారుల తనిఖీలు, స్వాధీనాలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, 1950 కాల్ సెంటర్‌కు అందిన ఫిర్యాదులు, సి–విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులు, సువిధ తదితర అంశాలను దీని ద్వారా పరిశీలిస్తుంది. అదే విధంగా ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదిస్తూ తగిన నిర్ణయాలను తీసుకుని ఆదేశాలు జారీ చేస్తారు. కాగా ఓటరుగా పేరు నమోదు, వివరాల పరిశీలన, ఎపిక్ కార్డులవంటి సమాచారాన్ని ఇవ్వడానికి ఏర్పాటైన 1950 టోల్ ఫ్రీ నంబరుతో పనిచేసే హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే, జాతీయ ఫిర్యాదుల పరిష్కార విభాగంలో నమోదు చేస్తారు..' అని ప్రకటనలో పేర్కొంది.

వారి అవినీతి సంపదను ప్రజలకు పంచుతాం

ఇక్కడ కేసీఆర్‌ను.. ఢిల్లీలో మోదీని గద్దె దింపుతాం: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ



వరంగల్ పోచమ్మమైదాన్‌కు పాదయాత్రగా వస్తున్న రాహుల్

- మేం గెలిచాక ఆరు గ్యారంటీలపైనే తొలి నిర్ణయం
- కులగణన చేసి ఓబీసీ రిజర్వేషన్ అమలు చేస్తాం
- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకే చెట్టు కొమ్మలు
- కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు ఎంఐఎంను వాడుకుంటున్నారు.. ఈ ఎన్నికలు దొరల తెలంగాణ– ప్రజల తెలంగాణ మధ్య యుద్ధం
- 'హస్తం' గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపు
- నర్సంపేట, వరంగల్, పినపాకలలో రాహుల్ రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు

జ్యూస్ తాగి.. చేతి గుర్తుకు ఓటేయాలని..



వరంగల్ తూర్పు సెగ్మెంట్ పరిధిలో పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ.. జేపీఎన్ రోడ్డులోని ఓ జ్యూస్ సెంటర్ వద్ద ఆగారు. ఫ్రూట్ సలాడ్ తిని, జ్యూస్ తాగారు. షాప్ నిర్వాహకుడు పుల్లూరి శ్రీధర్‌తో కరచాలనం చేసి.. హస్తం గుర్తుకు ఓటేయాలని కోరారు.

సాక్షి, వరంగల్/ వరంగల్/ నర్సంపేట/ సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రమిస్తే.. ఆ ఫలాలు పూర్తిగా ఒక్క కల్వకుంట్ల కుటుంబానికే దక్కాయని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లు అవినీతి పాల్పడ్డారని.. కాంగ్రెస్ వచ్చాక ఆ అవినీతి సంపదను వెలికితీసి ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో పంచుతామని చెప్పారు. కాంగ్రెస్ గెలిస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారంటీ హామీలపై తొలి సంతకం లేదా తొలి నిర్ణయం ఉంటుందని ప్రకటించారు. కేసీఆర్‌ను ఇంటికి పంపడమే తమ లక్ష్యమని.. తర్వాత ఢిల్లీలో మోదీని గద్దె దింపుతామని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో, వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో పర్యటించారు. స్థానికంగా పాదయాత్రలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు నిర్వహించి ప్రసంగించారు. వివరాలు రాహుల్ గాంధీ మాటల్లోనే..

''బీజేపీ, బీఆర్ఎస్ ఒకే చెట్టు కొమ్మలు. మోదీ వాహనానికి పంక్చరైతే కేసీఆర్ గాలి కొడతారు. కాంగ్రెస్ ధాటికి మోదీ వాహనం పచ్చడైంది. అందుకే పరోక్షంగా కేసీఆర్‌కు సహకరిస్తున్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఏదైనా బీజేపీ నేతలు కనుసైగ చేస్తే బీఆర్ఎస్ నేతలు తలూపుతారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ఎంఐఎంను బీజేపీ వాడుకుంటోంది. గల్లీలో కేసీఆర్, ఢిల్లీలో మోదీ జాతుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. కానీ కాంగ్రెస్ ప్రేమ బీజాలను నాటుతుంది. తెలంగాణతో కాంగ్రెస్‌కు ఉన్నది రాజకీయ బంధం కాదు.. రక్త సంబంధం. ప్రస్తుతం దొరల తెలంగాణ– ప్రజల తెలంగాణ మధ్య యుద్ధం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రజల తెలంగాణ కోసం ఈ యుద్ధంలో పోరాడుతోంది. బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధిచెప్పి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి.

రైతులను మోసం చేశారు

బీఆర్ఎస్ సర్కారు రైతులను మోసం చేసింది. భూములను క్రమబద్ధీకరిస్తామని చెప్పి ధరణి పోర్టల్‌తో 20 లక్షల కుటుంబాల భూమిని గుంజుకున్నారు. రుణమాఫీ చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీరందరికీ న్యాయం చేస్తాం. తెలంగాణకు కాంగ్రెస్ ఏమీ చేయలేదని కేసీఆర్ అంటున్నారు. కేసీఆర్ చదువుకున్న బడి, కాలేజీ, యూనివర్సిటీలను కాంగ్రెస్ ప్రభుత్వాలే కట్టించాయని గుర్తుపెట్టుకోవాలి. హైదరాబాద్ ఐటీ క్యాపిటల్‌గా మారేందుకు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే.

మావి ఉత్త మాటలు కాదు: కేసీఆర్, మోదీలు చెప్తున్నట్టుగా మావి ఉత్తుత్తి హామీలు కాదు. ఆరు గ్యారంటీలను అధికారంలోకి రాగానే అమలుచేసి తీరుతాం. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఎకరాకు రూ.15,000 పెట్టుబడి సాయం, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన నిర్వహించి, ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం. పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్ వల్ల కొత్త నాయకత్వం వచ్చే అవకాశం ఉంటుంది..'' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.



మణుగూరు రోడ్డు షోకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

ప్రగతిభవన్‌ను 'ప్రజాపాలనా భవన్'గా మారుస్తాం

రాహుల్ గాంధీ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: జవాబుదారీతనం, పారదర్శకతతో ప్రజల తెలంగాణను నిర్మించేందుకు తమ తో కలిసి రావాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' ట్యాగ్‌లైన్‌తో శుక్రవారం ఎక్స్ యాప్‌లో ట్వీట్ చేశారు. ''కాంగ్రెస్ పార్టీ గెలుపు ప్రజల తెలంగాణలో స్వర్ణ యుగానికి నాంది పలకనుంది. ప్రగతి భవన్ పేరును ప్రజా పాలనా భవన్‌గా మారుస్తాం. 24 గంటలపాటు ఆ భవన్ ద్వారాలు తెరిచే ఉంటాయి. సీఎంతోపాటు మంత్రులు క్రమం తప్పకుండా ప్రజా దర్బార్ నిర్వహించడం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని 72 గంటల్లో వాటి పరిష్కారానికి కృషి చేస్తారు..'' అని రాహుల్ పేర్కొన్నారు.

నాలుగేళ్ల కుమార్తెకు ఉరివేసి.. దంపతుల ఆత్మహత్య

ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలో విషాదం



బౌద్ధనగర్: 'మేము చావడానికి కారణం ఆ నలుగురే. వారిని విడిచిపెట్టకండి'అని సూసైడ్ నోట్ రాసి నాలుగేళ్ల కూతురుతో సహా దంపతులు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటన హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన కొప్పుల సాయికృష్ణ (37), చిత్రకళ(30) దంపతులు. వీరికి తేజస్వి అనే నాలుగేళ్ల పాప ఉంది. ఏడాది నుంచి ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలో నివసిస్తున్నారు. సాయికృష్ణ గతంలో ర్యాపిడో బైక్ నడిపేవాడు. ఏడాదిగా ఉద్యోగానికి వెళ్లడం లేదు. భార్య చిత్రకళ నాంపల్లి బిర్లా సైన్స్ సెంటర్‌లోని టికెట్ కౌంటర్‌లో ఉద్యో గం చేస్తుండేది. అయితే అపాయింట్మెంట్ ఆర్డర్, పే స్లిప్ అడిగిన నేపథ్యంలో నెల క్రితం ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. భర్తకు పని లేకపోవడం, తనను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించడాన్ని జీర్ణించుకోలేని చిత్రకళ తీవ్ర మనోవేదనకు గురైంది. లేనిపోని కారణాలు చూపి తనను ఉద్యోగం నుంచి తొలగించిన నలుగురు ఉద్యోగులు శ్యాం కొటారి, గాతా, హరిబాబు, సంతోష్ రెడ్డిలను వదిలిపెట్టవద్దని సూసైడ్ నోట్‌లో రాసి ఆ నోట్‌ను గోడకు అతికించింది. ముందుగా కూతురుకి ఉరేసి.. ఆ తర్వాత భార్య, భర్త కూడా ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం రాత్రి వారున్న ఇంట్లో నుంచి పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో పక్కింటి వాళ్లు తలుపులు కొట్టారు. అయినా తీయలేదు. శుక్రవారం ఉదయం ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి తలుపులు బద్దలుగొట్టి చూడగా ముగ్గురూ విగతజీవులై కనిపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను గాంధీ మార్చురీకి తరలించారు.

మృతిపై అనుమానాలు: బిర్లా సైన్స్ సెంటర్‌లో పలు అవకతవకలు జరిగాయని, వాటి గురించి తనకు తెలియడం వల్లనే శ్యామ్ కొఠారి, గీతా రావు, హరిబాబు, సంతోష్ రెడ్డిలు కావాలని తనపై తప్పుడు ఆరోపణలు చేసి ఉద్యోగం నుంచి తొలగించారని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. తాను పని చేసిన కార్యాలయంలో రూ.కోట్లల్లో మోసం జరిగిందని పేర్కొంటూ 12 పాయింట్లతో సూసైడ్ నోట్ రాసి గోడకు అతికించింది. ''ఓ మంత్రితో మాట్లాడేందుకు యత్నించినా కుదరలేదు. ఓ టీవీకి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా స్పందించ లేదు.'' అని అందులో పేర్కొంది. అయితే ఆఫీసులో జరిగిన దానికి కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

'ఇఫ్లూ' పిటిషన్‌ను సీజే ధర్మాసనం ముందు ఉంచండి

సాక్షి, హైదరాబాద్: తార్నాకలోని ఇంగ్లిష్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఆవరణ నుంచి పోలీస్ బలగాలను ఉపసంహరించుకునేలా యూజీసీ, వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ను ఆదేశించాలని దాఖలైన పిటిషన్‌ను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా మార్చి సీజే ధర్మాసనం ముందుంచాలని న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా శుక్రవారం రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేశారు. బలగాలు ఉపసంహరించుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో విద్యార్థుల తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై రెండుసార్లు వీసీకి వినతిపత్రాలు సమర్పించినా చర్యలు తీసుకోలేదన్నారు.

హైదరాబాద్ నుంచి అమృత్‌సర్‌కు విమాన సేవలు

- లక్నో,గ్వాలియర్, కొచ్చిన్ నగరాలకు కొత్తగా విమానాలు
- లక్నో – హైదరాబాద్ మధ్య వారానికి ఆరు సర్వీసులు
- హైదరాబాద్ –గ్వాలియర్ మధ్య వారానికి మూడు సర్వీసులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి మరో నాలుగు నగరాలకు విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సహకారంతో దేశీయ విమానయాన సేవలను విస్తరించినట్లు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు తెలిపారు. వీటిలో మూడు నగరాలకు శుక్రవారం నుంచి (17వ తేదీ) సర్వీసులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం (ఐగీ 954) రోజూ ఉదయం 07:30కి హైదరాబాద్ నుంచి బయల్దేరి 10.15కి అమృత్‌సర్‌కు చేరుకుంటుంది. ఇక లక్నో–హైదరాబాద్ మధ్య వారానికి ఆరు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (ఐగీ 953) హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2.30కి బయల్దేరి సాయంత్రం 4.35కి లక్నోకు చేరుకుంటుంది. అలాగే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (ఐగీ 955) ప్రతీరోజు సాయంత్రం 7.45 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి రాత్రి 9.30 గంటలకు కొచ్చిన్‌కు చేరుకుంటుంది.

గ్వాలియర్‌కు ఆరు సర్వీసులు

నవంబర్ 28 నుంచి హైదరాబాద్–గ్వాలియర్ మధ్య వారానికి మూడు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విమానం హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2.30కి బయల్దేరి సాయంత్రం 4.20కి గ్వాలియర్ చేరుకుంటుంది. ఈ సందర్భంగా జీఎమ్మార్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సీఈవో ప్రదీప్ ఫణిక్కర్ మాట్లాడుతూ...ఈ మార్గాల్లో మెరుగైన అనుసంధానం కోసం కొత్త విమానాలు దోహదం చేయనున్నాయని చెప్పారు.

ఆర్వోల నిర్ణయమే అంతిమం



- వారి నిర్ణయాలను పునఃసమీక్షించే అధికారం ఈసీకి కూడా ఉండదు
- 20లోగా బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తి.. 3 రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణ
- డిప్యూటీ సీఈఓ సత్యవాణి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నామినేషన్ల పరి శీలనలో రిటర్నింగ్ అధికారు (ఆర్వో)లు తీసుకున్న నిర్ణయాలే అంతిమమని, వాటిపై పునః సమీక్ష జరిపే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి సైతం లేదని రాష్ట్ర ఎన్నికల ఉప ప్రధాన అధికారి (డిప్యూటీ సీఈఓ) సత్యవాణి స్పష్టం చేశారు. కొందరు అభ్యర్థుల విషయంలో ఆర్వోల నిర్ణయాలపై వచ్చిన ఫిర్యాదులను తిరిగి వారికే పంపించినట్టు తెలిపారు. ఆర్వోలకు క్వాజీ జ్యుడీషియల్ అధికారాలుంటాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను వివరించేందుకు శుక్రవారం ఆమె బీఆర్‌కేఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 18లోగా పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, 20 లోగా ఈవీఎంల బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తి చేస్తామన్నారు. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం 299 అనుబంధ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతినిచ్చిందని, దీంతో రాష్ట్రంలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 35,655కి పెరిగిందని చెప్పారు. ప్రతి జిల్లాలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఈసీకి ప్రతిపాదనలు పంపించామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దే ఈవీఎంలను నిల్వ చేసే స్ట్రాంగ్ రూమ్స్ ఉంటాయని తెలిపారు. పోలింగ్‌లో వినియోగించిన ఈవీఎంలను కేటగిరీ–ఏ, పోలింగ్ సందర్భంగా మొరాయించిన ఈవీఎంలను కేటగిరీ–బీ కింద పరిగణించి ఒకే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామన్నారు. మాక్‌పోల్‌కి వాడిన ఈవీఎంలను కేటగిరీ–సీ, రిజర్వ్ ఈవీఎంలను కేటగిరీ–డీ కింద పరిగణించి వేర్వేరు స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరుస్తామని వివరించారు.

3 రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

వయోజన, దివ్యాంగ ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం కల్పించే తేదీలను స్థానిక రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారని సత్యవాణి తెలిపారు. మూడు రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహిస్తారన్నారు. పోలింగ్ నవంబర్ 30న జరగనుండగా, దానికి 3 రోజుల ముందులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి పాస్‌లు రావడంలో జాప్యం కావడంతో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం జర్నలిస్టులు చేసుకున్న దరఖాస్తులను జిల్లాల కలెక్టర్లు తిరస్కరించిన అంశంపై పరిశీలన చేస్తామన్నారు.

ఇతర భాషల్లోకి తెలుగు సాహిత్యాన్ని అనువదించాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు. చిత్రంలో కొలకలూరి ఇనాక్

సాక్షి, హైదరాబాద్: తెలుగు భాషలో అపారమైన సాహిత్య సంపద ఉందని, అదంతా ఇతర భాషల్లోకి అనువాదం కావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. కొలకలూరి ఇనాక్ జీవితంపై ఆయన కుమార్తె, పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రాసిన 'నాన్న'తెలుగు గ్రంథాన్ని పారనంది నిర్మల 'బాబూజీ' పేరుతో హిందీలోకి అనువదించారు. శ్రీ త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు ఈ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం, జీవితం ఇతర భాషల ప్రజలకు చేరవలసిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన వెంకయ్య నాయుడు గొప్ప మానవీయ విలువలున్న వ్యక్తి అని అభివర్ణించారు. కార్యక్రమానికి త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఇనాక్ కుమారుడు శ్రీ కిరణ్ పాల్గొన్నారు.

'బీకాం'దే హవా!

రాష్ట్రంలో ముగిసిన డిగ్రీ ప్రవేశాలు

- 2 లక్షల సీట్ల భర్తీ.. మిగిలిన సీట్లు 1.84 లక్షలపైనే..
- బీకాం తర్వాత లైఫ్ సైన్స్‌కు పెరిగిన ఆదరణ
- తక్షణ ఉపాధి కోర్సుల వైపు విద్యార్థుల మొగ్గు
- దోస్త్ ప్రవేశాల డేటా విడుదల చేసిన మండలి



సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో తక్షణ ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులకే విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా బీకాంతోపాటు బీఎస్సీ లైఫ్‌సైన్స్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఉన్నత విద్యా మండలి శుక్రవారం విడుదల చేసిన 2023 దోస్త్ డేటా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. సంప్రదాయ డిగ్రీ కోర్సుల కన్నా.. ఆధునిక హంగులున్న విభాగాల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరారు. ఒకేషనల్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు నామమాత్రంగా ఉన్నాయి. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులకు డిమాండ్ ఎక్కువగా ఉన్నా.. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. బీఏ వంటి కోర్సుల్లో మార్పులు తెచ్చినా, ఆనర్స్ వంటివి అందుబాటులోకి తెచ్చినా విద్యార్థులు వాటికి పెద్దగా మొగ్గు చూపలేదు.

1.84 లక్షల సీట్లు ఖాళీ..: 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో ప్రవేశాల కోసం ఉన్నత విద్యా మండలి పలు దఫాలుగా 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్)'అడ్మిషన్ల ప్రక్రియను ముగించింది. రాష్ట్రవ్యాప్తంగా 3,89,049 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉండగా.. అందులో 2,04,674 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగతా 1,84,375 సీట్లు మిగిలిపోయాయి.

బీకాం వైపే చూపు: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీలోని 11 ప్రధాన కోర్సుల్లో 2,04,674 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. వీరిలో అత్యధికంగా 85,153 మంది బీకాం కోర్సునే ఎంచుకున్నారు. ఆ తర్వాత బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 43,180 మంది చేరారు. తర్వాతి స్థానంలో బీఏ కోర్సు ఉంది. ఇందులో 29,752 మంది చేరారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌కు కూడా డిమాండ్ పెరుగుతోంది. దీనిలో 25,937 మంది చేరారు. కరోనా తర్వాత ఈ–కామర్స్ జోరు పెరిగింది. అకౌంటింగ్, కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన కోర్సులు చేసినవారికి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఆడిట్ విభాగాల్లోనూ ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో కామర్స్ నేపథ్యం ఉన్న వారికి డిమాండ్ వచ్చింది. డిగ్రీ పూర్తవగానే మంచి వేతనంతో ఉద్యోగం వస్తోందన్న భరోసా కనిపిస్తోంది. మరోవైపు సాధారణ డిగ్రీలోనే బొటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ, కంప్యూటర్ సైన్స్ వంటి సబ్జెక్టులను చేర్చి కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంతో వాటికీ డిమాండ్ వస్తోంది.

డిమాండ్ ఉన్న కోర్సులు కోరుకుంటున్నారు



విద్యార్థులు పదేళ్లుగా మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటున్నారు. మార్కెటింగ్ పెరగడం, ఈ–కామర్స్‌లో మంచి అవకాశాలు లభించడంతో బీకాంకు డిమాండ్ పెరుగుతోంది. ఈ కోర్సు రాష్ట్రవ్యాప్తంగానూ మంచి నాణ్యతను చూపుతోంది. లైఫ్ సైన్స్ కోర్సులకు అన్నిచోట్లా ఆదరణ లభిస్తోంది. దీంతోపాటు బీఏ ఆనర్స్ కోర్సులను విద్యార్థులు ఇష్టపడుతున్నారు. ఏదేమైనా డిగ్రీలో ప్రమాణాలు పెంచే దిశగా మండలి ప్రయత్నించడం కూడా ప్రవేశాలు పెరగడానికి దోహదపడుతోంది.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

ఎక్కడ ఎన్నిసీట్లు.. ఎన్ని ప్రవేశాలు?

యూనివర్సిటీ	కాలేజీలు	సీట్ల లభ్యత	చేరిన విద్యార్థులు
ప్రభుత్వ కాలేజీలు, వర్సిటీలు	155	87,112	53,886
ప్రైవేటు కాలేజీలు	831	2,80,683	1,41,772
రెసిడెన్షియల్ కాలేజీలు	78	21,254	9,016
మొత్తం	1,064	3,89,049	2,04,674

ఏ కోర్సులో ఎంత మంది?

బీఏ	29,752	బీఎస్సీ లైఫ్‌సైన్స్	43,180
బీబీఏ	15,160	బీఎస్సీ ఫిజికల్‌సైన్స్	25,937
బీబీఎం	107	బీఎస్‌డబ్ల్యూ	56
బీసీఏ	4,706	బీ.ఒకేషనల్	28
బీకాం	85,153	డిప్లొమా	595

మొత్తం: 2,04,674

చేసేదే చెబుతాం!



కుల గణనకు చట్టపరమైన ఇబ్బందులున్నాయి: లక్ష్మణ్

- వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై దృష్టి పెట్టాం

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిపై (యూనిఫాం సివిల్ కోడ్) నిర్ణయం తీసుకుంటుందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వెల్లడించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ శుక్రవారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీ చెప్పిందే చేస్తుందని, చేసేదే చెబుతుందని స్పష్టం చేశారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని, దీనికి అనేక చట్టపరమైన ఇబ్బందులున్నాయని పేర్కొన్నారు. అందువల్ల వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై దృష్టి పెట్టి, నిజమైన బీసీలకు న్యాయం చేసే దిశగా ఆలోచిస్తున్నామన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య బీసీ గణన నిర్వహించినా ఆ వివరాలు ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. పండిట్ నెహ్రూ మొదలుకొని రాహుల్‌గాంధీ వరకు అందరూ బీసీ వ్యతిరేకులేనని లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ బీసీ సీఎంను చేస్తామంటే ఎద్దేవా చేసి.. ఓబీసీలను అవమానించిన రాహుల్‌గాంధీ ఇప్పుడు వారిపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కచ్చితంగా జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. దీనిపై ఏడుగురు న్యాయమూర్తుల కమిటీ ఏర్పాటు చేసినందున రాజకీయంగా, చట్టపరంగా ఎలా చేయాలన్న అంశంపై కేంద్ర ప్రభు త్వం దృష్టి పెట్టిందని వివరించారు. కాంగ్రెస్ నుంచి 2014లో గెలిచిన ఎమ్మెల్యేల్లో ఏడుగురు, 2018 లో 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారని, ఈరోజు కాకపోతే భవిష్యత్‌లోనైనా ఆ పార్టీ బీఆర్ఎస్‌తో కలవక తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పాలించేందుకు కాంగ్రెస్‌కు 11సార్లు అవకాశమిచ్చారని, గతంలో టీడీపీకి, ఇప్పుడు పదేళ్ల పాటు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చినందున ఈసారి బీజేపీకి అవకాశమివ్వాలని ప్రజలకు లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

అధికారమిస్తే యోగి యూపీ మోడల్

బీజేపీ అధికారంలోకి వస్తే యోగి ఆదిత్యనాథ్ యూపీ నమూనాను ఇక్కడ అమలు చేస్తామని లక్ష్మణ్ వెల్లడించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో మాదిరిగా బీజేపీ ఎన్నికల ప్రణాళికలోనూ ఉచితాలు ఉంటాయా? అన్న ఓ విలేకరి ప్రశ్నకు లక్ష్మణ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ఇస్తున్న గ్యారంటీలన్నీ కూడా ఓట్ల కోసం వేస్తున్న గాలాలే తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇది రుజువైందని గుర్తు చేశారు. ఉచితాలు, సరైన పద్ధతిలో సంక్షేమ పథకాల అమలుతో పేదలకు లబ్ధి చేకూర్చడం మధ్య వ్యత్యాసం ఉందన్నారు. హంతకుడే క్షమాపణలు చెప్పినట్టు.. కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం వ్యాఖ్యలున్నాయని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.